APPROVED 433

ಸಂಕ್ರಾಂತಿ

RE-2



88
2232



3 R3.01
30.4-
2 R R R

ಕಾವ್ಯ

(5)

Npro16243

హంతకులెవరు?

వర్గ శత్రువులను నిర్మూలించడం తమ రాజకీయ విధానమని ప్రకటించిన తీవ్రవాదులు మాత్రమే హంతకులా లేక అమాయక పౌరులను ప్రత్యేకించి విద్యార్థులను కిరాతకంగా హింసించి చంపించిన పాలకులు నిజమైన హంతకులా? శ్రీ భార్గవ న్యాయవిచారణ సంఘం తేల్చవలసి ఉన్నది. ఈ సందర్భంలో వివిధ దృక్కోణాలనుండి తీవ్రవాదుల ఉద్యమం పర్యావలోకన, హత్యల సమీక్షే ఈ ప్రచురణ.

- ఆదిరాజు వెంకటేశ్వరరావు

Rs 4-00

ప్రచురణ
'వెలుగు' పబ్లికేషన్స పక్షాన
యం. శేషగిరిరావు
5-9-22/106, ఆదర్శనగర్, హైదరాబాదు-500 483

HANTHAKULEVARU

(Who are the murderers)

by Adiraju Venkateswer rao

Published by M Seshagiri rao for 'Velugu' publications.

PRICE RUPEES SIX (C) PUBLISHER

Printed at Jaya Vijayawada-2

Cover : By Shri Venkatesh Yadev At Venkatesh Press
Gowliguda, Hyderabad

Copies can be had from :

Navodaya publishers,
Publishers and book sellers, Eluru road, Vijayawada-2

Book Links corporation,
Narayanaguda, Hyderabad-500 029

The Book Centre,
Main Road, Visakhapatnam.

Navayuga Book House
Sultan Bazar, Hyderabad.

Aruna publishing house,
Eluru Road. Vijayawada-2

అంకితం

కామ్రేడ్స్

కిష్టాగౌడ్, భూమయ్యలకు

గీత కార్మికుడు కిష్టయ్య, బిక్షాటనతో జీవితం గడపిన జంగం దేవర భూమయ్య, సంఘసేవ మంచితనం వలన ప్రజాభిమానం పొంది అన్యాయాలు ప్రతిఘటించారు.

వంచన చేయాలనుకున్నవారు లంచాలిచ్చి వీరిని భూనీకేసులో ఇరికించారు.

లోప భూయిష్టమైన పాలనా యంత్రాంగం, న్యాయవ్యవస్థ తప నిర్దోషిత్వం బుజువు చేసుకొనేందుకు, అర్థికంగా బలహీనులైన ఈ ఇద్దరికీతోడ్పడలేదు.

వారి ప్రాణాలు కాపాడేందుకు కన్నాభిరాన్‌తోసహా కొందరున్యాయ వాదులు భూపేష్‌గుప్త, చంద్రరాజేశ్వరరావుతో సహా పలువురు రాజకీయ నాయకులు చేసిన ప్రయత్నాలు విఫలమవగా, ఇటీవలే ముషీరాబాద్ జైలులో వారి ఉరిశిక్ష అమలు జరిగింది.

కృతజ్ఞతలు

'స్క్రిప్టు' అంతా శ్రద్ధగా చదివి, నాఅభిప్రాయాలతో వారు ఏకీభవించని విషయాలూ ఇందులో వున్నా, అనేక విషయాలు నాకు విడమరచి చెప్పిన

కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్యగారికి

హృదయపూర్వక ధన్యవాదాలు

వివిధ దశలలో నాతో సహకరించిన మిత్రులు శ్రీ ఘంటశాల వెంకట చలపతిరావు, మొక్కపాటి శ్రీరాం, బి.వి.ఎ.ఎన్. రెడ్డి, యం. రామమోహన్‌రావు, లక్ష్మయ్యనాయుడు. బండా సూర్యనారాయణ, రమణారెడ్డి, నాగరాజు, శ్రీ కె. బి. సత్యన్నారాయణరావు, కుమారిఉష, శ్రీ శిఖామణి, వి. లక్ష్మిపతి, శ్రీమతి ఆదిరాజు వరలక్ష్మిగార్లకు నా కృతజ్ఞతలు.

ఇంకా —

నన్ను విశ్వాసంలోకి తీసుకొని అనేక విషయాలు తెలిపిన తార్కుండేకమిటీ సభ్యులు కన్నాభిరాన్, అరుణ్‌షవురే, బల్వంతరెడ్డి గారలకు, అత్యవసర పరిస్థితిలో జరిగిన హత్యల గురించీ హతులు నిర్బంధించబడినతీరు, తరువాత పరిణామాలు అరమరికలు లేకుండా వివరంగా చెప్పిన పోలీసుఅధికారులకు, డ్రైవర్స్,ఆర్మడ్ కానిస్టేబుల్స్‌తో పాటు ఇతర హోదాల సిబ్బందికీ నా ధన్యవాదాలు.

—ఆదిరాజు వెంకటేశ్వరరావు

మనది

వర్గరహిత సమాజ సాధనకు 'పరశత్రువులను' వధించడమే తమ విధానమని ప్రకటించిన తీవ్రవాదులు మన రాష్ట్రంలో, అధికార లెక్కల ప్రకారం 1968-77 మధ్యకాలంలో 146 మంది ప్రాణాలు తీయగా, హింసా విధానాన్ని అహర్నిశలు విమర్శిస్తున్న పాలకుల పోలీసులు 191 మందిని కాల్చి చంపివేశారు. ఇవి అధికార లెక్కలు. అనధికార లెక్కల ప్రకారం పోలీసులు కాల్చి చంపిన వారి సంఖ్య 340-400 మధ్యన వున్నట్లు తెలుస్తున్నది.

అధికార లెక్కల ప్రకారం 87 మంది జనవరి 25, 1975 తర్వాత నే పోలీసుల తుపాకీ గుండ్లకు బలి అయినట్లు, వేరు వేరు సందర్భాలలో ముఖ్యమంత్రి ఉభయ శాసన సభలకు ఇచ్చిన సమాచారం, జూన్ 1975 జులై 1977 మధ్య కాలంలో మృతుల గురించి పోలీసులు తెలిపే సమాచారం శ్రద్ధగా పరిశీలిస్తే అర్థమవుతుంది.

తీవ్రవాదులు అనే అనుమానంతో నిర్బంధించిన అనేక మందిని ప్రత్యేకించి యువకులను, విద్యార్థులను తెంగళరావు ప్రభుత్వం, ఈ రెండేళ్ళలో చాలా ఘోరంగాను, ఘాతుకంగాను హింసించిచంపించినదనే విమర్శలు ఈమధ్యబలం పుంజు కొన్నాయి. వీటి పరిశీలనకే భార్గవ విచారణ సంఘ నియామకానికి దోహదం చేశాయి.

ఈ విచారణ సంఘ నియామకం తర్వాత ఆందోళన చెందిన కొందరు పోలీసులు తమనేరాన్ని కప్పిపుచ్చు కొనేందుకు తపులో ఒక

డుగా రాష్ట్రాన్ని పరిపాలించిన ముఖ్యమంత్రిని కాపాడేందుకు హత్యల కుసంభందించిన సాక్ష్యాధారాలు తొలిగించే ప్రయత్నం చేశారు. చేస్తు న్నారు. వీరు తమ ప్రయత్నంలో కొంత వరకు కృత కృత్యులూ అయ్యారంటే అతిశయోక్తి కాదు.

బార్టన కమీషన్ నియామకం కాగానే పోలీసు ఉన్నతాధికారుల రహస్య సమావేశం హైదరాబాదులో పోలీసు మెస్‌లో జరిగింది.

'విడిపోతే పడిపోతాం కలసి ఉంటే నిలిచి పోతాము' అనే సిద్ధాం తం అందరి మనస్సులలో నాటేందుకు సమావేశం ఏర్పాటు చేశారు.

సమావేశం అనంతరం కొందరు అధికారుల బదిలీలు అయాయి. వివిధ ప్రాంతాల రేంజ్ అధికారులు మొదట తమ అధీనంలోని జిల్లా పోలీస్ సూపరింటెండెంట్స్ సమావేశం జరిపి, తర్వాత రేంజ్‌లో పర్య టించి, అక్కడ 'హత్యల'తో సంబంధంవున్న అధికారుల సమావేశాలు పర్యవేక్షణ చేశారు.

ఈ సమావేశాలు 'గెట్ టుగెదర్స్' కానిస్టెబుల్, రిజర్వు కానిస్టె బుల్ స్థాయి వరకు వెళ్లాయి. ఆలోగా 'హత్యల'తో సంబంధం వున్న ఆధికారులను హైదరాబాదు పిలిపించి_'డూస్' అండ్ 'డొంట్‌డూస్' చెప్పారు.

అయినప్పటికీ కొందరు డి.ఐ.జి లతోసహా పలువురు అధికారులు 'కలిసి ముణుగుదాం' అనే సిద్ధాంతంతో అంగీకరించడం లేదు. దోషులు ఎవరు, ఎవరుకాదు అనే జాబితా పోలీసు శాఖ ముందు తయారు చేసి, దోషులను రక్షించేందుకు ఆయా పరిస్థితుల బట్టి తర్వాత ప్రయత్నం

చేయాలని వారు వాదిస్తున్నారు. సి.బి.ఐ రంగంలోకి దిగితే చాలా ప్రమాదమని వారు అనుమానిస్తున్నారు.

నాయకులపై విచారణ జరిపిన, సమాచారం సేకరించిన పౌర హక్కుల రక్షణసంఘం తమవద్ద వున్న సాక్ష్యం, ఆ సాక్ష్యంతో నిమిత్తంవున్న వ్యక్తుల వివరాలు పూర్తిగాకాక పాక్షికంగానే ప్రజలకు తెలుపడంవల్లనే, అమూల్యమైన కొంతసాక్ష్యం, సాక్షులగురించి ముఖ్య మంత్రి ఆయన పోలీసుబంట్లుకు తెలియలేదు. అందువల్లనే కొందరు సాక్షులు ఈ యముకింకరుల దృష్టిలో పడలేదు.

జూలై మాసంలో అఖిలభారత కమ్యూనిస్టు పార్టీ (మా) ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ యి.ఎం.ఎస్. నంబూద్రిపాద్ హైద్రాబాదు సందర్శించినప్పుడు ఆయనతో నాలుగు గంటలు గడిపే అవకాశం ఈ రచయితకు దొరికింది.

మాటల సందర్భంలో పౌరహక్కుల రక్షణసంఘ ప్రతినిధి ఒకరు రాష్ట్రంలో జరిగిన అనేక ఘాతుకాల వివరాలు తెలుపగా, నిశ్చేష్టులైన నంబూద్రిపాద్ 'ప్రజలు ఏమి చేస్తున్నారు' అని ప్రశ్నించారు.

కొందరు స్వార్థంతోను మరికొందరు భయంతోను ప్రభుత్వ దుశ్చర్యలను విమర్శించడంలో విఫలులుకాగా, ఆశలుచూపి, బెదిరించి రాష్ట్రంలో కొందరు పత్రికలవారినీ, పత్రికలను ముఖ్యమంత్రి గుప్పిటలో ఉంచుకోవడవల్ల ప్రభుత్వ దుర్మార్గాలకు విస్తృత ప్రచారం దొరకలేదని, ఆ మిత్రుడు పేర్కొన్నాడు. ఈ హత్యలను నిరసిస్తున్న మేధావులు, కొన్ని వామపక్షాల ఆందోళన ఇంకా ప్రజాఉద్యమ స్వరూపం సంతరించుకోకపోవడానికి కొన్ని స్థానిక పత్రికల వైఖరే కారణమని

కూడ ఆయన నంబూద్రిపాద్‌కు చెప్పారు. ఇటీవలి కాలంలో ఈ రాష్ట్రములో జరిగిన, జరుగుతున్న భూతుకాల వివరాలుఇంతకుముందు తెలియనివి ఎన్నో నాకు ఈ సమావేశంలో తెలిశాయి.

కొందరు మంత్రులు, ఉన్నతాధికారులు ఢిల్లీ వచ్చినప్పుడల్లా పిచ్చాపాటి మాటలలో యెన్నో విషయాలు తెలుస్తూండేవి. అవన్నీకేవలం శ్రీవెంగళరావు అవినీతికీ, లంచగొండితనానికీ, అనుచితపాలనకు సంబంధించినవి. కానీ, ఘోరహత్యలకు సంబంధించినవికాదు. ఘోర హత్యల విషయంలో. శ్రీ రామనర్సయ్య నిర్బంధం తర్వాత అతనివధ జరిగిన తీరు గురించి ఒకమంత్రి నాకు, మరొక విలేఖరికి చెప్పారు. తరువాత కొద్దిరోజులకే పౌరహక్కుల రక్షణసమితి విచారణకు ఉపక్రమించడం వలన, ఫలితాలకొరకు యెదురుచూచాము. తార్కుండే కమిటీ నివేదిక విడుదలైన తరువాత ఆ మంత్రి చెప్పిన మాటలు యదార్థమని తెలిసింది. రామనర్సయ్య హైద్రాబాదులో పట్టుపడిన అనంతరం వరంగల్ రేంజ్ డి.ఐ.జి ని ఇక్కడకు పిలిపించి అతనిని అప్పగించారు. ఇనస్పెక్టర్ ఒకరు కూడ డి.ఐ.జి. వెంట వున్నారు.

ఇంతకుముందు నేను ప్రస్తావించిన సమావేశంలో, భూతుకాల వివరాలు తెలుసుకొని ప్రభుత్వం పూర్తిగా ఆటవికంగా, అనాగరికంగా, పాశవికంగా ప్రవిస్తున్నదని విన్న తరువాత 'ప్రజలు ఏమి చేస్తున్నారు' అన్న కామ్రేడ్ నంబూద్రిపాద్ ప్రశ్న నన్ను వేధించింది. ఆ రాత్రి మేము భోజనాలు చేసేటప్పుడు, ఆ తరువాత కూడ శ్రీ నంబూద్రిపాద్ ప్రశ్న నా చెవులలో మారుమ్రోగింది. అదే సమయంలో మేమందరము ఉండగనే, పుష్కల్ని భోజనాలకు పిలచిన ప్రముఖుడికి ఢిల్లీనుండి రెండు సార్లు టెలిఫోన్ వచ్చింది. ' ..... మన సాథులు ఫలానా ఫలానావారని

తప్పు పైపు తిప్పుకునేందుకు పోలీసులు ప్రయత్నం చేస్తున్నారు. వారికి డబ్బు ఎరచూపుతున్నారు. ఉద్యోగంనుండి తొలగించినకొందరు పోలీసు అధికారులకు తిరిగి ఉద్యోగాలు ఉస్తున్నారు. హత్యా రహస్యాలు వారికి తెలుసు కనుక వారిని మంచి చేసుకుంటున్నారు. ఈ పరిణామాలన్నింటినీ ఒక కంటితో కనిపెట్టండి' అనేది ఆ టెలిఫోన్ సారాంశం.

పౌరహక్కుల రక్షణపంపు సభ్యులు ఢిల్లీలో ఉండికూడ ఇక్కడి ఘోరకలిని అంతమొందిచేందుకు చూపుతున్న శ్రద్ధ నన్ను ముగ్ధుడిని చేసింది.

ఈ రాష్ట్రానికిచెంది ఉండి ఒక పౌరుడిగా అన్యాయం, అక్రమం ప్రతిఘటించే బాధ్యత నాకు మాత్రం లేదా అని అనిపించింది.

నాకు ఉన్న పరిధులలో, వనరులతో నేను చేయగలిగింది నాకు తెలిసిన విషయాలు యెంతవరకు యదార్థాలో విచారించి ప్రజలకు తెలియ జెప్పడం. అది నా కర్తవ్యం, బాధ్యత అనుకున్నాను. నా ఈ కర్తవ్య నిర్వహణకు తోడ్పడేందుకు నేను పనిచేసే పత్రిక సిద్ధంగా ఉండదని నాకు తెలుసు. ఎందుకంటే, ఆంతకుముందు ఈ అంశంపైననే, ఢిల్లీ నుండి ప్రత్యేక ప్రతినిధిగా నేను పనిచేస్తున్న 'డక్కన్ క్రానికల్' 'ఆంధ్రభూమి' దినపత్రికలకు నేను పంపిన కొన్ని వార్తలు, పోలీసులకు అనుకూలంగా లేనందున ముఖ్యమంత్రి, ఈ పత్రికల సంపాదకుడు యజమానులపై విరుచుకొని పడడం జరిగింది. విలేఖరిపై అసభ్యపద జాలం ఉపయోగించి, 'ఎకు నేను కావాలా ఆ వెధన విలేఖరి కావాలా నిర్ణయించుకోండి.తక్షణం వాడిని ఉద్యోగం నుండి తీసివెయ్యండి' అని పత్రిక యజమానులను ముఖ్యమంత్రి ఆదేశించారు. ఉద్యోగంనుండి తీసి

పేంయిచినా అతడు నన్ను వృత్తినుండి తొలగించలేడు. అ గ్రహింపు వెంగళరావువంటి అవివేకికీ, ఆలోచనా రహితుడికీ మూర్ఖుడికీ ఎలా ఉంటుంది ?

ఏమైతేనేం ముఖ్యమంత్రి ఆగ్రహానికి భయపడిన పత్రిక యజమానులు, ఇటు నన్ను తొలగించేందుకూడ ఇష్టంలేక కొన్నాళ్ళు శలవు వెట్టమన్నారు అందువలన ఈ పత్రికలో నేను వ్రాసే అవకాశం ప్రస్తుతం లేదు, ఇతర పత్రికలకు వ్రాయడంలో వేరేసాధక బాధ కాలు ఉన్నాయి. తార్కుండేకమిటీ తొలిమధ్యాంత నివేదిక వెలువడిన పుడే కొందరు పత్రిక ప్రతినిధులు ఈ అంశంపై విపులంగా వ్యాసాలు వ్రాయమని కోరినపుడు నేను అంగీకరించ లేదు. డిల్లీలో ఒక పెద్ద ప్రచురణ సంస్థ అధిపతి కూడ ఆంధ్రప్రదేశ్‌లో నక్సలైట్ ఉద్యమం గురించి త్వరగా పుస్తకం వ్రాస్తే చాలా డబ్బు ఇస్తానని చెప్పినా నాకు తీరిక దొరక లేదు. కావలసిన మూర్తి సమాచారం సేకరించేందుకు వ్యవధి, అవకాశం లేకపోయినవి.

ఇప్పుడు మారిన పరిస్థితులలో కావలసినంత వ్యవధి అవకాశం. దొరికాయి కనుక, పుస్తకం వ్రాయాలి ననుకున్నాను. అయితే డిల్లీ వెళ్ళి ఇంగ్లీషులో వ్రాయడం కంటె ముందు ఇక్కడ తెలుగులో వ్రాస్తే, రాష్ట్రంలో తెలియని వారికి తమపాలకుల గురించి విపులంగా చెప్పవచ్చును కదా అనుకున్నాను తన ఘోర దురంతాలు కప్పిపుచ్చుకొనేందుకు శ్రీ వెంగళరావు చేస్తున్న ప్రయత్నాలు వాటిని ప్రతిఘటించవలసిన అగత్యం గురించికూడ తెలుగు ప్రజలకు తేటతెల్లంగా తెలియచేయవచ్చు ననుకున్నాను. ఈ ఆలోచన ఫలితమే ఈ పుస్తకం.

తార్కుండే కమిటీ సభ్యులతో సుదీర్ఘ చర్చలు జరిపి తెలియని యెన్నో విషయాలు తెలుసుకున్నాను. ఇతరత్రా కొంత సమాచారం సేక

రించి, పోలీసు అధికారులు, రాష్ట్రప్రభుత్వ ఉన్నతాధికారులు, శాసన సభ్యులతోసహా అనేకమందితో—ముఖ్యంగా దారుణహత్యల గురించి తెలిసినవారు అని చెప్పబడేవారితో నేను మాట్లాడాను. యువకులను పోలీసులు క్రూరంగా హత్య చేశారని తెలిసింది.

కేవలం నక్సలైట్స్ ఉద్యమానికీ, వారిపై, వారి అభిమానులపై వారి అభిమానులని పోలీసులు భావించినవారిపై, పాలకవర్గ నాయకుల రాజకీయ, వ్యాపార ప్రత్యర్థులపై జరిగిన అమానుష చర్యలకే ఈ పుస్తకం పరిమితం చేయలేదు. నక్సలైట్స్ అని చెప్పబడేవారు వారి పేరుతో చలామణి అయినవారు చేసిన ఘాతుకాలను కూడ ఇక్కడ ప్రస్తావించాను.

నక్సలైట్స్ చేసినట్టే ప్రభుత్వం చేయాలనే వాదనతో నేను ఏకీభవించను. యెందుకంటే నక్సలైట్స్ అని అనుమానంవచ్చిన వాడినల్లా చంపమని పోలీసులకు చెబితే, వాళ్లు యెవర్నయినా చంపేస్తారు. వాస్తవానికి చాలామందిని హత్యలతో సంబంధంలేనివారిని అనుమానంపై చంపేశారు. నేరస్థులపై కేసులు పెడితే సాక్షులను చంపుతారనేది ఒక వాదన. హింసించిన పోలీసులకు, హింసావిధానం ఆమోదించిన నాయకులకు, విచక్షణారహితంగా శిక్షలు వేసిన న్యాయమూర్తులకు, కల్పించిన రక్షణను ప్రభుత్వం సాక్షులకు కల్పించలేదా? హత్యకేసులో సాక్షులకు రక్షణ కల్పించలేనివారు అధికారంలో వుండే అర్హులా?

తపాలపురంలో శ్రీపీతాంబరరావు ఆయన కుటుంబసభ్యులను ఘోరంగా చంపినవారిపై నేమీ, అలాంటి నేరాలు చేసిన మరొకరినైతే నేమీ తీవ్రంగా శిక్షించవలసిందే. కానీ నిజమైన నేరస్థులెవరో మొదట నిర్ధారణ కావాలి. వారే ఆ నేరం చేశారని న్యాయస్థానంలో ఋజువు

చేయాలి. అంతేకానీ, పోలీసులు ఎవడో నేరస్తుడని చెబితే వాడే నేరస్తుడనుకొంటే, కిష్టాగౌడ్, భూమయ్యలవలె ఎందరో నిర్దోషులు అమాయకులు ఉరికంబం ఎక్కవలసివస్తుంది.

నక్సలైట్స్ అనేవారు ఒక రాజకీయ పార్టీకిచెందిన వారు సరియైన దనిచనం అంగీకరించకున్నా వారికొక రాజకీయ సిద్ధాంతం ఉన్నది– కనుక ఈ పార్టీ పుట్టు పూర్వోత్తరాలు తిరిగి పాఠకులకు గుర్తుచేయడం కొరకు 1948–68 మధ్య రెండు దశాబ్దాల కాలంలో కమ్యూనిస్టు ఉద్యమంలో ఎచ్చిన పరిణామాలను కూడ ఇందులో ఒక అధ్యాయంలో ప్రస్తావించాను.

నక్సలైట్ ఉద్యమంలో గిరిజనులు, గిరిజన ప్రాంతాలు విశిష్టస్థానం పొందడంవల్ల, గతనూట యాభై సంవత్సరాలలో గిరిజనులు జరిపిన పోరాటాలు, పితూరీలు గురించీ, వాటి పూర్వాపరాలు చర్చించి, గిరిజనులు నక్సలైట్ ఉద్యమానికి ఎందుకు బాసటగా నిలిచారో పాఠకులుఅవగాహన చేసుకునేందుకు తోడ్పడ డానికి ప్రయత్నించాను.

అతి స్వల్ప వ్యవధిలోనే, గిరిజన ఉద్యమా లన్నింటికీ సంబంధించిన సమాచారం తెలుసు కునేందుకు వెన్నెల కంటి రాఘవయ్య రచన తోడ్పడింది.

అయితే అన్ని అంశాలు ఋణ్ణంగా లోతుగా తరచి చూచి పరిశోధించి గొప్పగా సమగ్రంగా ప్రాశానవి కానీ, ప్రభుత్వ పుతుకాలను వివరంగా ప్రతిబింబించానని కానీ నేను పొరపాటున కూడ భావించడంలేదు.

తెలిసిన విషయాలు, తెలుసికొని ధృవ పరుచుకొని నిజమేని నేను నమ్మిన విషయాలలో కొన్నింటినైనా, ఈ పుస్తక ప్రచురణ వల్ల పాఠకులతో పంచుకుంటున్నానని మాత్రమే సంతృప్తి పడుతున్నాను.

నిందితులని రుజువు కాకుండా తప్పించు కునేందుకు, నరహంత కులైన కొందరు పోలీసులు ప్రత్యేకించి వారి 'ఛీఫ్టైన్'ల పెంగళరావు చేస్తున్న ప్రయత్నాలు వమ్ము చేసి తమ నేరాలకు వారు శిక్ష అనుభవిం చేట్టు చేయడానికి జరుగుతున్న ప్రయత్నాలకు ఒక పౌరుడిగా నేనూ తోడ్పడాలి నన్న ఆత్మత కూడ ఈ ప్రయత్నానికి దోహదం చేసింది.

మోసం, ధగా, లంచగొండితనం, అబద్దాలు, ఆశ్రిత పక్షపాతం మూర్ఖత్వం, ఖూనీకోరు విధానాలకు పెంగశ్రావు ప్రతి రూపమని నేను చెప్పవలసిన పనిలేదు.

కొందరు పెట్టుబడిదారులు బడావ్యాపారుల తూత్తుగా ఈ రాష్ట్రాన్ని పాలిస్తున్న పెంగళరావు అత్యవసర పరిస్థితిలో, తనస్వార్థానికి, ఆశ్రితుల మేలుకు చేసిన. చేయించిన దుర్మార్గాలు నాకంటే ఈరాష్ట్ర ప్రజల చాలా మందికి ఎక్కువగా తెలుసు. ఆయితే, కేపలం కొలం కలిసి రాకనే ఆయన మంత్రివర్గ సహచరులతో సహా అనేక మంది పెదిమ కదల్చ కుండా కూర్చున్నారని మాత్రం నాకు బాగా తెలుసు.

ఈ రాష్ట్రంలో పేరుకే ప్రజాస్వామ్యం. వాస్తవంగా పరిపాలన జరిపేది మోసగాండ్ల సంఘ విద్రోహులు. వీరిని అదుపు చేయ గలమని అధికారంలో ఉన్నవారు చెప్పే మాటలు కేవలం బూటకం.

పెంగశ్రావు అధికారంలోకి రాగానే ఆయన మాటలను ప్రకటన లచు నమ్మిన కొందరు మంత్రులు, అధికారులు కల్తీ వ్యాపారులను బ్లాక్ మార్కెటీర్లను దండించాలని ప్రయత్నం చేశారు. వాస్తవానికి ఆచరణలో జరిగిన దేమిటి? అక్రమ నిల్వలు చేసి బ్లాక్ మార్కెట్ చేస్తున్న వ్యాపా

రుణను జైళ్ళలో పెట్టిన అధికారు లందరికీ బదిలీ అయింది, నేరస్తు లందరూ విడుదల అయ్యారు.

ప్రభుత్వం 'ఉగాదికానుక'గా వీరిని విడుదల చేసింది వీరు మనసు మార్చుకొని, సంఘ విద్రోహ చర్యలు కొనసాగించరని ప్రభుత్వం నమ్మింది. (కేవలం సమాజ శ్రేయస్సు కొరకే. ఏస్వార్థం లేకుంటా తీవ్ర వాదంవైపు మొగ్గు చూపినవారికి మాత్రం మనసు మార్చుకునే అవకాశం కూడ దొరకదు). బ్రోకర్ల ద్వారా అధికాదంలో ఉన్న వారికి వారి వాటా ముట్ట చెప్పిన తర్వాత, బ్లాక్ మార్కెటీర్లు విడుదల అయారు.

నూనె మిల్లు యజమాని ఉదంతం ఎవరు మరిచి పోతారు.

బ్రహ్మదండి, ఉమ్మెత్త వంటి విషపు మొక్కల నుండి తీసిన నూనెను ఎంట నూనెలో కల్తీ కలిపి నందుకు ఇతడినినిర్భధించారు. అత నిపై కఠిన చర్య తీసుకోనున్నట్టు బింకాలు పలికారు. తీరా పడవలసినది చేతులో పడితే అతని వదిలి పెట్టుటకు కాక, ఆపెద్దమనిషి అధ్వర్యంలో అతను విడుదలై వారం తిరుగక మునుపే నిజామాబాదులో ముఖ్యమంత్రి తో సహా ఆరడజను మంది మంత్రులు సిగ్గు విడిచి పాల్గొన్నారు. అతనికి తగని గౌరపం యిచ్చారు, పాలకులు ఇలా ఉంటే ప్రజాస్వామ్యం ఇలా తగల పడితే యువకులు తిరుగు బాటు చేయక ఏంచేస్తారు.

ఈ పుస్తకం విషయం నేను కొందరితో చర్చిస్తే, తన విమర్శ కులపై కక్ష సాధించేందుకు యెంతటి నీచాతినీచానికైనా శ్రీవెంగళరావు వెనుకాడడని నన్ను హెచ్చరించారు. 'ఏడిచాడులే' అనడంకంటే, ఈ దమ్ములేని మనుషులకు నేనేమీ చెప్పలేకపోయాను.

పోలీసులు చేసిన ఘోరాలన్నింటికీ ఇతనే బాధ్యుడని నాకు తెలుసు మీ అందరికీ తెలుసు. హత్యలు అలా వుంచినా తన రాజకీయ ప్రత్యర్థు

లను పేధించేందుకు వెంగిళరావు ఎన్ని సందర్భాలలో పోలీసులను ఉప యోగించలేదు.

అప్పటిలో శ్రీ బ్రహ్మానందరెడ్డి అనుయాయులైన శ్రీ గణపా రామస్వామిరెడ్డి (గుంటూరు)పై కేసు, ర్రాయవరం మున్సబు శ్రీ సత్య నార్రాయణ (తూర్పు గోదావరి) పై కేసు ఏమిటి?

అస్మదీయుల కొకన్యాయం, తస్మదీయుల కొకన్యాయమా? అందు కని ఇతని చరిత్రచూస్తే తాము ఉన్నతస్థాయి ఆదేశాలు పాటించినట్టు పోలీసులు చెప్పేది యదార్థమని నమ్మక తప్పదు.

'రాష్ట్రంలో అత్యున్నత రాజకీయ నాయకుని ఆజ్ఞలు సిరసావ హించేందుకు మేము పౌరుల ప్రాణాలు తీయవలసివచ్చింది' అనికొందరు పోలీసు అధికారులు ఖచ్చితంగా చెబుతున్నాడు.

'న్యాయస్థానాలపై తమకు విశ్వాసం లేదని నక్సలైట్స్ చెబు తున్నారు కనుక న్యాయస్థానాలతో నిమిత్తం లేకుండానే, వారి ప్రాణాలు తీయాలన్నది ఈ ప్రభుత్వ విధానం' అనికూడ పోలీసు అధికారులు నిర్మొహమాటంగా పేర్కొంటున్నారు.

ఇందుకు తగినసాక్ష్యం, తగిన సమయంలో, తగినచోటు వెల్ల డవుతుంది.

ఒకనేరం జరిగితే, దానికి నక్సలైట్స్ కారకులు కావచ్చునని అను మానిస్తే దానిని నిర్ధారణ చేయడం, దోషులను ఖచ్చితంగా గుర్తుపట్టటం వారినేరం న్యాయస్థానాలలో రుజువుచేయడం, పోలీసులకు సాధ్యంకాదట ఫలానావారు అంతా కలిసి నేరం చేశారని తెలిసినా వారిలో ఎవరు ఏ పాత్ర నిర్వహించినదీతెలుసుకోవడం సాధ్యంకాదట.

అందుకని నేరాలకు బాధ్యులు కావచ్చునని అనుమానం కలిగిన వారినందరినీ అంతం చేయటమే మంచిదనిప్రభుత్వం—అంటే—వెంగ ర్రావు భావించారట. ప్రభుత్వం అంటే వెంగర్రావు అని యెందు కంటూన్నానంటే ఆయన యెన్నో ముఖ్యవిషయాలనే మంత్రివర్గం ముందుకు తీసుకవెళ్ళకుండా స్వతంత్రంగా ఈ రాష్ట్రం, ప్రభుత్వం తన అబ్బగాడి తన జాగీరు అయినట్టు వ్యవహరించారు కదా?

చట్టాన్ని న్యాయస్థానాలను ఖాతరు చేయకుండా, నిందితుడని అనుమానం వచ్చిన మనుషులందరినీ చావకొట్టటానికి నలుగురుగుండాలు చాలరు? పోలీసు యంత్రాంగం, న్యాయ సలహాదారులు ఆర్బాటం కోట్ల రూపాయలు ఖర్చు ఎందుకు.

పెద్దల సమక్షంలో, ప్రభుత్వ విధానాలకు సంబంధించిన పై సూత్రాలు వల్లించిన పోలీసు అధికారి ఎంతమందిని చంపాడో, చంపిం చాడో తెలియదుకానీ, పోలీసులు చేసినకొన్ని హత్యలు మాత్రం అతను ప్రత్యక్షంగా చూచారు.

ఈ సాక్ష్యి మంతటినీ పౌరహక్కులరక్షణ సంఘం ఎప్పుడు ఎలా వెల్లడి చేస్తుందో వేచి చూడాలి.

అయితే, పౌరహక్కుల రక్షణసంఘం ఇంతకుముందు వెల్లడి చేసిన విషయాలలో ఏటీ అతిశయోక్తికాదు. ఇంకా వెలుగులోనికి రాని విషయాలు చాలా ఉన్నాయి. ఉదాహరణకు గిరాయిపల్లి అడవులలో నలు గురు యువకులను క్రూరంగా హింసించి చెట్లకుకట్టి కాల్చిచంపిన ఉదం తాన్నే తీసుకుందాం. నలుగురి పేర్లు, వారిని చంపినతీరు మాత్రమే తార్కుండే కమి టీవెల్లడిచేసింది తప్పవారిని ఏ అధికారులు ఎక్కడఎలా

నిర్భంధించి తీసువెళ్ళింటీ ఇంకా తెలుపలేదు. తార్కుండే కమిటీ వివ రాలు అతిశయోక్తులు కాదనేందుకు ఈ ఒక్క ఉదంతంలో కొన్ని వివ రాలు ఉదాహరణగా చెబుతాను.

సిద్దిపేట వద్ద సిరిసింగండ్ల గ్రామంలో హత్య జరిగిన తర్వాత వందల మంది గ్రామస్తులను గిరాయిపల్లి అడవికి తీసుక వెళ్ళి కొంద రిని ములుగు పోలీసు స్టేషన్‌లో ఉంచి, చిత్రహింసలు చేసిన విషియం ఇంతకు ముందే వెల్లడయింది. వెల్లడికాని వివరాలు ఇవి ....

'సిద్దిపేట సబ్ ఇన్‌స్పెక్టర్ కె. దేవమణి ఒక రోజు స్థానిక విద్యార్థి, విప్లవ విద్యార్థి సంఘ సభ్యుడు శ్రీనివాసరావును నిర్భంధించారు. ఆతనికి తెలిసిన పదంగల్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థి జనార్ధన్ సిద్ది పేట కెళ్ళగా అతనినీ నిర్భంధించారు. ఇద్దరినీ ములుగు పోలీసు స్టేషన్ లాకప్‌లో ఉంచి చిత్రహింసలు చేయగా, శ్రీనివాసరావు తనకు తెలసిన ముగ్గురు విప్లవ విద్యార్థుల పేర్లు తెలయ జేశాడు. ఈసమాచారం శ్రీ శ్రీని వాసరావు స్థానిక పోలీసు సూపరింటెండేలకు ములుగు పి బబ్లూడి బంగ ళాలో రహస్యంగా చెప్పారు. ఈ చళనుండి పోలీసు యస్.పి కి ఇతనిక్రీ 'స్నేహం' మొదలై ంది.

శ్రీనివాసరావుకు తెలిసిన విప్లవ విద్యార్థులలో ఇద్దరు వరంగల్ జిల్లాలో ఉన్నారనీ, ఒకరి జాడ మెడ్చల్ సమీపమున కూడూరు గ్రామం లో ఉండే మల్లిగాడికి తెలుసునని యస్.పి. తెలుసు కున్నాడు.

ఈ మల్లిగాడు పూర్వం కమ్యూనిస్టు పార్టీలో పనిచేశాడు. 1948–49 లో ఇతడు సాయుధ పోరాటంలో పనిచేశాడని వదంతి ఆ రోజులలో ఒక స్థానిక రైతును ఇతడు చంపాడని ఆరోపణ ఉన్నిది.

సిరిసింగండ్ల హత్య అనంతరం నిందితుల కొరకు కొక నక్స లైట్స్ వారి అనుయాయులైన విద్యార్థుల జాడ తెలుసుకొని వారిని అంత మొందించాలన్న దృష్టితోనే పోలీసులు వని చేశారని విదిత మవుతుంది.

యస్.పి ఆదేశాలపై, ఆయన ఇచ్చిన సమాచారాన్ని తీసుకొని డి యస్.పి నీలంరెడ్డి నాయకత్వాన పోలీసు అధికారుల బృదం ఒకటి మెడ్చల్ వద్ద కూడూరు గ్రామానికి బయలు దేరింది.

ఊరు బయట రోడ్డుమీద జీపు ఆగగా, సబ్ ఇన్స్పెక్టరు శ్రీకామే శ్వరరావు ఊళ్ళోకి వెళ్ళి మల్లిగాడి జాడ తెలుసుకొని వచ్చారు. ఆసమ యంలో అతను కల్లు దుకాణం దగ్గర ఉన్నాడు.

పోలీసులు వెళ్ళి అతనిని నిర్బంధించారు. గ్రామంలోకి తీసుక వెళ్ళగా కొంతసేపు మొండికి వేసి కేకలు పెట్టి ఆతర్వాత అతను పోలీసు లతో వారిపై ఆధికారి దగ్గరకు వెళ్ళడానికి అంగీకరించాడు.

జీపు తిరుగుముఖం పట్టి ములుగుకు బయలు దేరింది. కొంతసేపు ప్రయాణం అనంతరం 'యాదయ్య మాకన్నీ తెలుసురా. వాడు ఎక్కడ ఉన్నాడో చెప్పు నిన్ను విడిచి పెడతాం' అని పోలీసులు అవడంతో, నిజంగానే తన ఇంట్లో దాచి ఉన్న మనిషి గురించి పోలీసులకు తెలుసు నని మల్లిగాడు భావించాడు. మల్లిగాడి రహస్య మారు పేరు యాదయ్య. ఆ పేరుతో పిలిచే సరికి అతను భయపడ్డాడు.

తన యింట్లో ఒక మనిషి దాగి ఉన్నమాట యదార్థమేననీ, అతని వద్ద ఆయుధాలు కూడ ఉన్నాయని మల్లిగాడు వినరించాడు. పోలీసు జీపు ఆగింది. తిరిగి వెనుకకు వెళ్ళి దాగి ఉన్న మనిషిని నిర్బంధించాలా?

పద్దా? అనే మీమాంసపై చర్చ జరిగింది. ఆయుధాలు వున్నాయి అనే సంగతి జ్ఞాపకంవచ్చి పోలీసులు భయపడ్డారు. అంతేకాక బయలుదేరే ముందు పోయించుకున్న 15 లి.పెట్రోలు వెనుకకు తిరిగి కోడూరువెళ్లి మళ్లా ములుగు పోవడానికి సరిపోదని కూడ వారు అనుకున్నారు.

అందువలన సరాసరి ములుగువెళ్లి అక్కడ విడిదిచేసి వున్న యస్. పి. కి విషయాలు చెప్పి, అదనపు బలగంతో వెళ్లాలనుకొన్నారు. అంతేకాక యెవడో ఒకడు—మల్లిగాడు—దొరకటం వారికి సంతోష కారణమైంది.

ములుగు వెళ్ళి అరగంట లోపలనే అదనపు బలగంతో బయలు దేరారు. ముందు నీలంరెడ్డి, సుదర్శన్‌రెడ్డి ప్రభృతులు వెళ్ళగా, వెనుక ఖుదీర్ మహ్మద్‌ఖాన్ అనే మరొక డి.యస్.పి. యస్.బి.యస్.ఐ. కామేశ్వరరావు వెళ్ళారు.

తీరా కోడూరు మల్లిగాడి ఇంటికి చేరేసరికి 'ఆ డెక్కడున్నాడు దొరా మీరు పట్టుకోగానే మా అయ్యచేసిన కేకవిని అడప్పుడే ఇంటెనక నుండి పారిపోయిండు' అని చెప్పింది మల్లిగాడి కూతురు పోలీసులకు—

చేసేదిలేక వారు వెనుకకు వెళ్ళారు. ఈలోగా యస్ పి. శ్రీనివాస రావు మధ్య సన్నిహితత్వం పెరిగింది. జనార్ధన్ ఇతడూ ఒకే లాకప్‌లో ఉన్నా, ఇంటరాగేషన్‌కు వారిద్దరినీ విడివిడిగా బయటకు తీసేవారు. జనార్ధన్ శరీరం పచ్చని అయేది. శ్రీనివాసరావు యస్.పి.తో మాట్లాడి పంచభక్ష్య పరమాన్నాలు తిని మళ్ళీ యధాప్రకారం లాకప్‌లోకి వెళ్లేవాడు.

ఇవి ఇలా జరుగగా ఒకరోజు, యస్.పి. నేర్పిన యెత్తుగడ శ్రీనివాసరావుకు బాగా తలకెక్కింది.లాకప్‌లో జనార్ధన్‌తో అతను ఇట్లా అన్నాడు 'విప్లవవాదులైన మన స్నేహితులు అందరిపేర్లు పోలీసులకు తెలిశాయి. వారిని హెచ్చరిస్తూ నీకు నాకు తెలిసినవారికి ఉత్తరంవ్రాయి. పోస్టుకార్డు తెప్పించడం, దానిని పోస్టులో వేయించడం నాబాధ్యత' అన్న శ్రీనివాసరావు స్థానికుడు కనుక పోస్టుకార్డు తెప్పించగలడని నమ్మిన జనార్ధన్‌అతని మాటలుకూడ నిజమేననుకొన్నాడు.

కార్డు వచ్చింది ఉత్తరం వ్రాశాడు. పోస్టు చేసేందుకు శ్రీనివాస రావుకు ఇచ్చాడు. ఇది సరాసరి యస్.పి. దగ్గరకు వెళ్ళిందని అతనికేం తెలుసు. ఇదంతా యస్.పి. పన్నిన పన్నాగం కనుక ఉత్తరం చిరునామాకు చేరక యస్. పి. చేతులో పడింది:

ఈ చిరునామా తీసుకొని ఇనస్పెక్టర్ బాయ్య నాయకత్వంలో సిద్దిపేట రూరల్ ఐఎస్.సుదర్శన్‌రెడ్డి, స్పెషల్ బ్రాంచి ఎస్.ఐ తెన్నేటి కామేశ్వరరావుతో కూడిన బృదం హైద్రాబాదులోని బాలానగర్ బయలు దేరింది. వారు అక్కడికి ఉదయం 8.30 గంటలకే చేరారు. అప్పటికి సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టూల్స్ డిజైన్స్ విద్యార్థులు కానీ ప్రిన్సిపాల్ కానీరాలేదు.

పోలీసులు గంటసేపు హైదరాబాదులో స్వంత పనులు చూచుకొని మళ్ళీ వెళ్ళి ప్రిన్సిపాల్‌ను కలుసుకొని విద్యార్థుల జాబితా కావాలని అడిగారు.

ఏ విద్యార్థుల జాబితా అని అతను ప్రశ్నించాడు. ఎందుకంటే బి.యి చదివిన వారు ఇక్కడ శిక్షణ పొందుతారు ఐ.టి.ఐ చదివినవారు పొందుతారు.

'అదంతా మాకు తెలియదు అడిగినకాపలిసిందే ఇది ఎమురైన్సీ తెలుసా? ' అని ప్రిన్సిపాల్‌ను డబాయించారు పోలీసులు. అతను జాబితాలు తీశాడు.

ఐ.టి.ఐ నుండి వచ్చినవారి జాబితాలో మురళీమోహన్ రెడ్డి అనే రెండు పేర్లు కన్పించాయి పోలీసులకు. వారితో తమకు కావలసిన వాడె ఎరో అర్థం కాలేదు పోలీసులకు.

' ఎవడినో ఒకడిని తీసుక వెళ్ళడం వాడు కాడంటే ఇంకొకడిని పట్టు కెళ్దాం అని స్థూలకాయుడైన ఇన్‌స్పెక్టర్ దాటయ్య అన్నారు.

ఇది పారిశ్రామిక ప్రాంతం ఎవడిని పడితే వాడిని తీసుక వెళ్ళితే కార్మికులు తిరుగ బడుతారు అన్నారు మిగతా వారు. కొంత తర్జన భర్జన అనంతరం, తపు దగిర ఉన్న ఉత్తరంపైగల చిరునామాను ఒక విద్యార్థికి చూపించి, తమకు కావలసిన వ్యక్తి జాడ తెలుసు కున్నారు పోలీసులు. అదొక సానుభూతిపరుడి ఇల్లు తీరా అయింటికి వెళ్ళేసరికి, అసలు మనిషి లేడు. అతను ఎటో వెళ్ళాడని సాయత్రం అయిదు గంటలకు రాగలడని తెలిసుకున్నారు.

ముందుగా చేసుకున్న ఏర్పాటు ప్రకారం సరిగా మధ్యాహ్నం రెండు గంటలకు సనత్ నగర్‌లో అనుకున్న నెంబర్‌కు టెలిఫోన్ చేసి అపుడు అక్కడికి చేరుకొన్న యస్.పి.కి జరిగిన కథంతా చెప్పాడు బాబ య్యసి.ఐ తానూ నిర్బంధించ బోయే మనుషుల గురించి ఇతరులకు ప్రత్యేకించి గూఢచారితో డి.ఐ.జి శ్రీవిజయరామ్మారావుకు తెలిస్తే తనకు క్రెడిట్ దక్కదని, ఈ కథ ఆద్యంతాలు గుంభనగా ఉంచాడట యస్.పి. బోస్‌బాబు చివరి ఘట్టంలో 'పైనుండి' సరాసరి ఆదేశాలు తీసుకున్నారట.

యస్.పి తో మాట్లాడిన తర్వాత శ్రీ బాబయ్య ఇద్దరు జవాన్లను వెంట ఉంచుకొని, చుట్టు ప్రక్కల వెతికి రావలిసినదిగా శ్రీకామేశ్వరరావు సుదర్శన్ రెడ్డి నాదేశించి వంపించారు.

వారు పోగానే తను ఇంట్లోకి వెళ్ళి ఎదుట వాల్చిఉన్న మంచం పై శరీరాన్ని పడేసి జవాండ్లలో ఒకరిని బాత్‌రూం లోనూ మరొకరిని కక్కూసులో ఉంచారు. (ఈ బృందంలో ఉన్న కానిస్టేబుల్స్ పేర్లు అలెగ్జాండర్ రాములు, బ్రహ్మయ్య, మొయినుద్దీన్)

సాయంత్రం అయిదున్నరకు రాగలడనుకొన్న మురళీమోహన్ 3-30 గంటలకే తిరిగివచ్చారు. వారగా మూసివున్న తలుపు తెరుచుకొని లోపల ప్రవేశించేసరికి తలుపు చప్పుడు విన్న బాబయ్య మంచంపై నుండి లేచి అమాంతం అతనిపై పడాడు. మురళీ మోహన్ కతి అందు కొన్నాడు. బాబయ్య యెక్కుపెట్టిన పిస్టల్ మురళీమోహన్ గుండెలపై పెట్టి తన కాలుతో అతను కాలును మెలిపేసి క్రింద పడేశాడు.

ఈ లోగా లోపలపొంచివున్న రాములు మరొక కానిస్టేబుల్ పరుగెత్తుకొచ్చి మురళిమోహన్ రెక్కలు విరిచి కట్టారు. తర్వాత స్పెషల్ స్క్వాడ్ ట్రక్కులో గట్టి సాయుధ పోలీసు బందోబస్తుతో, కాళ్ళుచేతులు కట్టి వున్న మురళీ మోహన్‌ను ములుగు పోలీసు స్టేషన్‌కు తరలించారు. ట్రక్కులో ఇతనివెంట యస్.ఐ. కామేశ్వరరావును పంపి శ్రీ బాబయ్య సుదర్శన్ రెడ్డి కొందరు జవానులు వెనకినే వుండిపోయారు.

కొంతసేపటి తరువాత సుధాకర్ ఆ తరువాత ఆనందరావునుకూడ ఇదే పద్ధతిలో నిర్భధించారు. వారిద్దరినీ ఆ రాత్రే రెండు జీపులలో

ములుగు పోలీసుస్టేషన్‌కు చేర్చారు. అప్పటికే యస్. పి. బోస్ కూడ హైద్రాబాదునుండి అక్కడికి ఒక ఫియట్‌కారులో వెళ్ళారు.

గిర్దాయిపల్లి అడవులలో పారెస్టుడాక్ బంగళాలో హింసించి, కాళ్ళు చేతులు వరికి చెట్లకుకట్టి కాల్చిచంపిన నలుగురిని ఒకరి తరువాత ఒకరిని నిర్భధించారు. తప్ప వారు పోలీసులతో జరిగిన సాయుధ సంఘర్షణలో విప్లవకారులుగా మృతి పొందలేదు ఇది నిజం.ఇదంతా శ్రీవెంగ ర్రావుకు తెలుసు. ఆయన ఆదేశాలవల్లనే యస్. పి. బోసు ఇంత సాహసం చేశాడు. యిది నిజం. ముమ్మాటికి నిజం. నమ్మండి—దానికి కావలసినంత సాక్ష్యం వున్నది.

గిరాయిపల్లిలో కాల్చిచంపిన జనార్ధన్‌రావును మట్టుపెట్టితీరానే ఆలోచన శ్రీవెంగర్రావుకు ఆయన ఏజంట్లకు చాలాకాలంగా మనసులో ఉన్నది.

అత్యవసర పరిస్థితి సిరిసింగడ్ల హత్య తమ పట్టుదల నెరవేర్చు కొనేందుకు వారికి అవకాశం కల్పించాయి. యెందుకంటే 1974లోనే శాసనమండలిలో ఒక అనుబంధ ప్రశ్నకు సమాధానం చెబుతూ, వెంగళ రావు అన్నమాటలు ఎవరికయినా అనుమానాన్ని కలుగజేస్తాయి.

ఆయన సమాధానం చెప్పిన అనుబంధప్రశ్న, నక్సలైటు ఉద్యమంలో చిక్కొన్న వరంగల్ యింజనీరింగ్ కళాశాలకు చెందిన ఈ విద్యార్థికి సంబంధించినది.

ప్రశ్నకు సమాధానం చెబుతూ ఒక దశలో

'.... అన్నీ దృష్టిలో వున్నాయి. దానికి తగిన యాక్షన్ తగిన సమయంలో తీసుకో బడుతుంది' అన్నారు శ్రీ వెంగళరావు. అందు వలన అతనిని అంతం చేసేందుకు ప్రభుత్వానికి సమయం గిరాయిపల్లిలో దొరికినదేమో తెలియదు.

అనేక కారణాలవలన ఇతర హతులకు సంబంధించిన వివరాలు, వారిని నిర్బంధించిన అంతంచేసిన అధికారుల గురించి నేనిక్కడ వ్రాయ దలచుకొనలేదు.

గిరాయిపల్లి సంఘటన వివరాలన్నీ కొందరికి తెలుసుననే సంగతి పోలీసులకు పూర్తిగా తెలుసు కాబట్టి ఈఉదతం ఒక్కటీ వివరంగా అధికారులపేర్లతో వ్రాశాను. గిరాయిపల్లి దారుణం అనంతరం క్రింది నిధంగా పోలీసు అధికారులకు నగదు బహుమతులు అందాయి.

ఖదీర్ మొహమ్మద్ఖాన్ డి.యస్ పి. రు. 1200, నీలంరెడ్డి డి.యస్ సి రు. 1200 జి. బాబయ్య సి.ఐ. రు. 1050, సుదర్శన్రెడ్డి యం. నారాయణరెడ్డి, యం. సి. నర్సప్ప యస్.ఐ. తలావెయ్యి రూపాయలు, నారాయణరెడ్డి సి.ఐ. తలా 350, శ్రీసుబ్బారావు హెచ్.సి. రు. 200, అలెగ్జాండర్ పి.సి. 714, మొయినుద్దీన్ పి.సి. 882 రాములుపి,సి. 759, బ్రహ్మయ్య పిసి 741, బాలయ్య 2యన్ LNKరాములు పిసి 935 యం.ఎ. లతీప్, హవల్దార్ 187 డి సి ఒ బి యన్, APSP, వి. కె. బాలమ్ NK 836 IV Bn రహమత్ఖాన్ LNK 828, దుర్గ PC 853, సోములు PC 333, బుచ్చిరాములు PC 1057, అబ్దుల్ఆజీజ్ PC 43, కొండల్రెడ్డి PC 994 వారంచరికీ తలా 175 రూపాయలు, పోలీసు ఇన్ఫార్మెంటుకు యస్ పి ద్వారం మూడువేల రూపాయలు.

భార్గవసంఘం విచారణ అత్యవసర పరిస్థితి కాలంలో జరిగిన దారుణాలకు పరిమితమైతే విచారణ త్వరగా ఒక కొలిక్కొచ్చేది. 1969లో కూడ వెంగళరావు హోంమంత్రిత్వంలో చాలా హత్యలు జరిగినా, ఇటీవల హత్యలు రుజువయితే చాలు. హంతకుడే అవుతాడు.

1969లో కొందరిని బందించి, హింసించి చంపి గుర్తు తెలియని శవాలు అన్నారు. గుర్తు తెలిసినదంటే బంధువులు శవాలను తీసుకు వెళ్ళితే చిత్రహింసలు బయటపడగలవని అలా చేశారు. గుర్తు తెలియ దనే మాట నిజమయితే, గుర్తు తెలుసుకునేందుకు ఏమి చేశారు. వారి ఫొటోలు తీశారా? గుర్తులు పత్రికలలో ప్రకటన చేశారా, చట్టప్రకారం గైకొనవలసిన చర్యలు గైకొన్నారా అని యెవరైనా అడగవచ్చును. ఈ ప్రశ్నలకు సమాధానాలురావు.

ఏమైనా ఈ హత్యలన్నీ రుజువుకావాలి. హంతకులకు శిక్షపడాలి అందుకొరకు జంకూ గొంకూ లేకుండా తమకు తెలిసిన సమాచారమంత టినీ పౌరులు బహిరంగం చేయాలి. సాక్షులను భయపెట్టడానికీ, మభ్య పెట్టడానికీ ఆశలుచూపి వారిని పోలీసుంకు అనుకూలం చేసేందుకు చాలా ప్రయత్నాలు జరుగుతున్నాయి.

వెంగళరావును ఆదుకోవాలన్న అత్యుతతో ఆయన ఎలను లాభం పొందిన కొందరువ్యక్తులు తీవ్రవాదులు చేయని నేరాలుకూడ వారిపై రుద్దేందుకు జనాన్ని సమీకరిస్తున్నారు. కావచ్చు, "తీవ్రవాదులు నేరాలు చేయలేదని ఎవరూ అనడంలేదు." వారు నేరాలు చేసినంత మాత్రాన వెంగళ్రావు ఆయన పోలీసు ఏజంట్లు చేసిన నేరాలు మాఫీ కావాలా, అమాయకులను హత్యచేసిన వీరు శిక్షపడకుండా తప్పించుకోవాలా? ఈ కోరిక ఆయనపలన బాగుపడ్డవారికి ఉండవచ్చు. ఉదాహరణకు శ్రీ టి.

పురుషోత్తమరావును తీసుకొనండి. అతను పెద్ద ప్రత్యేక తెలంగాణావాది ఆవాదంతోనే శాసనసభకు ఎన్నికైనాడు. భూమి ఆకాశం తల్లక్రిందు లయినా తనవాదం పైఖరి మారదన్నాడు. ఉపన్యాసాలిచ్చాడు. ఏందల మంది అతనికొరకు త్యాగం చేశాడు.

వెంగళ్రావు ముఖ్యమంత్రి కాగానే ఆయన గోచీలో దూరిన మొట్ట మొదటి ప్రతిపక్ష శాసనసభ్యుడు శ్రీ పురుషోత్తమరావే. ఈ నాలుగేండ్లలో ఇతను కనీసం పదిలక్షల ఆస్తి పంపాదించాడనే విమర్శ వున్నది. ఈ మధ్య యితను మార్కెటింగ్ ఫెడరేషన్ పర్సన్ ఇన్‌ఛార్జి అయి తమ సంపాదన పరిధి పెంచుకున్నాడు.

ఇప్పుడు మార్కెటింగ్ పిడరేషన్ సిబ్బందినీ స్టేషనరీని వనరు లను తీవ్రవాదులపై అరోపణలు తయారీకి వాడుతున్న ఈ పెద్ద మనిషి. ఇది పోనివ్వండి వెంగళ్రావును డిపెండ్ చేసే పెద్దల విజాయితీ ఎంతో వారు ఈయన అండతో సంపాయించింది ఎంతో ప్రజలు తర్వాత ప్రశ్నించకపోదు. పోతే, విచారణను మసిపూసి మారేడుకాయ చేసేందుకు కొన్ని దుష్ప్రచారాలు జరుగుతున్నాయి. అలాంటివాటిలో ముఖ్యమైనది, కేంద్ర హోంమంత్రి శ్రీచరణ్‌సింగ్ రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీవెంగళ్ రావు మధ్య ఏదో రహస్య ఒప్పందం కుదిరినదనే ప్రచారం, ఈప్రచారం వాస్తవికంగా ఒక పద్ధతి ప్రకారం జరుగుతున్నది. వెంగళ్రావే స్వయంగా తమకు ఈవిషయం సూచన ప్రాయంగా చెప్పారని కనీసం నలుగురు సీనియర్ మంత్రులు నాతో అన్నారు. ఇది పచ్చి అబద్ధం, నాన్సెన్స్, చివరకు కొందరు పోలీసు అధికారులు కూడా నాతో మాట్లా డుతూ, ఇది నిజమేపేమో అను కొనే తాము సాక్ష్యం యివ్వదలచుకో లేదని అన్నారు హంతకులు అని అనుమానించ బడిన వారితో, ఒప్పం

దాటి కుదుర్చుకునే వీచస్థితికి దిగేటటువంటి చొకబారు రాజకీయవేత్త కాదు శ్రీచరణపింగ్ అని మాత్రం నేను నేనేమిటి అయన తెలిసిన వారెవరైనా సరే ఖచ్చితంగా బల్లగుద్ది చెబుతారు.

శ్రీ చరణ్ సింగ్ నీతి, నిజాయితీ చిత్తశుద్ధి శంకించ వీలులేనిది. అతనిపట్టుదల పాలనాదీక్ష సాటిలేనిది. అయితే అతను నిర్భరం నిదానం సహనం వాస్తవిక దృక్పథంకల వ్యక్తి అని మాత్రం చెప్పవచ్చు.

కమీషన్ విషయంలో కూడ ఎన్నో అపోహలు ఉన్నాయి. భారవ కమీషన్ రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఈ కమీషను తన నివేదికను చివరకు రాష్ట్ర ప్రభుత్వానికే ఇవ్వాలి కనుక ఆనివేదికపై రాష్ట్ర ప్రభుత్వం ఏచర్య తీసుకొనక పోవచ్చనసే ప్రచారమూ జరుగుతున్నది. ఇది 'నాన్ సెన్స్'. పోలీసువాళ్ళు సాక్షులను నిరుత్సాహ పరిచేందుకు చేసే ప్రచారం ఇది. కమీషన్ నివేదిక వచ్చేవరకు, శ్రీవెంగళ్రావు ఏపరిస్థితులలోను అధికారలో ఉండరు.

ఇకపోతే, రాష్ట్ర ప్రభుత్వమే భారవ కమీషను నియమించిన విషయం 'టెక్నికల్‌గా కరెక్టు' అయినా కేంద్ర ఆదేశంమేరకే రాష్ట్రం ఈచర్య గైకొన్నది.

వెంగళ్రావుపై అవినీతి ఆరోపణలు విచారించేందుకు నియమించిన విమర్ శాల్ సంఘనికి ఈ 'హత్యల' విచారణ బాధ్యతను కూడ అప్పగించాలని మొదట కేంద్రంలో కొందరు ముఖ్యులు భావించారు. తార్కుండే కమిటి ఆరోపణలలో యదార్థం ఉండవచ్చునని భావించేవారు ఈఆలోచన చేశారు. ప్రధాన మంత్రి కామన్వెల్త్ ప్రధానుల సభలో పాల్గొనేందుకు లండన్‌లో ఉన్న సమయంలో జూను 13 న, లోకసభలో ఈ అంశాలపై ఒక కాల్ ఎటెన్షను తీర్మానం వచ్చింది.

ఆ తీర్మానానికి సమాధాన యిచ్చిన దేశీయాంగశాఖమంత్రి శ్రీ చరణసింగ్ ఆంధ్ర ముఖ్యమంత్రికి కొన్ని సూచనలతో తానొక లేఖ వ్రాశామని ప్రకటించారు. లేఖలో అంశాలు ఆయన వెల్లడించలేదు.

ఆ మరునాడే ఆంధ్రశాసన సభలో మాట్లాడుతూ విచారణకు శ్రీచరణసింగ్ సలహామేరకు తాను సంఘాన్ని నియమిస్తున్నానని వెంగళ్రావు ప్రకటించారు.

ఈ ప్రకటన పౌరహక్కుల రక్షణ సమితి సభ్యులకొంత ఆందోళన పడడానికి కారణమైంది.

తరువాత మూడు రోజులకు జూన్ 17న ప్రధానమంత్రి ఢిల్లీ తిరిగివచ్చారు. ఆ రోజు ప్రత్రే పౌరహక్కుల సంఘ సభ్యుడైన సుప్రీం కోర్టు న్యాయవాది ఒకరు నాతో మాట్లాడుతూ, కమిషన్‌ను నియమించే అవకాశం వెంగళరావుకు దొరకకపోనచ్చునని చెప్పారు.

ఈ గందరగోళ పరిస్థితి మనసులో ఉండడంవలననే ఆమరునాడు ప్రధానమంత్రి పత్రికాగోష్ఠి జరిగినప్పుడు ఈ అంశంపై నేను కొన్ని ప్రశ్నలు అడిగాను. నా ప్రశ్నలకు సమాధానం చెబుతూ, ఈ ఆరోపణలను న్యాయమూర్తి విమదలాల్ సంఘానికే నివేదించగలమని శ్రీ మొరార్జీదేశాయ్ ప్రకటించారు.

జూన్ 18వ తేదీ సాయంత్రం నాలుగు గంటలకు పౌరహక్కుల రక్షణసంఘ సభ్యులు కొందరు ప్రధానమంత్రిని సందర్శించారు. వారి యెదుటనే ప్రధానమంత్రి హోంశాఖ అధికారి ఒకరికి టెలిఫోన్‌చేసి, వెంగళరావుకు లేఖ వ్రాసేట్టు హోంమంత్రిని ఎవరు మిస్‌లీడ్ చేశారని అడిగారట.

అంతేకాక, ఆంధ్ర హోంశాఖ కార్యదర్శి శ్రీ యం. వి. నారాయణరావుకు వెంగళరావుపై ఆరోపణలకు సంబంధించిన సమాచారం కొంత అందజేసినందుకుకూడ ప్రధాని దేశీయాంగశాఖ అధికారి నొకరిని మందలించారనితెలిసింది. అతనెదో సంజాయిషీ యిస్తుంటే

'విచారణలు కోరటానికి మీరు పిలిపించేది నేరస్తులని చెప్పబడే వారినా?' అనికూడ ప్రధాని ఎదురు ప్రశ్న వేశారుట.

ఏది ఏమైనా హత్యలకు సంబంధించిన ఆరోపణలకూడ న్యాయమూర్తి విచారణాల్కే అప్పగించాల్సి వుంటుందని ప్రధానమంత్రి ఆదేశించారు.

అయితే అదనపు పనిభారాన్ని మోసేందుకు న్యాయమూర్తి విచారణాల్ సంసిద్ధంగా లేక పోవడంతో మరొక న్యాయమూర్తి నెవరినయినా చూడమని న్యాయశాఖామంత్రికీ, దేశీయాంగశాఖ కార్యదర్శికి ప్రధాన మంత్రి ఆదేశాలు యిచ్చారు.

ఆ దశలో వారు ఆలోచించిన న్యాయమూర్తులు ఒకరిద్దరు ఈ బాధ్యతను తీసుకొనేందుకు వెనుకాడడంతో ఆంధ్రప్రదేశ్ ప్రధానన్యాయమూర్తి దీవాన్‌నుకూడ సంప్రదించారని తెలిసింది.

దీవాన్‌కూడ ఈ బాధ్యతను స్వీకరించడానికి సంసిద్ధతను వ్యక్తం చేయకపోవటం వలననే మరికొన్నిపేర్లు పరిశీలించి న్యాయమూర్తి బాధ్యతను ఈ బాధ్యత తీసుకోవలసినదిగా విజ్ఞప్తి చేశారు.

నిష్పక్షపాతి, నిర్మొహమాట సిద్ధాంతీగల న్యాయశాస్త్ర కోవిదుడు కూడ అఘుం భారవ తమకు ఆమోద యోగ్యమేనని పోలీసుల రక్షణ ఏర్పాటు సంతృప్తి కరమని సుముఖతను వ్యక్తం చేసిన అనంతరమే ఆయన పేరు ప్రతిపాదించేందుకు శ్రీ వెంకటరావుకు ఆదేశం లభించింది.

అయితే ఈసంఘం విచారణ అంశాలను రూపొందించడంలో శ్రీనారాయణరావు చెయి కూడ ఉంటే ఉండవచ్చు నను కుంటున్నారు. శ్రీవెంగళరావు నారాయణరావుల స్నేహం చాలా పాతది.శ్రీవెంగళరావు ముఖ్యమంత్రి పదవి సంపాయించడంలో కూడ నాడు కేంద్ర గూఢాచారి శాఖలో ముఖ్య పదవిలో ఉన్న నారాయణరావు సహాయంచాలా ఉన్నదనే అభిప్రాయం చాలా మంది వ్యక్త పరుస్తుంటారు.

1969 లో నక్సలైట్ ఉద్యమాన్ని ప్రభుత్వం నిర్దాక్షిణ్యంగా అణ చివేయ ప్రయత్నించిన రోజులలో శ్రీనారాయణరావు గూఢాచారి, నేర పరిశోధనశాఖ, డి.ఐ.జిగావున్నారు. వెంగళ్రావు హోంమంత్రిగా నియ మితులైన తర్వాతనే నారాయణ్రావు ఆపదవి లోనికి వచ్చారు. అత్యయిక పరిస్థితి కాలంలో కొన్నివార్తాలు శలవుపై ఉన్న రాష్ట్ర ఐ.జి అమెరికా వెళ్ళినప్పుడు.శ్రీవెంగళరావు, శ్రీనారాయణరావును రాష్ట్ర ఐజిగాతెచ్చు కున్నాడు. అతనిని వదిలేందుకు కేంద్ర గూఢచారిశాఖ దేశీయాంగ మంత్రిత్వశాఖ మొదట అంగీకరించకపోతే ముఖ్యమంత్రి శ్రీ సంజయ గాంధీ సహాయం పొంది శ్రీ నారాయణరావును తెచ్చుకున్నాడు.

శ్రీరామచంద్రారెడ్డి శలవు పూర్తికాగానే శ్రీనారాయణ్రావును ముఖ్యమంత్రి హోంశాఖ కార్యదర్శిగా వేసుకున్నారు. అందువలన వెంగ ళ్రావును పోలీసు అధికారులు కొందరిని ఆదుకోవాలనే ఆతృత నారాయణ ళ్రావుకు ఉన్నా ఉండవచ్చు అది అసహజంకాదు.

వెంగళరావు ముఖ్యమంత్రి పదవిలో ఉండగా ఆయన ప్రభుత్వ ములో ఉద్యోగంచేస్తూ తోటి పోలీసులకు. ముఖ్యమంత్రికీ రుచించన సాక్ష్యం చెప్పడం ఎలా సాధ్యపడగలదనే సంకోచాన్నికూడ కొందరు

పోలీసులు ఉన్నతాధికారులు నా ముందు వెలిబుచ్చారు. కాబట్టి వెంగళరావు అధికారంనుండి పోతే సాక్షులు నిర్భయంగా ముందుకువస్తారు. స్వల్ప నేరాలు చేసినట్టు ఆరోపణలు వస్తే విచారణ సమయంలో చిన్న ఉద్యోగులను సైతం తాత్కాలికంగా ఉద్యోగంనుండి తొలగించటం సాంప్రదాయం అలాంటప్పుడు ఘోరమైన నేరాల ఆరోపణలు ఎచ్చినప్పుడు శ్రీ వెంగళరావు మాత్రం ఎందుకు అధికారంలో ఉండాలి. యెందుకు ఉండనివ్వాలి అతనిని వెంగళరావు ప్రభుత్వాన్ని రద్దుచేసేందుకు కేంద్రానికి ఉన్న ఇబ్బందు లేమిటో తెలియదు. యేఇబ్బంది ఉన్నా ప్రజాఉద్యమాలు సాధించలేని సమస్య ఉండదు. కాబట్టి వెంగళరావు పదవినుండితొలగేట్టు నిర్బంధింప బడేట్టు చేయవలసిన బాధ్యత ప్రజలపై ప్రత్యేకించి యువకులు విద్యార్థులపై వున్నది—

మేధావులు, చదువులో అందరి కంటే మంచి మార్కులు తెచ్చుకుంటున్న విద్యార్థులు, ఇక్కడ కాకున్నా విదేశాలకైనా పెళ్ళి హాయిగా బ్రతకగల సాంకేతిక సాస్త్రజ్ఞులు తీవ్రవాదం వైపు ఎందుకు మొగు చూపారు ఆలోచించాలి. డాక్టర్ బాస్కరరావు, ఆదిభట్ల కైలాసం వెంటి సత్యం పైలావాసు దేవరావుతరిమెల నాగిరెడ్డి, రామనర్సయ్య, శీతా రామయ్య ఏ స్వార్థంతోను ఉద్యమంలోకి దిగలేదు.

నిప్లవ వాదులంతా బార్య పిల్లలను, బంధుమిత్రులనుకూడ మరచి పోయి తాము నమ్మిన విశ్వాసా కి అంకితమైనారు.

కళాశాల అధ్యాపకుడుగా హాయిగా జీవిస్తూ, పాలకులను ప్రసంసించే కవిత్వం వ్రాసి మెప్పుపొంది మెహర్బానీలు సాధించు కోగల శ్రీ వరవరరావు ఈ ఏడి ఎనిమిదేళ్ళ నుండి ఎందుకు యమ యాతనలు అనుభవిస్తున్నాడు. ఎందుకు అభాగ్యులను వెన్నుచరచి లేపే రచనలు చేస్తు

న్నారు. కేవలం సమాజశ్రేయస్సుకొరకే, కుట్ర వదల్చాలన్న ధ్యేయం తొ నే.

యం.ఏ. బి.యిడి. చదివి ఉద్యోగం చేసుకుంటున్న యువతి కుమారి స్నేహలత సాయుధపొగాటంలోచేరి, వరంగల్ అడవులలో తుపాకీగుండ్లకు ప్రాణాలర్పించింది. అమెకోసం కాదు మనకోసం. భావి తరాలకోసం. అందుకే తీవ్రవాదులపట్ల సానుభూతి అవసరం అయితే,

యువకులు విద్యార్థులు తీవ్రవాదాన్ని హింసా విధానాన్ని వదిలి పెట్టేటు చేయవలసిన బాధ్యతకూడ ప్రత్యేకించి విద్యావంతులపైన ప్రజా స్వామాన్ని కాంక్షించే రాజకీయపార్టీలపైన ఉన్నది. అంతేకాక తీవ్ర వాదం తలయెత్తేందుకు దోహదంచేసిన పరిస్థితులను సరిదిద్దేట్టు ప్రభు త్వాలపై వత్తిడి తేవలసిన బాధ్యతకూడ ప్రజలపైవున్నది. కల్లబొల్లి కబుర్లతో కాలక్షేపం కుదరదనే సంగతి ప్రభుత్వాలు అర్థంచేసుకుంటే తప్ప ఏ సంస్కరణనైనా తలపెట్టవు. ప్రజలు అప్రమత్తంగా ఉంటే ఆ తలపెట్టిని సంస్కరణలు చిత్తశుద్ధితో అమలుచేస్తారు. ఇవన్నీ వేరు విష యాలు.

ఇక్కడ అత్యంత ప్రాధాన్యతగల విషయం ఒకే ఒకటి. ఆ ప్రజాస్వామిక పద్ధతులు అవలంబించి ఘోరాతిఘోరంగా నేరాలు చేయించి, మేధావులను తుడిచిపేసిన నరహంతకుడిని గద్దెదింపడం, అతను తన నేరాన్ని కప్పిపుచ్చుకుని తప్పించుక పొకుండా చూడడమే ఇప్పుడు ప్రజలముందున్న తక్షణ కర్తవ్యం.

నేరాలు రుజుపుకావాలి. అవుతాయి. నేరస్తులకు శిక్షపడాలి. పడు తుంది. యెప్పుడు? ప్రజలు అప్రమత్తతో ఉంటే, అమ్ముడు పోయేవారిని కనిపెట్టిచూస్తేనే. సత్యమేజయతే!

58/9, ఓల్డ్ రాజేంద్రనగర్
న్యూఢిల్లీ–60.

ఆదిరాజు వెంకటేశ్వరరావు
ప్రత్యేక ప్రతినిధి 'దక్కన్ క్రానికల్'

కమ్యూనిస్టు ఉద్యమంలో రెండు దశాబ్దాలు

(1948-1968)

కాంగ్రెస్‌తో కలిసి మిశ్రమ ప్రభుత్వంలో పాల్గొనాలా లేక కాంగ్రెస్‌లో ఉన్న కొందరు ప్రగతి శీలురతో సహా వామ పక్షాల ప్రత్యామ్నాయ ప్రభుత్వం ఏర్పడేందుకు ప్రయత్నించాలా అన్న అంశం పై మొదటి నుండి కమ్యూనిస్టు పార్టీలో విభేదాలు ఉన్నాయి.

నెహ్రూ ప్రభుత్వ విధానాలను బలపరిచే విషయంలో కూడ కమ్యూనిస్టు పార్టీలో కొన్ని అంశాలపై అభిప్రాయ భేదాలు ఉండగా, శ్రీ నెహ్రూ సోషలిస్టు దేశాలతో మైత్రి పెంపొందించుకున్నారు.

నెహ్రూ ఈ ప్రయత్నం వల్లనే చైనా, రష్యాలతో సహా కమ్యూనిస్టు దేశాలన్ని 1950లో ఆయనతో చాలా స్నేహంగా ఉన్నాయి.

ఇది ఇలా ఉండగా 1953లో మధురైలో జరిగిన కమ్యూనిస్టు పార్టి తృతీయ సదస్సు ప్రప్రథమ పర్యాయం వామ పక్ష పార్టిలతో కలిసి దేశంలొని వివిధ రాష్ట్రాలలో క్రమ క్రమంగా ప్రభుత్వాలు ఏర్పాటు చేసి చివరకు జాతీయ స్థాయిలో కూడా వామ పక్ష ప్రజా స్వామ్య ప్రభుత్వం ఏర్పాటు చేయాలన్నది ఈ పిలుపు తాత్పర్యం.

సోషలిస్టు దేశాలతో సత్సంబంధాలు పెంచుకుంటున్న నెహ్రూ ఆహ్వానాన్ని పురస్కరించుకొని జూన్ 1954లో భారత

దేశం సందర్శించిన చైనా ప్రధాని చౌఎన్-లై, శాంతి సహకారం మొదలైన అంశాలతో కూడిన పంచశీల కార్యక్రమంపై సంతకాలు చేశారు.

1955 మొదటి భాగంలో నెహ్రూ సోవియట్ యూనియన్ సందర్శించగా, మరో సోషలిస్టు దేశం యుగోస్లావియా అధినేత మార్షల్ టిటో ఆ తర్వాత భారతదేశం సందర్శించారు.

బాండుంగ్ ఆసీన రాజ్యాల శిఖరాగ్రసమావేశంలో నెహ్రూ నిర్వహించిన పాత్ర ఆయన సోవియట్ మెప్పును సంపాదించగా సోవియట్ కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి శ్రీ కృశ్చేవ్ ప్రధానమంత్రి శ్రీ బుల్గానిన్ 1955 లోనే భారతదేశం సందర్శించారు.

ఈ పర్యటనలో భారత సోవియట్ మైత్రి ఆర్థిక సహకారం పెంపొందాయి. సోషలిస్టే రాజ్యాలతో భారత సంబంధాలు నానాటికి పెంపొందుతున్నందు వల్లనే భారతదేశాన్ని పూర్తిగా కమ్యూనిస్టు ప్రభావం క్రిందికి పోనీయకూడదన్న ఉద్దేశ్యంతో పాశ్చాత్య రాజ్యాలు కూడ ఆర్థిక సహాయాన్ని ఎక్కువచేశాయి చైనా సోవియట్ ప్రశంసలతో నిమిత్తం లేకుండానే భారత కమ్యూనిస్టు పార్టి భారత ప్రభుత్వపు ఆర్థిక విధానాలు ఎన్నింటితోనో విభేదించింది.

కాంగ్రెస్‌తో మిశ్రమ ప్రభుత్వం వామపక్ష ప్రత్యామ్నాయ ప్రభుత్వం వివాదం 1955 డిసెంబర్‌లో జరిగిన కమ్యూనిస్టు పార్టి కేంద్ర కమిటి సమావేశంలో కూడ తిరిగి తలయెత్తింది.

కాంగ్రెస్‌తో మిశ్రమ ప్రభుత్వం సిద్ధాంతాన్ని పార్టీ కార్యదర్శి శ్రీ ఘోష్ 1955 డిసెంబర్‌లో పూర్తిగా తృణీకరించారు.

కొందరు అభ్యుదయ కాంగ్రెస్ వాదులు, కమ్యూనిస్టు పార్టి

ప్రజా సోషలిస్టు పార్టి సభ్యుల మధ్య. ఉద్యమాల వల్ల ఏర్పడే సంఘీభావం సమైక్యత తుదకు జాతీయ స్థాయిలో ప్రత్యామ్నాయ ప్రభుత్వ ఏర్పాటుకు దోహదం చేయగలదన్నది ఘోష్ సిద్ధాంతం, ఈసిద్ధాంతాన్నే ఆయన పాల్ఘాట్ సమావేశంలో వివరించారు.

శ్రీ ఘోష్ ఈ సిద్ధాంతం రష్యా ఆలోచనకు అనుగుణమైనది. ఆంతకు ముందు సోవియట్ పార్టి 20వ వార్షికసమావేశంలో పాల్గొన్న ఘోష్ "శాంతియుతా పరివర్తన" సిద్ధాంతాన్ని ఏప్రిల్ 1956 పాల్ఘాట్ సమావేశంలో విపులంగా వివరించాడు.

"శాంతియుత పరివర్తన" సిద్ధాంత ప్రాతిపదికపైననే కమ్యూనిష్టు పార్టి 1957 ఎన్నికలలో పాల్గొని కేరళలో ఇతర వామ పక్షాల సహాయంతో మిశ్రమ ప్రభుత్వాన్ని స్థాపించ గలిగింది.

కొత్త ప్రభుత్వం ఏర్పడిన కొన్ని నెలలకు నవంబర్ 1957లో జరిగిన కమ్యూనిస్టు పార్టి ప్రతినిధుల సమావేశంలో శ్రీ ఘోష్ అధ్యక్షతన భారత ప్రతినిధి వర్గం కూడ పాల్గొన్నది.

"శాంతియుత పరివర్తన' సిద్ధాంతాన్ని ఈ సమావేశంలో చైనా కమ్యూనిస్టు పార్టి ప్రతినిధులు విమర్శించారు. ఆ తర్వాత చైనాపార్టి, కేరళలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడాన్ని కూడ విమర్శించింది. మాస్కో సమావేశం నుండి తిరిగి వచ్చిన భారత ప్రతినిధి వర్గం అమృత్‌సర్‌లో అత్యవసర సమావేశం జరిపి తమ విధానాన్ని క్షుణ్ణంగా చర్చించుకున్నారు. 1959 మధ్య ప్రాంతంలో కేరళ ప్రభుత్వాన్ని రద్దు చేయటం జరిగింది.

శాంతియుత పరివర్తన విధాన పునరుద్ఘాటనే అమృత్‌సర్ సమావేశంలో జరిగిన నిర్ణయం.

ఈ దశలోనే సోవియట్, చైనా పార్టిల మధ్య సిద్ధాంత

విభేదాలు పొడ చూపగా, చైనా-భారత సరిహద్దు వివాదం మొద లైనది. రష్యా ఈ వివాదంలో తటస్థ వైఖరి అవలంభించింది.

చైనా-భారత సరిహద్దు వివాదంలో తటస్థ వైఖరి అవలంభి స్తున్నట్లు 1959 సెప్టెంబరు 9 న ప్రకటించిన రష్యా, కేరళ ప్రభుత్వాన్ని రద్దుచేసి నందుకుగాని, టిబెట్‌లో భారత ప్రభు త్వం జోక్యం చేసుకుంటోందని చైనా ఆరోపించిన దరిమిలా గాని నెహ్రూని, ఆయన ప్రభుత్వాన్ని మాస్కో విమర్శించలేదు, రష్యా ఈ వైఖరిలో కూడా చైనాతో విభేదాన్ని మరింత పెంపొం దించింది.

ఈ దశలో 1961 లో విజయవాడలో జరిగిన కమ్యూనిస్టు పార్టి సమావేశంలో ప్రస్ఫుటమైన విభేదాలు పార్టి రెండు ముక్క లవుతుందా అనే టంతటి తీవ్ర దశను చేరాయి.

అయితే రష్యా సౌహార్ద్ర ప్రతినిధి వర్గం నాయకుడు చొరవ తీసుకొని రెండు వర్గాల మధ్య సమైక్యతను కాపాడగలగటం ఇక్కడ గమనార్హం. తమ మధ్య సిద్ధాంత విభేదాలను గురించి సోవియట్ కమ్యూనిస్టుపార్టీ ప్రపంచ పార్టీ లన్నిటికి 84 పేజీల రహస్య లేఖ రాయగా, దీనికి జవాబుగా చైనా పార్టీ తన వైఖరిని వివరిస్తూ 184 పేజీల రహస్యలేఖ పంపించింది.

1961-62 లో సరిహద్దు అతిక్రమణల గురించి భారత–చైనా ప్రభుత్వాలు పరస్పర నిందారోపణలకు దిగగా, సరిహద్దు లను అతిక్ర మించిన నేరం చైనా సైనికులే చేశారని కమ్యూనిస్టు పార్టీ స్పష్టంగా పేర్కొనింది. 1962 అక్టోబరులో రెండు దేశాల మధ్య సాయుధ సంఘర్షణ మొదలైనప్పుడు సోవియట్ యూని

యన్ మొదట తటస్థ వైఖరి అవలంభించినా, చైనా దురాక్రమణ జరిపిందని భారత కమ్యూనిస్టు పార్టి పేర్కొన్న అనంతరం రష్యా కూడ తన తటస్థ వైఖరిని మార్చుకొంది.

ఉభయ దేశాల మధ్య వివాద పరిష్కారానికి, విభేదాల తొలగింపుకి తాము మధ్య వర్తిత్వం వహించగలమని పలుమార్లు విజ్ఞప్తి చేసినా, చైనా పెడ చెవిని పెట్టి దురాక్రమణకు పూనుకున్నదని రష్యా ప్రకటించింది. చైనాతో సంఘర్షణ సందర్భంలో భారతదేశం పాశ్చాత్య దేశాల నుంచి ఆయుధాలు మందుగుండు సామాగ్రి దిగుమతి చేసుకోక తప్పలేదు. అంతకుముందు జరిగిన ఒప్పందం ప్రకారం భారతదేశానికి పంపవలసిన ఆయుధాలను రష్యా పంపలేదు. ఒప్పందం కుదుర్చుకొని, వాగ్దానంచేసి, ఆయుధాలు పంపకుండాఉండే నైతికహక్కు తనకు లేదనే సంగతి సాయుధ సంఘర్షణ ముగిసిన అనంతరమే రష్యా గుర్తించింది. చైనాను దురాక్రమణదారిగా పేర్కొన్న అంశంపైకూడ కమ్యూనిస్టుపార్టిలో ఏకాభిప్రాయం లేకపోవడంకూడ గమనార్హమైన మరొక విషయం.

1963లో రష్యా-చైనా విభేదాలు పరాకాష్టకు చేరుకుని రచ్చకెక్కాయి. అంతకు మునుపే వివిధదేశాల కమ్యూనిస్టు పార్టిలతో చైనా-రష్యా సిద్ధాంత అవలంబకులుగా ఉన్న కమ్యూనిస్ట్ నాయకులుకూడ చీలిపోయారు. సహజంగానే అంతకుముందు నుండి ఉన్న విభేదాలు భారత కమ్యూనిస్టుపార్టినికూడ పైనుండి క్రిందవరకు రెండుగా చీల్చాయి.

సోవియట్ సిద్ధాంతానికి అనుకూలంగా లేనివారు 1964 అక్టొబరు 31, నవంబర్ 7 తేదీన మధ్య కలకత్తాలో సమావేశమై

కమ్యూనిస్టు పార్టి (మార్క్సిస్టు) ఏర్పాటు చేయగా, రెండవ వర్గం వారు విడిగా డిసెంబర్ 13, 23 తేదేల మధ్య బొంబాయిలో సమావేశమై, తామే సిసలైన కమ్యూనిస్టులమని పేర్కొన్నారు.

పార్టిచీలన అనంతరం శ్రీ డాంగే ప్రత్యర్థివర్గానికి చెందిన మరికొంచరు సి. పి. ఎమ్. కార్యకర్తలు, నాయకులు నిర్బంధానికి గురికాగా 1965 పాకిస్తాన్, భారత సాయుధ సంఘర్షణ అవకాశంగా తీసుకున్న భారత ప్రభుత్వం ఇంకా అనేకమంది సి.పి.ఎమ్ సభ్యులను జైళ్ళలోపెట్టి, పరోక్షంగా మితవాద కమ్యూనిస్టుపార్టికి సహాయం చేసింది. కాని కమ్యూనిస్టుపార్టి రెండు ముక్కలు కావటంతో ఆగిపోలేదు. కొత్తగా ఏర్పడిన పార్టిలోకూడా అగ్ర నాయకుల మధ్య సిద్ధాంత విభేదాలు తలయెత్తాయి. సి. పి. ఐ. అవలంభించిన ప్రజాస్వామ్య పద్ధతిని, సి. పి. ఎమ్. అవలంభించిన శాంతియుత పద్ధతిలో ప్రజా ఉద్యమాలు నిర్మించడం సి. పి. ఎమ్ నాయకులు కొందరికి ఆమోద యోగ్యం కాలేదు.

తీవ్రవాదులనబడే బెంగాల్ నాయకులు కొందరు 1967 మార్చి మాసంలోనే డార్జిలింగ్‌లో "వ్యవసాయ కూలీల" సమావేశం జరిపి విప్లవ కమ్యూనిస్ట్ కమిటీని స్థాపించారు.

.చారుమజుందార్, కనుసన్యాల్ ఈ సమావేశం ఏర్పాటుకు చొరవ తీసుకున్న వారిలో ముఖ్యులు. ఇదిలాఉండగా ఇండియా, ఇండోనేషియా, బర్మాదేశాలలో సాయుధ విప్లవాలు తలఎత్తితే తప్ప పీడిత ప్రజలకు విముక్తిలేదని చైనా కమ్యూనిస్టు పార్టి జూన్ 10 న బహిరంగంగా పిలుపు నిచ్చింది.

చైనా పిలుపు సి. పి. ఎమ్. కు ఆమోదయోగ్యం కాలేదు. సాయుధ విప్లవం విచ్ఛిన్నకరమైనదనీ, అది వినాశనానికి దారి

తీయగలదని భావించిన సి. పి. ఎమ్. కొందరు నిజాయితీపరులు చిత్తశుద్ధి కలవారైన మెరికల్లాంటి పార్టీకార్యకర్తలు తీవ్రవాదం వైపు మొగ్గుచూపడం పట్ల ఆందోళన వ్యక్తంచేసింది.

1967 సాధారణ ఎన్నికల ఫలితాలు చైనా ఆశలను, నమ్మకాన్ని వమ్ముచేయడం కూడ, సాయుధ పోరాటానికి, చైనా పిలుపుకు దోహదంచేశాయి.

అభ్యుదయ నిరోధక పాలకులపై తీవ్రదాడి కొనసాగిస్తూ కార్మికులు, కర్షకులు భారతదేశంలో విప్లవ పంథాలో పురోగమిస్తున్నారని ఎన్నికలకు ముందు పెకింగ్ రేడియో సమీక్షలు పేర్కొన్నాయి.

మొత్తం 17 రాష్ట్రాలలోను 8 రాష్ట్రాలలో కాంగ్రెస్ పాలనను 1967 ఎన్నికలు అంతంచేసినా, ఉభయపార్టీల కమ్యూనిస్టుల కంటే అభ్యుదయ నిరోధకులని చెప్పబడే ఇతర మితవాద పార్టీల వారు కూడ గణనీయమైన స్థానాలుగెలుచుకున్నారు.

కేరళలో ఇతరపార్టీలతో పొత్తుతో సి.పి.ఎమ్. మంత్రి వర్గాన్ని ఏర్పాటు చేసినా, పశ్చిమ బెంగాల్‌లో తనకు బలం ఉండికూడా సి.పి.ఎమ్. నాయకత్వాన్ని కాంగ్రెస్ నుండి విడిపోయిన ముఠానాయకుడికి అప్పగించారు.

రెండు రాష్ట్రాల ప్రభుత్వాలలో తాను కీలకపాత్రను నిర్వహించటం విశిష్టవిషయమని సి.పి.ఎమ్. భావించింది. వర్గసమాజంలో తనహద్దులను సి.పి.ఎమ్. గుర్తించినప్పటికీ, ప్రభుత్వాలలో స్థాలొనటం వల్ల వర్గసంఘర్షణను విస్తృతపరిచి క్రమంగా ప్రజాబలాన్ని పెద్దయెత్తున సమీకరించుకొన వచ్చునని సి.పి.యం,

భావించింది.

ప్రభుత్వాలలో సి.పి.ఎమ్. భాగస్వామ్యాన్ని మొదట చైనా కమ్యూనిస్టుపార్టి గర్హించనప్పటికీ హర్షించలేదు.

కొన్ని నెలల తరువాత రెండు రాష్ట్రాల సి. పి. యం. భాగస్వామ్యాన్ని తీవ్రంగా విమర్శించి మౌలిక విధానాలను మార్క్సిట్టు పెట్టుబడి దారులు, భాగస్వాముల గుత్తాధిపత్యం నుండి ఉత్పత్తులను తప్పించేందుకు ఈ ప్రభుత్వాలు ఏ సంస్కరణలు తలపెట్టలేక పోతున్నవని పేర్కొన్నది.

అంతేకాక, చైనా కమ్యూనిస్ట్ పార్టీ, డార్జిలింగ్ నమావేశం తర్వాత మొదలైన "నక్సల్‌బారీ" ఉద్యమాన్ని గట్టిగా బలపరచి ప్రశంసించింది. ఈ రెండు రాష్ట్ర ప్రభుత్వాలలో తనపార్టీ భాగస్వామి కావడం వల్ల, ఈ పద్ధతి దేశం మొత్తానికి విస్తరించేట్టు కృషి చేసి "శాంతియుత పరిణామానికి" దోహదం చేయాలన్న మితవాద కమ్యూనిస్టు పార్టీ నాయకుడు శ్రీ డాంగె ప్రయత్నాలు ప్రకటనలు చైనా దాడిలో అరణ్య రోదనలు అయ్యాయి.

ఒక వైపు పెకింగ్ విమర్శలు, మరొకవైపు పార్టీలో సిద్ధాంత రాద్ధాంతాలు, మూడవ వైపు సాయుధ పోరాటానికి తీవ్రవాదుల సన్నాహం మధ్యన సి. పి. యం. కేంద్ర కమిటీ సమావేశాలు 1967 ఆగస్టులో మధురైలో జరిగాయి.

ఈ సమావేశంలో చర్చకు వచ్చినముసాయిదా తీర్మానానికి ప్రత్యామ్నాయంగా, నాగిరెడ్డి ప్రభృతులు వేరొక ముసాయిదాను ప్రతిపాదించగా అది వీగిపొయింది. తర్వాత కేంద్రకమిటీ ముసాయిదా రాష్ట్ర కమిటీల అనుమతికి విడుదల కాగా, అప్పటి

రాష్ట్ర కమిటీలో నాగిరెడ్డి వర్గానికి మెజారిటీ ఉంచటం వల్ల అధికార ముసాయచా త్రోసిపుచ్చబడింది.

పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లులో 1968 జనవరిలో జరిగిన రాష్ట్ర కమిటీ సమావేశంలో నాగిరెడ్డి ముసాయిదా తీర్మానానికి మెజారిటీ లభించగా, దానిని ఆయన, ఆయన అనుయాయులు బర్ద్వాన్ సమావేశంలో ప్రతిపాదించారు.

వ్యతిరేకత కొంత ఉన్నప్పటికీ కేంద్ర కమిటీ ముసాయిదా తీర్మానమే కొన్ని సవరణలతో బర్ద్వాన్ సమావేశం ఆమోదం పొందింది.

ఈ సమావేశాల తర్వాత కూడ ఆంధ్ర నాయకులు శ్రీ తరిమల నాగిరెడ్డి, చంద్ర పుల్లారెడ్డి, చెవులపల్లివెంకటేశ్వరరావు, కొల్లావెంకయ్యతమసిద్ధాంతానికి అనుగుణంగాపార్టిలోబలాన్ని సమీకరించుకొనేందుకు ప్రయత్నించగా కేంద్ర సంఘం వీరిని 1968 జూన్ 16వ తేదీన పార్టీ నుండి బహిష్కరించినది. అదే నెల 29. 30 తేదీలలో విజయవాడలో సమావేశమైన నాగిరెడ్డి వర్గం కమ్యూనిస్టు విప్లవ పార్టీగా రూపు సంతరించుకొన్నది. తొమ్మిది మంది సభ్యులతో సమన్వయ సంఘం, నలుగురు సభ్యులతో సెక్రటేరియట్ కల ఆంధ్ర కమ్యూనిస్టు విప్లవ సంఘం, ఆవిర్భవించింది. జులై 23, 25 తేదీలలో శ్రీ నాగిరెడ్డి కమ్యూనిస్టు విప్లవ పార్టీ విజయవాడలో తిరిగి సమావేశమై రెండు తీర్మానాలను ఆమోదించినది. "కొత్త రివజనిస్టులు" మార్క్సిస్టులకు వ్యతిరేకంగా సిద్ధాంత పోరాటం కొనసాగించటం, వర్గసమస్యలపై ప్రజలను సమీకరించటం ఈ రెండు తీర్మానాల సారాంశం. విజయ

వాద సమావేశం అనంతరం కలకత్తా సమన్వయ సంఘంతో చర్చలు మొదలు పెట్టింది.

తమకు అఖిల భారత కమ్యూనిస్టు విప్లవ కారులు సమన్వయ సంఘం సిద్ధాంతాల మధ్య కొంత ఎకీభావం ఉన్నదని నాగిరెడ్డి వర్గం గ్రహించింది. తర్వాత ఆంధ్రప్రదేశ్ విప్లవ కారులు తమ సంఘాన్ని రద్దుచేసుకొని అఖిల భారత సమన్వయ సంఘంతో అనుబంధం పొగదారు.

రాష్ట్ర కమిటీ అనుబంధం పొందడానికి ముందుగానే, బెంగాల్ విప్లవ కారులు, గుంటూరులో శ్రీ వెంకట రత్నం ఆధ్వర్యాన పనిచేస్తున్న నక్సల్‌బరీ ఉద్యమ సౌహార్ద సంఘం ద్వారా ఆంధ్ర విప్లవ కారులు కొందరితో ప్రత్యక్ష సంబంధాలు పెట్టుకున్నారు.

అక్టోబరుమాసంలో జరిగిన కలకత్తా సమావేశానికి ముందుగానే శ్రీకాకుళం విప్లవకారులు బొడ్డపాడులో సమావేశాలు జరిపి శ్రీ తేజేశ్వరరావు కన్వీనర్‌గా 14మంది సభ్యులతో సమన్వయ సంఘాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ఈ సమావేశాలకు చారుమజుందార్, కనుసన్యాల్, శుశీల్‌రాయ్ ప్రభృతులు బెంగాల్ నాయకులు కూడ హాజరయ్యారు.

రాష్ట్ర కమిటీతో నిమిత్తం లేకుండానే శ్రీకాకుళం జిల్లా ప్రతినిధులు కూడ కలకత్తా సమావేశంలో పాల్గొన్నారు.

కలకత్తా సమావేశాల అనంతరం ఆంధ్ర సమన్వయసంఘ సభ్యులతో తాము జరిపిన చర్చలను గురించి కేంద్ర సమన్వయ సంఘమే శ్రీకాకుళం జిల్లా ప్రతినిధులకు వివరించింది.

రాష్ట్ర సమన్వయ సంఘ ప్రతినిధులు నవంబర్ మాస

ములో శ్రీకాకుళం వెళ్ళి ఈ జిల్లా సంఘం తమ నాయకత్వంలో పనిచేసేట్లు ఒప్పించడానికి విఫలయత్నం చేశాడు. రాష్ట్ర సంఘ నాయకత్వంలో పనిచేయడానికి సిద్ధంగా ఉంటే రాష్ట్ర సంఘం సాయుధ పోరాటాలలో శిక్షణ నిచ్చి గెరిల్లా యుద్ధానికి ఆయత్తం చేయగలదని కూడ రాష్ట్ర సంఘం జిల్లా సంఘానికి తెలిపింది.

రాష్ట్ర సంఘం ఈ సలహాను జిల్లాసంఘం తిరస్కరించింది. రాష్ట్ర సంఘంతో జిల్లా సంఘం కేవలం సమన్వయంగా పనిచేయ గలదని, రాష్ట్ర సంఘ సూచనలలో తమకు అనుకూలమైన వాటిని శిరసావహించి మిగతా విషయాలలో స్వతంత్రంగా నిర్ణయాలను గైకొనగలదని జిల్లాసంఘం పేర్కొన్నది.

డిసెంబరులో మరొక పర్యాయం రాష్ట్రకమిటీ ప్రతినిధులు శ్రీకాకుళం కమిటీ కార్యదర్శితో చర్చలు జరిపి, కేవలం సమన్వయంవల్ల ప్రయోజనం ఉండదని విమర్శించారు. సమన్వయంతో పనిచేయాలనుకుంటునే రాష్ట్రకమిటీకి తెలియకుండా వివిధ జిల్లాల నుండి శ్రీకాకుళం ఉద్యమానికి కార్యకర్తలను భర్తి చెయటం, సమన్వయం ఎలా అవుతుందని కూడ రాష్ట్రకమిటీ ఏస్పష్టం చేసింది. అయితే శ్రీకాకుళం కమిటీ అఖిలభారత సమన్వయ కమిటీతో ప్రత్యక్ష సంబంధం ఉండటం వలన ఈ జిల్లా కమిటీ, రాష్ట్రకమిటీకి దాదాపు పోటీసంఘంగా పనిచేసింది. ఈ స్థితిలో రాష్ట్ర సంఘానికి, అఖిలభారత కమిటీకి మధ్య కూడ స్నేహపూరిత సంబంధాలు ఉండే అవకాశం లేదు. అందుకే అఖిల భారత కమిటి, రాష్ట్రకమిటీతో తమకు సిద్ధాంతపర మౌళిక ఏభేదాలు ఉన్నవని పేర్కొన్నది.

1969 ఫిబ్రవరి 7వ తేదీన ఆంధ్రకమిటీ అనుబంధాన్ని

రద్దు చేస్తూ, ఈ విభేదాలగురించి అఖిలభారత కమిటీ వెల్లడి చేసింది. అయితే ఆంధ్రాకమిటీ సభ్యులను కమిటీ బయటి "స్నేహితులు" "కామ్రెడ్స్" గా భావించాలని, ఉభయుల మధ్య విద్వేషరహిత సంబంధాలు ఉండగలవని కూడ కేంద్ర కమిటి పేర్కొన్నది.

చైనా కమ్యూనిస్టు పార్టీపై ఆంధ్ర కమిటీకి సంపూర్ణ విశ్వాసం లేదనీ, ప్రజాస్వామ్యపద్ధతిని నిరసించాలన్న నిర్ణయాన్ని శాసన సభ సభ్యత్వానికి రాజీనామా చేయక పోవటం ద్వారా శ్రీనాగిరెడ్డి అమలు జరపలేదని, శ్రీకాకుళం రాష్ట్రకమిటీ కేవలం సవతితల్లి సానుభూతి చూపుతున్నదని కేంద్రకమిటీ తన తీర్మానంలో శ్రీరెడ్డి ప్రభృతులపై ఆరోపించింది.

ఈ అనుబంధం రద్దుచేసిన కొన్నిరోజులకే మరొక ముఖ్య నిర్ణయాన్ని-విప్లవకారులతో మరో సిద్ధాంత పార్టిని ఏర్పాటు చేయాలని కూడ కేంద్ర కమిటీ నిర్ణయించింది: ఈ నిర్ణయాన్ని దృష్టిలో ఉంచుకుని పరిశీలిస్తే ఆంధ్ర కమిటీ పై ఆరోపణలలో పసలేదని స్పష్టమవుతున్నది. కేరళ పోలీస్ స్టేషన్ పై దాడిని శ్రీనాగిరెడ్డి మొదట వ్యతిరేకించినా, దాడులు జరిగిన అనంతరం, ఆ సంఘటనను ప్రశంసిస్తూనే ఆంధ్ర కమిటీ అధికార పత్రిక "జనశక్తి" రాసింది.

శ్రీనాగిరెడ్డి తన శాసనసభ సభ్యత్వానికి మార్చి11న రాజీనామా చేశారు. పార్టి ఏర్పాటు చేయాలన్న కేంద్ర కమిటీ నిర్ణయం తెలుగులో సమీక్షిస్తే కేవలం తమ ఆధిపత్యం నిలుపుకునేందుకే బెంగాల్ నాయకులు, ఆంధ్ర నాయకులను దూరంచేసుకుని

శ్రీకాకుళం జిల్లా నాయకులను పావులుగా ఉపయోగించుకున్నారని బోధపడుతుంది.

కేంద్ర కమిటీ దేశంలో విప్లవ సంఘాలన్నిటికి ప్రాతినిధ్యం వహించిందని కూడ చెప్పేవీలులేదు. ఉదాహరణకు బెంగాల్‌లోనే నాలుగైదు విప్లవసంఘాలు, కేరళలో కొన్ని సంఘాలు, మహారాష్ట్ర సంఘం, మార్క్సిస్టు పార్టి అనుబంధ కమిటీలు కాకేదు. "మహారాష్ట్ర కమిటీ సి.పి.ఎమ్. రాష్ట్రశాఖగా మారడాన్ని తిరస్కరించి" ఆంధ్ర నాయకులతో స్నేహం పెంపొందించుతున్నది. మావోసిద్ధాంతాలు ప్రాతిపదికపై దేశం మొత్తంలో విప్లవకారులు అందరు భాగస్వాములయ్యే పార్టిని రూపొందించాలని కూడ మహారాష్ట్ర విప్లవకారులు ఆంధ్ర విప్లవకారులను కోరారు. ఆంధ్ర విప్లవకారుల సంఖ్యాబలం, నాయకత్వాన్ని యివ్వగలవారి సమర్థత, మేధాశక్తి బెంగాల్ నాయకులకు తమ పెత్తనం పోగలదని భయపడటానికి దోహదం చేసినట్లు అనిపిస్తున్నది.

అనుబంధం రద్దయిన అనంతరం ఆంధ్ర విప్లవకారులు ఫిబ్రవరి 3వ వారంలో విజయవాడలో సమావేశమై తమ పై కేంద్రకమిటీ ఆరోపణలను ఖండించారు. కేంద్రకమిటీ చర్య ప్రతిఉద్యమాన్ని దెబ్బతీయటానికి తోడ్పడగలదని పేర్కొంటూ, దేశంలో విప్లవకారులంతా సమగ్రతతో విప్లవపోరాటం కొనసాగించవలసిన సమయం ఆసన్నమైనదని పిలుపునిచ్చారు.

మావో సిద్ధాంతాలు అమలు చేయటంలో అవలంభించే మార్గాలపై ఏర్పడే అభిప్రాయ భేదాలు, చర్చలద్వారా పరిష్కరించుకోవాలని కోరారు. తమ అనుయాయులతో విస్తృత సమావేశం

జరిపి తక్షణ కార్యక్రమం రూపొందించాలని కూడ నిర్ణయించారు.

కృష్ణాజిల్లా తిరువూరు తాలూకా అట్లూ ప్రగడ గ్రామంవద్ద ఒక నిమ్మతోటలో ఏప్రిల్ 10-12 తేదీలలో రాష్ట్రకమిటీ విస్తృత సమావేశం జరిగింది.

అట్లూ ప్రగడ రాష్ట్రస్థాయి సదస్సు:— దాదాపు 60 మంది పాల్గొన్నా ఈ సదస్సులోనే సాయుధ పోరాటం, ఇతర అంశాలపై తీర్మానాలు ఆమోదించి "తక్షణ కర్తవ్యం" అనే పేరుతో ఒక కరపత్రం విడుదలచేశారు. ఈ కరపత్రంలో కొన్ని ముఖ్యాంశాలు:- నూతన సమాజాన్ని నిర్మించేందుకు బూర్జువా ప్రభుత్వాన్ని తుదముట్టించాలి. భూస్వాములను పరిమార్చి వారి భూములు పేదరైతులకు. వ్యవసాయ కూలీలకు పంచిపెట్టాలి.

పారిశ్రామిక రంగంలో విదేశ పెట్టుబడులన్నిటినీ స్వాధీనం చేసుకోవాలి. ప్రస్తుతసైన్యం కిరాయిమూక కసుక దాని స్థానంలో ప్రజాసైన్యం రూపొందించాలి.

సాయుధ విప్లవానికి గ్రామీణ ప్రాంతాలలో స్థావరాలు ఏర్పరచి వాటిని విముక్తంజేసి, తర్వాత క్రమంగా పట్టణ ప్రాంతాలలో దిగ్బంధంచేయాలి.

ఎన్నికల కొరకు రివిజనిస్టులు ఏర్పాటు చేసుకొనే ఐక్య సంఘటనలకు పోటిగా, విప్లవకార్యరంగంలో వున్న భిన్న వర్గాలతో కార్యాచరణకు ఐక్యసంఘటన ఏర్పాటు చేయాలి. విప్లవ విజయానికి ఇది ఎంతో అవశ్యకం.

విప్లవ పంథా అమలులో అరణ్యప్రాంతాలు, పర్వత ముఖ మైన ప్రదేశాలు. అవి శత్రువుకు ప్రతికూలంగా ఉంటాయి. ఈ

ప్రాంతాలలో ప్రజలు కూడ తిరుగుబాటు చేస్తున్నారు కనుక అక్కడ ఎక్కువ శ్రద్ధచూపి గెరిల్లా దళాలు నిర్మించాలి.

శ్రీకాకుళం పోరాటం మొదలైనది కనుక ఖమ్మం, వరంగల్, కరీంనగర్ తూర్పుగోదావరి జిల్లాల్లో కనుపించే చైతన్యాన్ని విప్లవంగా మార్చాలి.

మహబూబ్ నగర్ జిల్లా ఉప్యమానికి తొలి చర్యలు మొదలైనాయి. రాయలసీమ జిల్లాల ప్రతినిధుల సహకారం త్వరలో జరుగుతుంది.

గెరిల్లా దళాల నిర్మాణం, ప్రాంతీయ కమిటీల నిర్మాణం, సాయుధ పోరాటంలో శిక్షణ జూన్ మాసంలోగా పూర్తిచేసి వర్షాకాలంలో కొత్త కార్యక్రమం అమలు జరుపడానికి ఉపక్రమించాలి.

ఈ తీర్మానం ప్రాతిపదికగానే ప్రభుత్వం శ్రీ నాగిరెడ్డి అయన వర్గంపై కుట్రకేసు పెట్టింది.

మధురై సమావేశం అనంతరమే శ్రీకాకుళం జిల్లా సంఘం కూడ మార్క్సిస్టుపార్టీ అధికార పంధాలో విభేదించినా, ఈ జిల్లా ప్రముఖులు కొందరు బర్ద్వాన్ సమావేశాలకు కూడ వెళ్ళి, ఆతర్వాతనే పార్టితో తెగతెంపులు చేసుకొని విప్లవ కమ్యూనిస్టు కమిటీగా రూపొందారు.

శ్రీ నాగిరెడ్డి వర్గానికి, శ్రీకాకుళం జిల్లా సంఘానికి కూడ సిద్ధాంత విభేదాలు తలఎత్తగా, జిల్లాపార్టి కార్యదర్శి శ్రీ వసంతాడ రామలింగాచారి, శ్రీ నాగిరెడ్డిపై సానుభూతితో ఉండి, ఇరు వర్గాల మధ్యపొంతనకు విఫలయత్నంచేశారు.

ప్రజాస్వామ్య విధానాన్ని సంపూర్తిగా తిరస్కరించి వెంటనే సాయుధ పోరాటం చేపట్టాలనేది శ్రీకాకుళం జిల్లా నాయకుల విధానంకాగా, నాగిరెడ్డి విధానం కొంతమధ్యేమార్గమయింది. తగిన శక్తిని సమకూర్చుకొని పునాదులు పదిల పరచుకొనేందుకు కొంత వ్యవధిని తీసుకోవాలని ఈలోగా ప్రజాస్వామ్య సంస్థలను

కూడ తన సిద్ధాంత ప్రచారానికి సంపూర్ణంగా వినియోగించు కోవాలనేది నాగిరెడ్డి వర్గవాదన.

అందుకే పోలీస్ స్టేషన్లపై దాడులకు శ్రీ నాగిరెడ్డి తమ విముఖతను తెలియజేసారు.

అందువల్లనే శ్రీకాకుళం జిల్లా నాయకులు పంచది కృష్ణ మూర్తిచౌదరి, తేజేశ్వరరావు గుంటూరుజిల్లా నక్సల్‌బరీ ఉద్యమ సౌహార్ద్ర సంఘనాయకుడు మూలిపురి వెంకటరత్నం ద్వారా నక్సల్‌బరీ నాయకులతోను, ప్రత్యేకించి చారుమజుందార్ కను సన్యాల్‌లతో సరాసరి సంబంధాలు ఏర్పరుచుకున్నారు.

నాగిరెడ్డి వర్గం 1968 అక్టోబరు నాటికి విప్లవ కమ్యూనిస్టుల అఖిల భారత సమన్వయ సంఘంలో మొత్తు కుదుర్చుకున్నారు. అయినా శ్రీకాకుళం కమిటీ స్వతంత్రంగానే వ్యవహరించింది.

నాగిరెడ్డి తన శాసన సభ్యత్వానికి రాజీనామా చేయలేదన్న కారణంతో మార్చి 1969లో అఖిల భారత సమన్వయ సంఘం అనుబంధాన్ని రద్దు చేసింది.

నాగిరెడ్డి వర్గం వారికి, కమిటీ వెలుపలి స్నేహితులుగా భావించేందుకు, వారిలో విద్రోహరహిత సంబంధాలు ఉంచు కునేందుకు నిర్ణయించింది.

పార్టీ, పార్టీ బ్యూరియో క్రసీ ఉద్యమనిర్మాణానికి దోహదం చేయజాలవని, వివిధ విప్లవ కమిటీల మధ్య సమన్వయంతోనే సాయుధ విప్లవంపురోగించ గలవనే సిద్ధాంతాలు మొదట వల్లించిన నక్సల్‌బరీ నాయకులు, తమ ఉద్యమం మొదలైన ఏడాదికి, మావో సిద్ధాంత ప్రాతిపదికపై అఖిల భారత కమ్యూనిస్టు పార్టీ ఏర్పాటు చేసేందుకు నిశ్చయించారు.

ఈ నిర్ణయ ఫలితమే 1969 ఏప్రిల్ 22న రూపు సంతరించు కొని మే మొదటి తేదీన వెలుగులోపడిన మార్క్సిస్టు లెనినిస్టుపార్టి ఇదొక్కటే భారతదేశంలో నిసర్గమైన కమ్యూనిస్టు పార్టిగాతాను గుర్తించినట్టు జూన్‌లో చైనా ప్రకటించింది.

గిరిజన పోరాటాలు

కసాయివారికంటే కఠినంగా వ్యవహరించిన విదేశీ స్వదేశీ పాలకుల కిరాయి సైనికుల మరఫిరంగులకు, తుపాకి గుండ్లకు రొమ్ములు చూపిన ఏ విప్లవ యోధుని చరిత్ర చూచినా, ప్రభుత్వాలపై జరిగిన ఏ తిరుగుబాటు పూర్వాపరాలను ఇంగితజ్ఞానంతో పరిశీలించినా, ఇతర దేశాలలోవలేనే ఈ దేశంలో జరిగిన పోరాటాలు కూడ ధర్మయుద్ధాలని బోధపడుతుంది.

ఈ పోరాటాలకు నాయకత్వం వహించి, నేలకొరిగిన అమర వీరులుకూడ నిజాయితీ పరులు నిస్వార్థపరులు, పరోపకారులని రుజువవుతుంది.

గత రెండు శతాబ్దాలలో రాష్ట్రంలో, దేశంలోనేకాక సృష్టి మొదలైనప్పటినుండి ప్రపంచంలో ఏమూల జరిగిన తిరుగుబాటు పరిశీలించినా వెల్లడయ్యే నగ్నసత్యం ఇదే. చరిత్రకారులు చాటి చెప్పింది, దేశాధిపతులు క్రమేణ అంగీకరించినదీ ఈ సత్యమే.

శ్రీకాకుళం ప్రాంతంలో, రాష్ట్రంలోని మరికొన్ని ప్రాంతాలలో ఇటీవలి తీవ్రవాదుల సాయుధ పోరాటం యువతరానికి తొలి అనుభవం. వృద్ధతరానికి గత నూటయాభై సంవత్సరాలలో

జరిగిన ఉద్యమాల గురించి కాకున్నా యాభైఏళ్ల క్రితం జరిగిన పితూరీ, దీని నాయకుడు సీతారామరాజు గురించి బాగా తెలుసు.

నీతికి నిజాయితీకి నిష్కల్మష నిరాడంబర జీవనానికీ ప్రతి రూపాలైన నిరుపేద నిత్యపీడిత గిరిజనులు, తమపై అన్యుల అరాచకం దోపిడీ అన్ని హద్దులు దాటిన సందర్భాలలోనే తిరుగు బాటు చేశారు.

మన రాష్ట్రంలోనే కాక అస్సాం, మధ్యప్రదేశ్, ఒరిస్సా, బీహార్. గుజరాత్ రాష్ట్రాలలో ఈ శతాబ్దంలో, ఇంతకుముందు శతాబ్దంలో జరిగిన తిరుగుబాటులో, మందబలం, గుండా మంద బలం, మందుగుండు బలం ఉన్నా ప్రభుత్వాలే విప్లవకారులను కూల్చి, చంపి విప్లవాలను రుధిర సముద్రంలో ముంచడంలో విజయం పొందినా, తిరుగుబాటుదారుల త్యాగాలు వృధాకాలేదు.

ప్రతి విప్లవం తర్వాత పీడితప్రజలు పాలకుల దృష్టిని ఆకర్షించారు. సాటి పీడితులకు అలా పాక్షిక న్యాయమైనా సాధించగలిగారు. విప్లవకారులు తమ ప్రాణాలు పణ మొడ్డిన హృదయవిదారక విషయమేమిటంటే, ఏ కారణాలు, అలుగుట కూడ తెలియని వారిని ఆయుధాలు పట్టేందుకు, అరవై ఏళ్లక్రితం ప్రేరణలమాయో, అంతకు అరవైఏళ్లక్రితం కారణమేమాయో ఆ కారణాలే నేడు సాయుధ విప్లవానికి సిసలైన ప్రాతిపదికగా ప్రజ్వ రిల్లు తున్నాయి.

నియంతృత్వ యుగ అంధకారంలో నాడు ఈ బానిసలను పరిపాలించిన తెల్లదొరలు, స్వాతంత్ర్య భానుని వెలుగులో భారత దేశాన్ని 30 ఏళ్లుగా పీడిస్తున్న తెల్లగుడ్డల దొరలు, శాసనాలు

చేసి కన్నీళ్లు తుడిచారు తప్ప, ఆర్తనాదం చేసేవారి ఆకలి తీర్చ లేక పోతున్నారు. మనిషిని మనిషి దోచుకుంటుంటే, దోపిడీదార్ల వెన్నుచరిచి తమను నమ్మిన అభాగ్యుల గుండెలలో గునపాలు వేస్తున్నారు.

హరిజనులు, భాషా, అల్పసంఖ్యాకులు క్రమంగా తమ పరిస్థితి కొంతమెరుగు చేసుకుంటున్నా, గిరిజనులకు నక్సలైట్ ఉద్యమం మొదలయేవరకు, దానిలో వారు సంపూర్ణ భాగస్వాములు అయేవరకు ఈ అవకాశం దొరకలేదు.

ఆదిమ జాతి సుప్రసిద్ధ సేవకుడు వెన్నెలకంటి రాఘవయ్య గారు దేశంలో విదేశాలలో జరిగిన అనేక గిరిజన తిరుగుబాట్ల గురించి ఎంతో సమాచారం సేకరించి "ట్రైబల్ రివోల్ట్స్" అనే గ్రంధంలో సంక్షిప్తంగా పొందుపరిచి యువతరానికి కనువిప్పు కలిగే గొప్ప సేవచేశాడు. గిరిజనుల ఆచార వ్యవహారాలను అలవాట్లను గురించి కూడ ఆయన విపులంగా వివరించాడు. ఉద్యమాలను సంపూర్ణంగా అధ్యయనం చేసిన ఆయన ఒకచోట ఇలా అన్నారు. ఉద్యమాలనన్నింటవల్ల పెద్దఖర్చుతో కొన్ని గుణపాఠాలను విదేశీ పాలకులు నేర్చుకొనక తప్పలేదు. గిరిజన ప్రాంతాల ప్రజల అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ గైకొనాలని, గతంలో వారిని నిర్లక్ష్యం చేసినందుకు, వారి ప్రయోజనాల పరిరక్షణకు ప్రత్యేక శాసనాలు చేయాలి తప్ప కేవలం పాలనా యంత్రాంగం ద్వారా ఏమో చేయాలనుకుంటే కుదరదని అర్థం చేసుకున్నారు. అందుకే విశిష్ట శాసనాలు రూపొందాయి అన్నారాయన. నేడు మన ప్రభుత్వం అనుభవం ఆలోచన కూడ ఇందుకు భిన్నమైనవి కావు.

అంటే మధ్యకాలంలో పాలకులు నేర్చుకొన్న గుణపాఠాలకు జరి గింది సున్న అనుకోనచ్చు కదా!

గిరిజనుల సాంఘిక ఆచారాలు, న్యాయ విధానం వ్యవ స్థాయ పద్ధతి చాలా విశిష్టమైనది. ఎక్కడో దూరప్రాంతాలలో కూర్చొని విచారణ జరిపే న్యాయస్థానాలలో న్యాయవాదులకు ఫీజు యివ్వగల స్థోమతుపైన, సాక్ష్యాల తెలివితేటలపై దొరికే న్యాయంతో సంబంధం పెట్టుకొనకుండా వారి పద్ధతి వారే రూపొం దించుకున్నారు. ఆంతరంగిక కలహాలు, ఆస్థి తగాదాలు ఇతరనే రాలు ఏ తెగవారివి ఆ తెగ పెద్ద మనుషులే అక్కడికక్కడ విచా రించి తీర్పు ఇవ్వటం ఈ పద్ధతి విశిష్ఠత. గ్రామాలలో వివిధ తెగల ప్రతినిధులైన పెద్దలు విచారణ జరిపితే, గ్రామాల మధ్య తగాదాలు వివిధ గ్రామాల పెద్దలు కలిసి కూర్చొని విచారిస్తారు. ఇది వారి న్యాయ నిధానం. వ్యవసాయ విషయంలో కూడ భూమి పై ఎవరికీహక్కు ఉండదు. పెద్దలు ఎప్పటికప్పుడు ఎవరేభూమి సేద్యం చేయాలో నిర్ణయంచేసి ఆదేసిస్తారు.

సభ్యుల సంఖ్య ఎక్కువ ఉన్న కుటుంబాలకు చిన్న కుటుంబాల కంటే ఎక్కువభూమి కేటాయిస్తారు. అడవులు కొండ లను తొలగించి సేద్యభూమి విస్తరించుకొనేందుకు కూడ పెద కుటుంబాలకు అనుమతి దొరుకుతుంది. ఇది వారి సనాతన ఆచా రాలలో ఒకటి. సంపాదనకు వ్యాపారానికికాక కేవలం జీవనో పాధికే వారా వ్యవసాయం చేసుకుంటారు కనుక ఎవరిష్టమొచ్చిన పంట వారు పండించుకోవచ్చు.

వ్యాపారం లాభాలకొరకు వ్యవసాయం చేసి గిరిజనేతరులు గిరిజన ప్రాంతాలకు తరలివెళ్ళడం వల్లనేమో,వ్యవసాయం తమకు

లాభసాటి కాకపోవడంవల్లనేమో గిరిజనులు రుణగ్రస్థులు కావడం మొదలైంది. వడ్డి వ్యాపారులు నరరూప రాక్షసులై విపరీతమైన రుణబాధకు అమాయక గిరిజనులను గురిచేసి వారి సొమ్ములు కాజేశారు. మరొకవైపు ప్రభుత్వానికీ లేక వారి ప్రతినిధియైన స్థానిక పాలకులకు ఏజంట్లయిన ముఠాదారుల శిస్తుపేరుతో కూడ తమ దోపిడి అధికం చేశారు. బీహార్‌లో నీలిమందే పండించాలని (తాము దానిని ఎగుమతి చేసుకొనేందుకు) బ్రిటిష్‌వారు పట్టు పట్టినట్టే కొన్నిచోట్ల కొన్ని పంటలు పండింలననే మరికొందరు పెత్తందారులు ఆగడాలు మొదలుపెట్టారు.

పై కారణాలు పూర్వ రంగంగా తమ ఆచార వ్యవహారాలు అంతరించిపోతున్నదని ఆందోళనతో, సంస్కృతి మంట కలిసిపోతున్నదన్న మధనపడి 1860లోనే గిరిజనులు తిరుగుబాటు చేశారు. గిరిజనులకు పాలకులకును తమకు తాముగా నియమించు పాదరీలు ఇతర బ్రోకర్ల బెడదకూడ గిరిజనులు భరించలేక పోయారు,

ఈ తిరుగుబాటు 1872 తిరుగుబాటు ఫలితంగానే 1874 ఏజెన్సీ ప్రాంతాల శాసనం రూపొందింది. అంతకుముంచు 1836, 1840 1849, 1851, 1854, 1855లో కూడా వివిధ ప్రాంతాల గిరిజనులు పెక్కు ప్రేరణలతో ప్రభుత్వానికి ఎదురు తిరిగారు.

బందిపోటు దొంగకు తడికె అడ్డం రాదుకదా? దోపిడి దారులకు ఈశాసనం అడ్డం రాలేదు. అందుకే మళ్ళీ 1875,

1880, 1894, 1896, 1921లో గిరిజనులు మళ్ళీ మళ్ళీ వేరే వేరే చోట్ల తిరుగుబాటు చేయక తప్పలేదు.

ఈ తిరుగుబాట్లవల్ల 1917లో సీమదొరలు భూముల రెగ్యులేషన్ చట్టాన్ని తెచ్చారు. ఈ చట్టప్రకారం ప్రభుత్వ ప్రతినిధి అనుమతి లేకుండా భూముల బదిలీకి అవకాశం లేదు.

వడ్డివ్యాపారులు గిరిజనులను దోచుకొని వారి స్థిరచరాస్తులు అతిసులువుగా కాజేయడం గ్రహించిన ప్రభుత్వం 1921లో గిరిజనుల ఆస్థులకు రక్షణకల్పించేందుకు, వడ్డీ రేటు అసలుకంటే ఎక్కువ ఉండకుండా నిరోధించేందుకు ఏజన్సీప్రాంతాలతో వడ్డీ, భూముల బదిలీ క్రమబద్ధం చేసే శాసనం రూపొందించింది.

కొన్ని తిరుగుబాట్లు

నైజాం తనకు ధారాదత్తం చేసిన కోస్తాలో రంపచోడవరంకు చెందిన కొన్ని గ్రామాలు బ్రిటిష్ వారు రామ్‌భూపతి అనే వ్యక్తికి అప్పగించగా అతడు ఆ ప్రాంతంలో మున్సబ్ దారుగా వ్యవహరిస్తూ కొంత శిస్తు విధించగా చెల్లించడానికి గిరిజనులు అంగీకరించారు. అప్పటివరకు ఏ శిస్తులేదు.

రామ్‌భూపతి అనంతరం అతని వారసుడు గిరిజనులకు చేసిన వాగ్దానాలన్నీ కాలరాచి, వారిని పీడించి శిస్తు వసూలు చేయడమే కాక వారిదైనందిన అలవాట్లలో జోక్యం కలుగ చేసుకొని వేధించి అనేక రకాల సుంకాలు వాళ్ళ నెత్తిన రుద్దాడు.

గిరిజనులు పాటిని చెల్లించలేకపోగా, రాజమండ్రి కోర్టులో

దావావేసి వారిస్థిర ఆస్తులను జప్తుచేయించి, అయిదు రూపాయల బాకీకి వందరూపాయలు విలువ చేసే గొఱ్ఱెలు ఇతర ఆస్తి ప్రభుత్వ సహాయంతో కొల్లకొట్టాడు.

అతని మీద, ప్రభుత్వం మీద గిరిజనులకు తిక్కలేచింది. రెచ్చి పోయిన గిరిజనులు చోడవరం సమీపంలో ఆరుగురు పోలీసువాళ్లను పట్టుకున్నారు. కొడిగండి దగ్గర మరొక హెడ్ కానిస్టేబుల్‌ను ఇంకొక కానిస్టేబుల్‌ను పట్టుకొని చెట్టుకు విరిచి కట్టేశారు. 200 మంది కోయలు గుంపుగూడి పట్టుబడిన వాళ్ల తలకాయలు దేవతలకు బలియిచ్చారు.

ఇది 1879 మార్చిలో జరిగిన సంఘటన. సుమారుఅదేసమయంలో విశాఖపట్టణజిల్లాలో కొన్ని ప్రాంతాలలో, భద్రాచలం సమీపాన కొన్ని ప్రాంతాలలో ప్రభుత్వం అకస్మాత్తుగాసిస్తు అధికంచేయడంతో అక్కడ తిరుగు బాటు చెలరేగింది. మద్రాస్ ప్రభుత్వం ఈ ఉద్యమం అణిచేందుకు హుటాహుటిని పెద్ద సంఖ్యలో సైనిక, పోలీసు పటాలాలు పంపించి, రక్తపు ఏరులు పారిన అనంతరం 1880 నవంబర్‌లో విప్లవాన్ని అణిచారు. ప్రభుత్వానికి ఎంతోఖర్చు. ఉభయ పక్షాలలో ఎన్నో ప్రాణాలుబలి అయిన తర్వాత గిరిజనులు కోరిన రాయితీ దొరికింది.

1915-16 లో విశాఖ, తూర్పుగోదావరి కొండ ప్రాంతాలలో సాయుధ విప్లవాన్ని ఎంతోవ్యయ ప్రయాసాలతో అణచి వేసిన అనంతరమే అక్కడి ప్రజానీకాన్ని గిరిజనేతర ప్రాంతాల దోపిడీ దారులు పోలీసులు న్యాయస్థుల సహాయంతో ఎలా పీడిస్తున్నదీ గహించగలిగింది. 1921 శాసనానికి దోహదమైన కారణాలతో ఈ

ఉద్యమంఒకటి. ఆశాసనం ద్వారా కొన్ని రక్షణలు గిరిజనులకు దొరికాయి.

1922-24 మధ్యకాలంలో మన్య ప్రాంతంలో జరిగిన సాయుధ విప్లవం మరుపురాని మరొక చరిత్రాత్మక సంఘటన. ఈ విప్లవానికి నాయకత్వం వహించే అమర వీరుడు సీతారామరాజు తన ఆత్మాహుతి చేసుకున్నాడు. సాటివారికి సహాయపడగలి గాడు. శాస్వితంగా తెలుగువారి స్మృతిలో తెల్లవారి గుండెల్లో సాటిలేని స్థానం పొందాడు.

కొండలు లోయలు సెలయేరుల మీదుగా ఆరణ్య ప్రాంతం లో నరస పట్నం నుంచి చింతపల్లి వరకు నిర్మించ తల పెట్టిన రోడ్డు పనికి, బలప్రయోగంతో గిరిజనులచే వెట్టి చాకిరి చేయించ డానికి అధికారులు ప్రయత్నించడం వల్ల మొదలైన తిరుగుబాటు తర్వాత సత్యనారాయణరాజు నాయకత్వాన స్వతంత్ర సంగ్రా మంగా మారింది.

గిరిజనుల జీవితాలలో వెలుగు ప్రసరించే ఇతర కార్య క్రమాలన్నింటిని వదిలి ఈ రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం పూను కొనడం స్థానికుల మేలు కొరకు జరగలేదు. పోలీసులు, అధి కారులు, దోపిడీదార్లు ప్రయాస లేకుండా ఒక మూల నుండి మరొక మూలకు ప్రయాణం చేసి తమ ఘాతుక చర్యలను నిర్విఘ్నంగా కొనసాగించు కొనేందుకు ఈ రోడ్డు ఆ నాడు తల పెట్టారు.

ఇటువంటి క్రిమినల్ మనస్థత్వంతోనే పోలీసుల రాక పోకలు సులభంగా జరిపేందుకే శ్రీకాకుళం కొండ ప్రాంతాలలో

కూడ మన ప్రభుత్వం ఇటీవల కొన్ని రోడ్ల నిర్మాణానికి పూను కొన్నది తప్ప అక్కడి ప్రజల శ్రేయస్సుకుకాదు.

పాలకులకు సింహస్వప్నమై, ముందు హెచ్చరికలు చేసి పోలీసు స్టేషన్లపై దాడి జరపడం ద్వారా బ్రిటిష్ సింహాసనాన్ని కదిలించిన ఈ ఉద్యమానికి ఆధ్వర్యం వహించి శ్రీ సీతారామ రాజు ఇతర నాయకుల మానవత్వవిలువలు సుహృదయతదాక్షిణ్యం గురించి నక్సలైట్స్ గురించి విన్నట్లె ఎన్నో కథలు విన్నాం.

పోలీసుల స్వాధీనం నుండి తప్పించుకొని పారిపోవడానికి చేసిన ప్రయత్నంలో కాల్పులకు గురై రాజు నేలకొరిగాడని అపుడు బ్రిటిష్ ప్రభుత్వం కూడ నేటి ప్రజాస్వామ్య ప్రభుత్వం వలెనే కట్టు కథ అల్లింది. అంటే ఇప్పుడు నక్సలైట్స్ పోలీసులతో సాయుధ, సంఘర్షణల గురించి మన పోలీసు అధికారులు, నాయకులు సృష్టిస్తూన్న కట్టు కథలు కూడ వారి ఒరిజినల్ థింకింగ్ ఐడియాస్ కావు బ్రిటిష్ వారి అనుకరణే.

1922-24 ఉద్యమాన్ని నిర్దాక్షిణ్యంగా అణచి వేయాలని అనాడు మద్రాస్ శాసన మండలిలో గంభీరోపన్యాసాలు చేసిన మన నాయకులే ఆ తర్వాత ఉద్యమ కారణాలపై విచారణ జరపాలని కోరారు.

ఈ విప్లవం విప్లవకారుల త్యాగాలు వృధా కాలేదు. బ్రిటిష్ వ్యతిరేక పోరాట జ్వాలలకు ఈ ఉద్యమం ఆర్ఘ్యం పోసింది. గిరిజనుల దయనీయ స్థితిని, వెట్టి చాకిరికి అధికారులు వారిపై సాగిస్తున్న జులుంను వెలెత్తి చూపింది.

అయితే పై ఉద్యమాలకు నక్సలైట్ పోరాటానికి సంబంధం లేదు. గత్యంతరంలేని పరిస్థితులలో ఆవేశం ఆగ్రహంతో

గతంలో గిరిజనులు చేసిన తిరుగుబాటు వంటిదికాదిది. నక్సలైట్ పోరాటం రాజకీయ పోరాటం.

సాయుధ పోరాటానికి దిగాలా వద్దా అన్న అంశంపై మొదట క్షుణ్ణంగా చర్చ జరిగింది. విప్లవ పోరాటానికి విస్తృతంగా ప్రజల అండ దొరకదనే వాదన వచ్చింది.

సాయుధ పోరాటానికి ప్రోదిచేసిన కారణాలలో వాదనకు బలం ఉన్నా సరియైన పరిస్థితి ఏర్పడేవరకు వేచియుండక, బలాన్ని సమీకరించుకొనకుండా, ప్రజలలో అధిక సంఖ్యాకులను తమవెంట తీసుకు వెళ్లే ప్రయత్నం చేయకుండా కమ్యూనిస్టు తీవ్ర వాదులు తొందరపాటుతో ఆయుధాలు పట్టుకున్నారు. పెకింగ్ సృతులకు, ఇక్కడ గానం చేసే ప్రయత్నం వారు చేశారు.

ఇతర కారణాలతోపాటు 1949-50 మధ్యకాలంలో విశాఖ పాపికొండలు, తూర్పు గోదావరి మధ్య ప్రాంతం గిరిజనులలో బయలుదేరిన అసంతృప్తి, ప్రభుత్వం గిరిజనులను సంతృప్తి పరి చేందుకు కొన్ని చర్యలు గైకొనడానికి దోహదమైంది.

గిరిజనుల సాధకబాధకాలు విచారించి వాటి నివారణకు గైకొనవలసిన చర్యలను సూచించేందుకు, వ్యవసాయ, అటవి. ఆర్థిక మొదలైన రంగాలకు చెందిన ప్రముఖులతో నాటి మద్రాస్ ప్రభుత్వంలో ఉన్నతాధికారి శ్రీ మలయప్పన్ అధ్యక్షతన ఒక సంఘాన్ని నియమించింది. 1951లో ఈ సంఘం సమర్పించిన నివేదిక పరిశీలనకు ప్రభుత్వం చాలాకాలము పనిచేసింది.

ఎట్టకేలకు, ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన అనంతరం ఈ కమిటీ నివేదికలో కొన్ని సూచనల అమలుకు ప్రయత్నాలు జరిగాయి.

పరసమైన ధరలకు అటవీ సంపదలను గిరిజనుల నుండి

కొనుగోలు చేసి, నిత్యావసర వస్తువులను వారికి అందించే ఏర్పాట్లకు సంబంధించినది ఈ సూచన.

భద్రగిరివద్ద ఒకటి దోనూరు దగ్గర మరొకటి సహకార సంఘాలు స్థాపించి, కొన్ని నిత్యావసరసరుకుల క్రయవిక్రయ కేంద్రాలు కూడ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. క్రమంగా వాటి సంఖ్య పెరిగినా, ఈ సంఘాలలో జరుగుతున్న ధన అపహరణ, దుర్వినియోగం, వ్యక్తుల అసమర్థత చూస్తుంటే ఇవి తమ ధ్యేయాన్నిసాధించలేకపోయాయనివిదితమవుతుంది. క్రయవిక్రయ కేంద్రాలలో గిరిజనులు తెచ్చే అటవీ ఉత్పత్తులకు గిట్టుబాటు ధరచెల్లించడం జరగలేదని 1975లో ప్రభుత్వమే అంగీకరించింది. అయితే గిట్టుబాటుధర చెల్లించే ప్రయత్నం చేస్తున్నట్టుకూడ ప్రభుత్వం స్పష్టంచేసింది. ఎక్కడ వేసిన గొంగడి అక్కడే కదా మన ప్రభుత్వ పద్ధతి.

ఏజన్సీ ప్రాంతంలో దారుణ పరిస్థితిని 1966లో ప్రణాళికా సంఘ అధ్యయన బృందం కూడ తన నివేదికలో స్పష్టంగా వివరించింది. శాసనాలు అమలు జరగని వాస్తవాన్ని కూడ ఈ నివేదిక వెల్లడి చేసింది. అంటే నాటికి 26 మంది వ్యవసాయ కూలీలుగా బ్రతుకుతున్న శ్రీకాకుళం జనాభాలో గిరిజనుల సంఖ్య రెండు లక్షలు. గిరిజనులలో అధిక సంఖ్యాకులు చింతపండు విత్తులు తీసి పొడిచేసుకొని గంజి కాచుకొని వ్రాగి జీవితం గడుపుతూ, కొందరు మాత్రం రాగులు జొన్నల గటకతో జీవిస్తారు. అయితే అందరికీ మొదుగ పూవులతో స్థానికంగా తయారు చేసుకున్న 'సారా' వ్రాగే అలవాటు ఉంది. వేకువజాము నుండి

సాయంత్రం ప్రొద్దుపోయేదాకా కష్టపడి, సారాత్రాగి విశ్రాంతి తీసుకుంటారు వారు.

నీతికి నిజాయితీకి మారుపేరైన గిరిజనులలో కృతజ్ఞతా భావం కూడ అధికంగా ఉన్నది. నక్కజిత్తుల వ్యాపారులు ఎవరైనా వారిని మచ్చిక చేసుకొనేందుకు ఒక బీడీ లేకుంటే కొంచెం బెల్లం చేతులోవేసి మంచిగా మాట్లాడితే, ఆగిరిజనుడు తనకృతజ్ఞత తెలిపినందుకు మర్నాడే ఒక పెద్ద అరటి గెల, టేకు ఆకులు తీసుకవెళ్లి బహుమతిగా యివ్వడం జరుగుతుంది.

బహుమతిగా తీసుకవెళ్లుతున్న అరటిపండ్లకు ఎంత ధర ఇవ్వగలమన్నా, వారు అమ్మకం చేయరు. మణుగు చింతపండుకు కిలో ఉప్పు లేకుంటే పావుకిలో రాగులు ఇచ్చే వ్యాపారులు కల్లబొల్లి కబుర్లతో చేసే మోసాలలో ఇదొకటి.

దేశానికి స్వాతంత్ర్యం లభించినా, వారికి దాని ప్రభావం తెలిసిందికాదు. ప్రభుత్వం అనేది వారికి కనుపించడం కేవలం లంచగొండి అటవీశాఖ అధికారులలోనే, వంట చెరుకుకు అడవికి వెళ్లిన గిరిజనుల నుండి కూడ అటవీశాఖ ఉద్యోగులు లంచం పుచ్చుకోకూండా ఉండరు.

స్వార్థపరులైన లంచగొండి అధికారులవల్ల గిరిజన ఆర్థికాభివృద్ధి సంస్థవల్లగానీ, దానిక్రింద పనిచేసే చౌకధరల డిపోలవల్ల కానీ గిరిజను లెవరికీ ప్రయోజనం దొరకలేదు.

అమ్మకం కొనుగోలు దుకాణాలు కాయితాలపైననే నిర్వహించిన అధికారులు గిరిజనులు తెచ్చే సరుకులు వ్యాపారులు నామమాత్రంధరకు కొనేందుకుతోడ్పడి, గిరిజనులకు చక్రవడ్డిలకు తాముయివ్వవలసిన సరుకులను గిరిజనేతర ప్రాంతాలలో అమ్ము

కోవడం అలవాటు చేసుకొన్నారు.

1970లో నేను శ్రీకాకుళం జిల్లాలో పర్యటించినప్పుడు అప్పటికి కొంతకాలం క్రితమే గిరిజన ఆర్థికాభివృద్ధి సంస్థ జనరల్ మేనేజర్‌గా నియుక్తులైన యువ ఐ. ఎ. యస్. అధికారి శ్రీ చంద్ర మౌళి, ఈ సంస్థను క్షాళనం చేసే కార్యక్రమంలో నిమగ్నులై ఉన్నారు.

అవినీతిపరులు లంచగొండివారైన అనేకమంది ఉద్యోగు లను తొలగించి, కొందరినుండి వారు కైంకర్యముచేసిన డబ్బును వసూలుచేసి, గిరిజనుల సరుకులు కొనుగోలు విషయంలో, వారికి సరుకులు చౌక ధరకు అందించేందుకు అయనశ్రద్ధ తీసుకుంటు న్నారు.

శ్రీ చంద్రమౌళి, నాటి జిల్లా కలెక్టర్ యుగంధర్ రాత్రిం బవళ్లు మారుమూల ప్రాంతాలలో పర్యటించి, గిరిజనుల కొరకు ఉద్దేసించిన నిత్యావసర సరుకులు వారికి అందేందుకు చర్యలు గైకొన్నారు. వీరి కృషిని నక్సలైట్స్ కూడ అభినందించారు. ఎంత కాలం ఆ అధికారులు బదిలీ కాకుండా ఉంటారు. మళ్లా పాత పాటే.

దేశానికి స్వాతంత్ర్యం లభించిన ఇరవైఏళ్ల అనంతరం కూడ విద్యావిధానంలోకానీ, పాలనా విధానంలొకానీ, న్యాయ విధానంలోకానీ-మరే విధానంలోకానీ ప్రభుత్వం మార్పులు తేలేక పోయింది.

అప్పటికి మూడు పంచవర్ష ప్రణాళికలు అమలు జరిగినా పొట్టపోసుకొనేందుకు పనిదొరకక, వెనుతిరిగి ఖర్చుచేసినడబ్బును

వృధాచేసిన సమయాన్ని గుర్తుతెచ్చుకొని ఎంతమంది ఇంజనీర్లు సైంటిస్ట్‌లు గుండెపగిలి చావలేదు ?

బాకీల బాధ భరించలేక ఆకలికి తట్టుకోలేక కుటుంబ సభ్యులంతా ఒక ఉమ్మడిగా విషంత్రాగి ఈ పాపిష్టి ప్రపంచానికి దూరమైన సంఘటనలు మన రాష్ట్రంలో ఎన్నిలేవు.

లంచం ఇచ్చి ఉద్యోగం సంపాయించిన డాక్టర్ డబ్బులేని వాడికి వైద్యం చేస్తున్నాడా ? పేదల పొలాలు ఆస్తులు అన్యాక్రాంతం చేసుకొని పోలీసునుకొని జేబులో పెట్టుకొని, పీడితులను భూస్వాములు కోర్టుల చుట్టూ తిప్పుతుంటే డబ్బులేని వాడికి న్యాయం జరిగేట్టు న్యాయ వ్యవస్థను మార్చేందుకు ప్రభుత్వం ఏమిచేసింది.

మధ్య రకం రైతులు చిన్న రైతులై చిన్న రైతులు వ్యవసాయ కూలీలుగా మారుతుంటే, మధ్య తరగతి ప్రజలే తమ దైనందిన అవసారాలను తీర్చుకోలేక మల మల మాడుతుంటే మన కళ్ళ ముందే మరోవైపు ఎంత మంది భూస్వాములు తమ ఊహకు అందకుండ పెంచుకోలేదు?

నిన్నకాక మొన్న సైకిల్ పై తిరిగిన, కిరాయి గుడిసెలలో గడిపిన ఎంత మంది అధికారులు ఈనాడు కుటుంబ సభ్యులందరికి కార్లు కొని మిద్దెలపై మిద్దెలు కట్టడం మనకు తెలియనిచా?

ఇరవైనాలుగు గంటలు రాళ్లు కొట్టి కుటుంబ సభ్యులంతా కాయకష్టం చేసినా కొన్ని కుటుంబాలకు ఒక వైపు పొట్టి గడవడం కష్టంగాఉంటే, కాఫీ హోటల్లో బట్లర్‌గా పనిచేసినవాడు, కిళ్లి కొట్టు పెట్టు కొన్నవాడు కేవలం ముఖ్యమంత్రిని, మంత్రులను ఆశ్రయించి కోటీశ్వరులైన సంఘటనలు ఎన్నిలేవు.

భూసంస్కరణల గురించి 50 సంవత్సరాలుగా పాటలు

పాడుతూ, సమ సమాజాన్ని నిర్మిస్తామని పాతికేండ్ల నుండి నినాదాలు వల్లిస్తూ ప్రభుత్వాలు సాధించిందేమిటి ?

పదవిలో చేరినపుడు బికారి అయినా పదవి పోయిన అనంతరం కారులో నుండి కాలు బయట పెట్టలేని స్థితికి చేరిన నాయకులు ఎంత మందిలేరు?

- లక్షల టన్నుల ధాన్యం ప్రభుత్వ గోదాములలో మురిగి పోతుంటే ఆకలి చావులు లేకుండా గడ్వని రోజులేక పోవడానికి కారణమెవరు?

అది కార్మికులు కానీయండి, కర్షకులు కానీయండి, విద్యార్థులు కానీయండి, ఉద్యోగులు కానీయండి సమైక్యంగా సంఘటితంగా తమ కోర్కెలను సాధించుకొనే, ఇబ్బందులు తొలగించుకొనే ఏ వర్గమైనా కానీయండి, శాంతియుత పద్ధతులలో చర్చలు సంప్రదింపులద్వారా ముందు ఉద్యమాలు నిర్వహించకుండా తమ కోర్కె సాధించుకున్న సంఘటనలు మన ప్రజా తంత్ర భారత దేశంలో ఎన్ని ఉన్నాయి.

పైవారిలా సంఘటితంకాజాలని సంఘటితమయే అవకాశం శక్తిలేని వివిధ వర్గాల పీడిత ప్రజల గతేమిటి?

ఇవన్నీ ఆలోచించిన కొందరు మేధావులు, ప్రత్యేకించి ఉన్నత విద్యావంతులై కూడ ఉద్రేకపరులైన కొందరు యువకులు విసిగి వేసారి ఈ సమాజం ఎలా మారుతుందా అని మధనపడుతున్న సమయంలో, మావో సిద్ధాంతవాదుల సాయుధ పోరాటం పిలుపు వచ్చింది. ఈ సాయుధ పోరాటం పాలకులకు కనువిప్పు కలిగించలేదని, సాయుధ పోరాట పద్ధతిని వ్యతిరేకిం

చినా, ఇంగిత జ్ఞానం ఉన్నవాడెవడూ అనలేడు.

దేశం మొత్తం పై ఈ ఉద్యమ ప్రభావం వివరాలు ఏ కరువు పెట్టెందుకు ఇక్కడ అవకాశం లేదు కనుక కేవలం ఆంధ్ర ప్రదేశ్ ప్రత్యేకించి శ్రీకాకుళం ప్రాంతానికి సంబంధించిన వివరాలే ఇక్కడ పొందుపరుస్తాను.

దేశంలొని నాలుగు కోట్లు గిరిజన జనాభాలో మన రాష్ట్రంలొని ఎనిమిది- శ్రీకాకుళం, విశాఖ పట్టణం, వశ్చిమ గోదావరి, తూర్పుగోదావరి, ఖమ్మం, వరంగల్, మహబూబ్ నగర్, ఆదిలాబాద్ జిల్లాలో సుమారు 4500 గామాలలో, 7,40,000 గిరిజనులే కాక మొత్తం రాష్ట్రంలో 16 లక్షల మంది ఆదిమజాతి వారు జీవిస్తున్నారు.

ఆదిమ జాతులలో 36 తెగలు ఉన్నా వారిలో అధిక సంఖ్యాకులైన తెగలు ఆరు మాత్రమే. శ్రీకాకుళం జిల్లాలో ముఖ్య తెగల సవరులు, జాతువులు, గిరిజనులు సాధారణంగా కష్టించి పని చేస్తారు, అబద్ధం చెప్పరు. ఎవరైన అసత్యం చెబితే వెలి వేస్తారు.

ఈ జిల్లాలలో రాక్షసి బొగ్గు, సిరెమిక్, సిమెంటు రాయి వంటి విలువైన ఖనిజ సంపదలు సంవృద్ధిగా ఉన్న ప్పటికి, వాటి వలన ఆ ప్రాంతం గిరిజనులకు ఏ ప్రయోజనం జరగలేదు.

బొగ్గు గనులలో కూడ వారి ప్రయోజనానికి ప్రత్యేక కార్యక్రమాలేవీ ఎవరూ ఆలొచించలేదు.

అటవి ప్రాంతాలలొనే గిరిజనులు నివసిస్తున్నారు. కలప మొదలైన అటవి ఉత్పత్తుల ఆధార పరిశ్రమలు అక్కడ నెల

కొనినా వాటిలో గిరిజనులకు ప్రత్యేక సదుపాయాలు కానీ, యాజమాన్యంతో భాగస్వామ్యం కాని లేదు.

గిరిజనులలో అధిక సంఖ్యాకులు వ్యవసాయంపై జీవించినా కొందరు ఆటవి సంపద చింత పండు, కుంకుళ్ళు మొదలైనవి సేకరించి అమ్ముకొని జీవిస్తారు. వ్యవసాయక పోలాలు చిన్నవవడం వల్ల అవి లాభసాటి కావు. ఉదాహరణకు శ్రీకాకుళం జిల్లాలో హెక్టార్- అంతకు తక్కువ భూమి గల కుటుంబ కమతాలు 18 వేలు కాగా, ఎకరా రెండకరాల మధ్య కమతాలు 6,600, రెండు మూడు మధ్య కమతాల సంఖ్య 2600 అయితే మూడు నాలుగెకరాల కమతాల వారి సంఖ్య 1240 మాత్రమే.

ఇందుకు భిన్నంగా నైజాం ప్రభువు కొరివితో తలగోకు కొనదలచక 1940-48 ప్రాంతంలో అటవి భూములు కేటాయించడం వల్ల ఆదిలాబాద్ గోండ్ జాతివారిలో పెద్ద కమతాల వారు ఎక్కువ మంది ఉన్నారు. హెక్టారు అంతకు తక్కువ కమతం వారు ఆదిలాబాద్ జిల్లాలో 429 కాగా నాలుగు అంతకు ఎక్కువ హెక్టార్ల భూకమతాల సంఖ్య - ఆ జిల్లాలో 3528.

లాభసాటి కాని వ్యవసాయంతో సతమతమై ఋణ గ్రస్తులవడం వల్ల శ్రీకాకుళం, విశాఖ తూర్పు గోదావరి జిల్లాల్లో గిరిజనులకు చెందిన వేల ఎకరాల భూమి గిరిజనేతరులు అన్యాక్రాంతం చేసుకొన్న సంఘటనలు 1975నాటికి 117028 వెలుగు లోనికి వచ్చాయి.

ఏజన్సీప్రాంతంలో వ్యవసాయ భూములు మెట్ట ప్రాంతాల వారు భుట్టలో వేసుకోవడాన్ని నిరోధించే శాసనాలు ఉన్నా, 1969-70 సంవత్సరం నాటికి. వ్యవసాయయోగ్య భూమిలో నూటికి 80 వంతులు అన్యాక్రాంతమైపోయింది.

మిగతా 20 శాతం భూమిలో కూడ అధికభాగం తాకట్టులలో ఉన్నదే.

సాయుధపోరాటంలో గిరిజనులు పాల్గొనడం ఒక రొగలక్షణం వంటిది. రోగానికిమూలకారణాలు తొలగించేందుకు చికిత్సమొదలు పెట్టకుండా కేవలంరోగలక్షణాలు అదుపుచేయడం వల్ల ప్రయోజనంలేదని నాటి జిల్లా కలెక్టర్ యుగంధర్ గుర్తించారు.

ఈయువఅధికారి చాలాఉత్సాహవంతుడు పట్టుదలకలవాడే కాక, పేదలపట్ల దయాభావం సానుభూతి కలవాడు.

1917లో రేగ్యులేషన్‌చట్టం రూపొందినప్పటి నుండి జరిగిన అన్యాక్రాంతాల లెక్కలుతీయాలంటే,త్వరితగతిని న్యాయంజరగదని గ్రహించి, అంతకుముందు కేవలం పది సంవత్సరాలు (1959-69) మధ్య కాలంలో జరిగిన అన్యాక్రాంతాల వివరాలు వేగంగా వెలుపలికిలాగారు. ఈకాలంలో సుమారు 15 వేల ఎకరాలు అన్యాక్రాంతంజరిగినట్టుతెలియగా, కనీసం 5000 ఎకరాలు స్వంత దారులకు అప్పగించడం ఆ సంవత్సరం ధ్యేయంగా పెట్టుకొన్నారు శ్రీ యుగంధర్.

రానున్నలిటిగేషన్స్ ఇతర అవరోధాలన్నీ అతనికి తెలుసు కనుకనే, తనశక్తినీ, అధికారాన్ని, యంత్రాంగాన్ని పూర్తిగా వినియోగించి కనీసం అయిదువేల ఎకరాల నుండి దురాక్రమణ దారులను తొలగించగలనని ఆయన నమ్మారు. తీరా ఫలితాలు

అనుభవంలోకి వస్తుంటే, అయన నమ్మకం వమ్మయిపోయింది. ప్రభుత్వయంత్రాంగంలోను రాజకీయ స్థాయిలోను ఏర్పడ్డ అవరోధాలు అధిగమిస్తూ ముందుకువెళ్ళి 250 ఎకరాల భూమి నుండి అన్యాక్రాంతదారులను తొలగించే సరికి 350 రిట్‌పిటిషన్‌లు హైకోర్టులో పడ్డాయి. గిరిజనుల దోపిడీ ఎలా జరిగింది ఎలా అవిచ్ఛిన్నంగా కొనసాగుతున్నది పేర్కొనేందుకు ఈ ఒక్క ఉదాహరణ చాలనుకుంటా.

రాష్ట్రంలో అక్షరాస్యులు శాతం 21-2కాగా గిరిజనప్రాంతాలలో ఈసంఖ్య 4-41శాతం మాత్రమే ఇంతటి పెద్ద తేడానుతగ్గించాలని అంచనాలు వేయగా 7-81 కోట్ల రూపాయలు అయిదవ ప్రణాళికలో ఖర్చుచేస్తే తేడాను 3 శాతానికి తగ్గించవచ్చునని తేలింది. అయితే ఉప ప్రణాళికలో కోటి మూడు లక్షలు కేటాయించారు. ఇది గుడ్డి కంటే మెల్ల కన్నునయమని భావించేలా ఉన్నది. తిరుపతిలో గిరిజన బాలభట శిబిరంలో నిర్వహించిన వివిధ పోటీలలో గిరిజన బాలురు అయిదు ఉత్తమ బహుమతులు గెలుచుకోవడం దృష్టిలో పెట్టుకొని ఆలోచిస్తే విద్యా సౌకర్యాలు కల్పిస్తే మేధాశక్తిలో గిరిజనులు ఎవరికీ తీసిపోరని అర్థమవుతుంది.

1972-79 మధ్య కాలంలో 116 పదహారు గిరిజన గ్రామాలకు 4-12 కోట్ల వ్యయంతో విద్యుచ్ఛక్తి సౌకర్యం కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్రంలో 34.7 శాతం గ్రామాలకు విద్యుచ్ఛక్తి ఉండగా గిరిజన ప్రాంతాలలో 2.9 శాతం గ్రామాలకే విద్యుచ్ఛక్తి ఉన్నట్లుగతి ప్రభుత్వం ఎట్టకేలకు గుర్తించింది.

వైద్యసౌకర్యాల విషయంలో కూడ రాష్ట్రంలో గిరిజన

ప్రాంతాలు నిర్లక్ష్యానికి గురి అయాయి.

రాష్ట్రంలో మొత్తం వ్యవసాయ యోగ్యభూమిలో 30.2 శాతం భూమి నీటి పారుదల సౌకర్యం కలిగిఉండగా, గిరిజన ప్రాంతాలలో 4.6 శాతం భూమికి నీటి పారుదల సౌకర్యం ఉన్నది. అది కూడ 1970 లొ తలపెట్టిన ప్రత్యేక కార్యక్రమం ప్రకారం 3000 ఎకరాలకు నీటి పారుదల సౌకర్యం కల్పించడం వల్లనే, అంటే, నూటికి 94.6 వంతుల భూమి వానదేవుని దయపై ఆధారపడాలి. అయిదవ ప్రణాళికలో మరికొంత భూమికి నీటి పారుదల సౌకర్యం కల్పించి, ఈ సౌకర్యం ఉన్న భూమి శాతం 17.9 శాతము పెంచాలని ప్రభుత్వ భావన.

పూర్వ రంగం ఇలా ఉండగా, సాయుధ పోరాటంలోనే ప్రభుత్వానికి ప్రజా ప్రభుత్వాలకు కనువిప్పు కలిగింది. 1969 వరకు నడచిన 18 సంవత్సరాలలో గిరిజన ప్రాంతాలపై సగటు తలసరి పెట్టుబడి కాగా దాదాపు అంతకు సమాన మొత్తం — ఆ తర్వాత అయిదేళ్లలో పెట్టారు.

గిరిజన ప్రాంతాల సాంఘిక ఆర్థికాభివృద్ధికి మొదటి మూడు ప్రణాళికల పెట్టుబడి మొత్తం రూ 621.51 లక్షలు కాగా కేవలం 1969-64 మధ్య పెట్టుబడి 734.03 లక్షలు ! !

1969 కి పూర్వం గిరిజన ప్రాంతాలలో ప్రతి వెయ్యి చదరపు మైళ్లకు 6-7 మైళ్ల రోడ్డు ఉండగా రాష్ట్రంలో ప్రతి వెయ్యి చదరపు మైళ్లకు 38 మైళ్లు ఉన్నది. అందువలన ఇతర ప్రాంతాలు గిరిజన ప్రాంతాల మధ్య వ్యత్యాసం తొలిగించేందుకు గిరిజన ప్రాంతాలలో 3600 మైళ్ల పొడవు రోడ్డు నిర్మాణం జరుగుతున్నది.

గిరిజనులు సాయుధ పోరాటంలో దిగడానికి ముఖ్య కారణాలలో ఒకటి వడ్డి వ్యాపారుల బెడద. ఖాళీ ప్రోనోటుపై సంతకంతీసుకొని, పది రూపాయలు అప్పుపెట్టి ఏడు వందలు వ్రాసుకొని అప్పు పుచ్చుకొన్న వాడిని జీవితాంతం బానిసలు చేసుకోవడం రెండు మూడు తరాల వరకు తీకుంటే ఆస్తి ఉన్నవాడైతే వాడి ఆస్తి పూర్తిగా కాజేసే వరకు రుణం రుణంగానే కొనసాగించడం వడ్డి వ్యాపార్తుల లక్షణం. అక్రమ వడ్డి వ్యాపారానికి సంబంధించిన కేసుల పరిశీలనలో 2204 కేసులు వెలుగు లోనికిరాగా, వాటిలో 2026 కేసులను న్యాయస్థానాలకు తీసుకొని వెళ్లడం 1337 కేసులలో గిరిజనులు రుణ విముక్తులు కావడం జరిగింది.

గిరిజన ప్రాంతాలలో ప్రతి లక్ష జనాభాకు 14 ఆస్పత్రి పడకలు, ప్రతి 33,333 మంది జనాభాకు ఒక వైద్యుడు కాగా రాష్ట్రంలో ఇతర ప్రాంతాలలోకూడ ప్రతి లక్ష జనాభాకు 66 ఆస్పత్రి పడకలు, ప్రతి 12450 మందికి ఒక వైద్యుడు ఉన్నారు. వైద్య సౌకర్యాల విషయంలో గిరిజనులను నిర్లక్ష్యం చేయడానికి ప్రభుత్వం చూపిన కారణం "రవాణా సౌకర్యాల కొరత, సహజ సిద్ధమైన ఇతర అవరోధాలు" అయితే అయిదవ ప్రణాళిక కాలంలో వైద్య సౌకర్యాల విస్తరణకు గిరిజన ప్రాంతాలలో 154.70 లక్షల ఖర్చు చేయాలని మొదట నిర్ణయించారు. కాని ప్రణాళిక పెట్టుబడి ఆ తర్వాత తగ్గినదన్న సాకుతో ఈ పెట్టుబడిని 36 లక్షలకు కుదించారు. ఇది కూడ గుడ్డికన్ను కంటె మెల్లకన్ను నయమన్న సామెత దృష్టిలో పెట్టుకొనే గిరిజనలు సంతృప్తి పడ

వలసి యుంటుంది.

గిరిజనుల తలసరి సగటు ఆదాయం (1975) పరిశీలించినా వారి దైన్యస్థితి తెలుస్తుంది. రాష్ట్ర తలసరి సగటు ఆదాయం 549.29కాగా ఏజెన్సీ ప్రాంతాల ప్రజల తలసరి సగటు ఆదాయం 203.32 మాత్రమే.

గిరిజనేతర ప్రాంతాలలో కాజేసిన భూములను గిరిజనులకు తిరిగి దాఖలుపరిచేందుకు, వడ్డివ్యాపారుల కదంబహస్తాల నుండి గిరిజనులను బయటకు లాగేందుకు, ఆ ప్రాంతాలలో వ్యవసాయ తదనుబంధ రంగాల అభివృద్ధికీ, అక్రమ లాభాలు పొందే వ్యాపారులనుండి గిరిజనులకు రక్షణ కల్పించేందుకు, 1969 ఉద్యమం ఫలితంగానే ప్రభుత్వం కొన్ని చర్యలు గైకొని, కొన్ని శాసనాలు, ఉన్న శాసనాలకు సవరణలను చేసింది.

మన పాలనాయంత్రాంగం, పోలీసు యంత్రాంగం, న్యాయ వ్యవస్థ తీరు తెలిసిన వారు ఈశాసనాలు ఎంత సమర్థవంతంగా అమలు జరుగుతున్నాయో అర్థం చేసుకో గలుగుతారు.

తిరుగు బాట్లు జరిగినప్పుడే, గిరిజనులు దోపిడికి గురి అవుతున్నారని గుర్తించి కొన్నిచర్యలు గైకొనినామళ్ళీవారిని మరచి పోవడం ప్రభుత్వానికి అలవాటనే సంగతి సైన ఉదహరించిన భోగట్టా వల్ల బోధపడుతుంది.

పెద్ద సంఖ్యలో పోలీసులనుపంపి నిర్దాక్షిణ్యంగా క్రూరంగా అణచి వేతకు పూనుకోవడం వల్లనే తిరుగుబాటు ఆగిపోదు. గిరిజనులను తీవ్రవాదుల ప్రభావం నుండి బయట పడేసేందుకు వారి ఇబ్బందులు కూడ తీర్చి వారి సంక్షేమానికి ప్రయత్నించాలి

అని అనేక మార్లు ప్రభుత్వం పెరొక్కన్నది.

వివిధ రంగాలలో అభివృద్ధికి కేటాయింపులు అధికం చేసిన ప్రతిసంగర్భంలోను నక్సలైట్ ఉద్యమం ప్రస్తావన తేకుండా ఉండ లేక పోయింది ప్రభుత్వం.

విప్లవాలు విజయం సాధించకున్నా అవి కొంత వరకైనా లక్ష్యాన్ని సాధించగలిగాయి.

(-o-)

సాయుధ పోరాటం

శ్రీకాకుళం జిల్లాలో రాష్ట్రంలోని మరి కొన్ని ప్రాంతాలలో అనేక దారుణ కృత్యాలకు దారితీసి, చివరకు వందలాది యువ మేధావుల, అమాయకపు కొండజాతుల గుండెల నుండి ప్రవహించిన వేడి రక్తపు మడుగులలో మరుగునపడిన సాయుధ పోరాటం ప్రభుత్వం ప్రచారంచేస్తున్నట్టుగా మొదట "తుపాకీ గొట్టం ద్వారా అధికారాన్ని హస్తగతం చేసుకోవడంకొరకే" ప్రారంభం కాలేదు.

మెట్ట ప్రాంతాల పెత్తందారులు కొండలమధ్యకెళ్లి అక్కడ పేద ప్రజల అమాయకత్వాన్నే పెట్టుబడిగా మార్చుకొని నిలువు దోపిడి కొనసాగించకుండా పాలకులు సకాలంలో నిరోధించగలిగితే సౌమ్యులు విశ్వాసపాత్రులని పేరుపొందిన అమాయక ఆటవికులు పాశవికులుగా, క్రూరులుగా, విప్లవశూరులుగా మారేవారేకాదు.

పాడినదే పాడిన పాచిపండ్ల దాసరివలె శుష్కప్రియాలు చెప్పి శూన్యహస్తాలు చూపిన పాలకులు సకాలంలో బంజరు భూములనుపంచి, భూసంస్కరణలు అమలుజరిపితే నల్లగొండ, ఖమ్మం, వరంగల్ జిల్లాలలో రైతు కూలీలు తీవ్రవాదంవైపు మొగ్గుచూపేవారేకాదు.

అలాగే దేశంలొని ఇతర ప్రాంతాలలో కూడ రైతుకూలీలు రెచ్చిపోవడానికీ, ఆయుధాలు పట్టటానికి అంగీకరించడానికీ దోహదంచేసి ప్రోత్సహించిన కారణాలను కాంగ్రెస్ పాలకులు సకాలంలో సరిదిద్దితే, వేల ప్రాణాలు బలిఅయేవికావు. ప్రభు

త్వం పోలీసులు ముందుగుండు సామాగ్రిపై కోట్ల రూపాయలు ఖర్చుపెట్టవలసి వచ్చేదేకాదు. 1959–67 ప్రాంతంలో శ్రీకాకుళంలో పెక్కుచోట్ల గిరిజనుల వ్యవసాయ కూలీ సంఘాలు కట్టుదిట్టంగా ఏర్పడ్డాయి. ఈ సంఘాల సమావేశాలు ఎప్పుడూ సాయుధ విప్లవం తేవాలని నిర్ణయించలేదు.

తమను అన్యాయంచేసి దోచుకుంటున్న భూస్వాములను' వ్యాపారులను, వడ్డి వ్యాపారులను సంఘటిత శక్తితో ప్రతిఘటించి, తమ హక్కులను సాధించుకోవడమే ఈ సంఘాలు ధ్యేయంగా పెట్టుకున్నాయి.

మొదట కమ్యూనిస్టు పార్టీ నేతృత్వంలో ఉన్నప్పుడు, తర్వాత మార్క్సిస్ట్‌పార్టిలోఉన్న మొదటి సంవత్సరాలలో కూడ అటు శ్రీకాకుళంలో, వెంపటి సత్యనారాయణ, పంచాది కృష్ణమూర్తి, నాగభూషణం, పట్నాయక్, చౌదరి తేజేశ్వరరావు ప్రభృతులు కానీ, ఇటు తరిమెల నాగిరెడ్డి, దేవులపల్లి వెంకటేశ్వరరావు, చంద్ర పుల్లారెడ్డి, రామనర్సయ్య ప్రభృతులు కానీ రైతు కూలీ ఉద్యమాలు నిర్వహించింది "తుపాకిగొట్టం నుండి అధికారం హస్తగతం చేసుకునేందుకు" కాదు. భూస్వాములు ఇతర దోపిడీదారులను ప్రతిఘటించేందుకే వారు ఉద్యమాలు నిర్మించి కొంతవరకు కృతకృత్యులయ్యారు. ఈ ఉద్యమాల ఫలితాలు వారికి సంతృప్తి కలిగించలేదు. ఉద్యమాల అణచివేతకు, న్యాయమైన ఉద్యమాల కాలరాతకు జరిగిన ప్రయత్నాలు వారిని రెచ్చగొట్టాయి. తీవ్రవాదంవైపు మరలించాయి.

పశ్చిమబెంగాల్, కేరళ, ఒరిస్సా తదితర రాష్ట్రాలలో తర్వాత తీవ్రవాదులైనవారు కూడ మొదట వ్యవసాయ కూలీ

ఉద్యమాలు నిర్మించినవారే కమ్యూనిస్టు మార్క్సిస్టు పార్టీలో భాగస్వాములైన వారంచరూ తీవ్రవాదంవైపు మొగ్గు చూపుతున్న సమయాన, పెకింగ్ కమ్యూనిస్టుపార్టీలో పైచేయిగా ఉన్న కొందరు అవాస్తవిక సిద్ధాంత కర్తలు ప్రభోదించిన తప్పుడు సిద్ధాంతాలు కూడా వారిని ప్రభావితం చేశాయి. సాయుధ విప్లవ సిద్ధాంతం ఆనాడు భారతదేశంలోఉన్న పరిస్థితులకు అన్వయించే వీలులేదని, మార్క్సిస్టుపార్టి ఖచ్చితమైన వైఖరిని అవలంభించింది.

అందువల్ల మార్క్సిస్టుపార్టితో పొత్తు కుదరక తీవ్రవాదం వైపు మొగ్గుచూపే వారంతా విడిపోయారు లేక వెలివేయబడ్డారు.

ఖమ్మం, వరంగల్ మొదలైన జిల్లాలలో తీవ్రవాదులు నిర్వహించిన పోరాటం కానీ, శ్రీకాకుళం జిల్లాలో సాయుధ పోరాటాన్ని కానీ, బెంగాల్ తీవ్రవాదులు సిలుగురి సబ్‌డివిజన్‌లో జరిపిన పోరాటంతో పోల్చటానికి వీలులేదు. అయినప్పటికీ డార్జిలింగ్ జిల్లా నక్సల్‌బరీ ప్రాంతంలో సాయుధ పోరాటం మొదలుపెట్టిన వారితోనే చైనా కమ్యూనిస్టుపార్టీకి సంబంధాలు ఏర్పడ్డాయి కనుక, ప్రచారం కూడ మొదట నక్సల్‌బరీ ప్రాంతానికి దొరికినది కనుక, ఇతర ప్రాంతాలలో సాయుధ తిరుగుబాటు అంతకుముందు మొదలైనా, మొత్తం ఉద్యమానికి నక్సల్‌బరీ తరహా ఉద్యమమనే పేరు వచ్చింది. బెంగాల్ తీవ్రవాదులు, ఇక్కడిలా బంజరుభూముల పంపకం చేపట్టలేదు. కేవలం చోపిడీ మూకలను ఎదుర్కొనడంలోనే తమశక్తిని వినియోగించలేదు. ఎంతసేపటికీ మార్క్సిస్టు పార్టిపై కక్ష సాధింపు ధోరణితోనే వారు తమ ఉద్యమం కొనసాగించారు. అప్పుడు అధికారంలో భాగస్వా

మిగా ఉన్న సి. పి. యం. ను ఇరకాటంలో పెట్టి తప్పుడు పద్ధతులు అవలంభించి, అనేక మంది సి. పి. యం. కార్యకర్తలను బెంగాల్ విప్లవకారులు హత్యచేశారు.

సి. పి. యం. కార్యకర్తలకు వ్యతిరేకంగా, వారు పోలీసులతో, కాంగ్రెస్ కార్యకర్తలతో లాలూచీ అయారనే విమర్శలుకూడ ఉన్నాయి. ఈకార్యక్రమాన్ని పెకింగ్‌రేడియో పత్రికలు వేనోళ్ళ కొనియాడి సి. పి. యం. పై దుమ్మెత్తిపోయడం గమనించవలసిన అంశం.

శ్రీకాకుళం తీవ్రవాదులు వారి పోరాటం కూడ పెకింగ్ రేడియో, పత్రికలో ప్రాధాన్యతపొంది ప్రశంశించబడినా, ఈ పోరాటం బెంగాల్‌లో జరిగిన పోరాటానికి భిన్నంగా కొనసాగింది. శ్రీకాకుళం పోరాటానికి ప్రజాబలం కూడ విస్తృతంగా దొరికింది.

ఈ జిల్లా పీడిత ప్రజానీకానికి ఉద్యమాలు కొత్త కాదు. గత ముప్పయి నలభై ఏళ్లలో మార్కుపద్మనాభం, గంగుల తరుణాచార్య, గంధాళం గౌరయ్య వంటి కాకలుతీరిన కమ్యూనిస్టు నాయకులు ఎన్నో పోరాటాలకు ఆధిపత్యం వహించి, తమ పార్టీని నమ్మిన పీడిత ప్రజలలో ఆశలు చిగురింప చేసి, వారిలో ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించారు.

కొండ జాతివారు తమ ఎముకలు పిండి పండించుకున్న పంటలు,వారు సాగుకు యోగ్యం చేసుకున్న భూములు పావుకార్లు వడ్డి వ్యాపారుల పాలై పోకుండా నిరోధించేందుకు వారు అనేక పోరాటాలు జరిపారు. అయినప్పటికీ పీడిత ప్రజల ప్రయోజనాన్ని వారు పూర్తిగా పరిరక్షించ లేక పోయారు.

మండుటెండలో మలమల మాడుతూ రోజంతా రాళ్లుకొట్టి

రోడ్డు పని చేసినా, దినమంతా దుక్కిదున్ని వ్యవసాయం పని చేసినా రోజు కూలి ఆరణాలే. రూపాయి అప్పు తీసుకుంటే పద్ధీ కుంచెడు గింజలు!

పామనక పులిఅనక పుట్టనక పొట్టకోసం కాళ్లు వాచేట్టు కీకారణ్యాలలో తిరిగి మణుగు చింతపండు పోగుచేసుక వస్తే దొరికేది కిలో ఉప్పు లేకుంటే కొంచెం వంట నూనె.

ఎన్నో సితూరుల అనంతరం చీమకుట్టినట్టనుపించి సీమ దొరలు చేసిన శాసనాలు కాయితాల మీదనే అమలు. 1917 రెగ్యులేషన్ చట్టం ప్రకారం ఏజన్సీ ప్రాంతంలో భూములు అధికారుల నుండి ముందు అనుమతి లేకుండా బదలాయింపు జరగకూడదన్న నియమం ఎవరికీ "జ్ఞాపకమే' లేదు. 1956లో సవరించిన రూపంలో పాత రెగ్యులేషన్ చట్టం బూజు తొలగినా, వర్తకుల మోసాలు అరికట్టాలన్న మహదాశయంతో కార్పొరేషన్స్ వెలసినా, మెట్ట ప్రాంత మోతాదుల దోపిడీ ఆగలేదు.

గొర్రెలను తినే తెల్లవారు పోయి, బర్రెలను తినే తెల్లబట్టల వారొచ్చారా అని గిరిజనులు అనుమానించే అమానుష సంఘటనలెన్నో స్వాతంత్ర్యం వచ్చిన అనంతరం ఈప్రాంతంలో జరిగాయి.

అన్నీవున్నా అల్లుడి నోట్లో శని తొలగలేదన్నట్టు గిరిజనులపై ప్రకృతి దయ చూపినా ప్రభుత్వం దయచూపలేదు. సుసంపన్నంచేయగల స్వర్ణముఖివున్నా, నవశకానికి నాంది పలుకగలిగిన నాగావళి నదివున్నా, వాటిని ఉపయోగానికి తేలేదు. మహేంద్ర తనయ ముద్దు బిడ్డలై ఉండి వంశధార వంశీయులై ఉండి గిరిజనులు సేద్యపు నీటికి నోచుకొన లేదు. ఈ పరిస్థితులలో తమ హక్కుల కొరకు సదా పోరాడే గిరిజనులు అనారోగ్యం, ఆకలి

భరించలేక దోపిడీకి తట్టుకొని జంతువులలా జీవించలేక తుది ప్రయత్నంగా ప్రాణాలకు తెగించి విప్లవకారులైనారు. వీరికి నాయకత్వం వహించిన వారిలో అధిక సంఖ్యాకులు మెట్టప్రాంతాలవారే. ఉన్నత విద్యావంతులైఉండి, వివిధ వృత్తులలో గౌరవంగా బ్రతుకుతూ, చక్కగా గడిచేట్టు సంపాదన ఉండి కూడ వారు ప్రాణత్యాగానికి సిద్ధ పడ్డారు. అలాంటి వారిలో శ్రీ వెంపటి సత్యనారాయణ అగ్రగణ్యుడు. ఇతను పదిహేనేళ్లు కొండప్రాంతాలలో బడిపంతులు ఉద్యోగంచేసి స్థానికుల అలవాట్లు,ఆచారాలు సాంప్రదాయాలతోనే కాక వారి కష్టసుఖాలతో కూడ పెనవేసుకొని పోయారు.

మొదటి నుండి గిరిజనులకు అండదండలు కల్పించిన కమ్యూనిస్టుపార్టీ ఆ ప్రాంతంలో గట్టి పునాదులు నిర్మించుకున్నదని ఇంతకు ముందే పేర్కొన్నాను.

ఈ పార్టి అండతో తన మృదు సంభాషణ, దయాగుణంతో కొండవారి హృదయాలలో ఉన్నత స్థానం పొందిన సత్యనారాయణ 1959 నుండే గిరిజనసంఘాలతో సంబంధం పెట్టుకున్నారు. కసాయివారిలా కాలం గడుపుతున్న కాంట్రాక్టర్లతో, భూతాలవలె బ్రతుకుతున్న భూకామందులతో సంఘబలంవల్ల చర్చలు జరిపి ఈ ఉపాధ్యాయుడు గిరిజనుల కూలీరేట్లు అధికం చేయించాడు.

కొన్ని సంవత్సరాలు గడిచేసరికి సంఘబలంతో సకల దోపిడీలను సాహసంతో ప్రతిఘటించగల శక్తిగా ఈ ప్రాథమికోపాధ్యాయుడు రూపొందడంతో దోపిడీదారుల గుండెలలో దడ మొదలైంది. పరిస్థితి ఇలాకొనసాగితే తమ ఆట కట్టగలదని అనుమా

నించిన సంపన్నులు, ఈ బడిపంతులును బదిలీ చేయించారు.

చిత్తశుద్ధితో సంఘసేవ చేసేవారికి బదిలీలు బంధాలు కాజాలవు. పార్టితో సంప్రదించి సత్యనారాయణ తన ఉద్యోగానికే రాజీనామా చేసి, కూలీల ఉద్యమ నిర్మాణానికి ఊరూరు తిరిగారు.

సత్యం ధర్మం న్యాయానికి సత్యనారాయణ ప్రతిరూపుడయ్యాడు. ఎక్కడ దోపిడీ జరిగినా, ఎక్కడ అన్యాయం జరిగినా, ఎక్కడ దగా మోసం జరిగినా అక్కడ సత్యనారాయణ నీడ ప్రత్యక్షమై పేదలను ఆదుకొన్నది. శ్రీ సత్యనారాయణ మొండెంకల్ అనే గ్రామంలో నివసించేవారు.

గంగన్నవలస కాకలికొండలతో చుట్టుముట్టిన నీలకంఠాపురం భద్రగిరి మధ్యనఉన్నది ఈగ్రామం. అతి శీఘ్రకాలంలోనే ఈ ప్రాంతం మొత్తం సత్యనారాయణ సామ్రాజ్యంగా మారింది. ఆ సామ్రాజ్యం అంతటికీ తిరుగులేని అధిపతి అతడే. అక్కడ ప్రజలకు పార్లమెంటు, ప్రధాని, ప్రెసిడెంట్ ఉన్నారన్న సంగతి తెలియదు. వారికి సంబంధించినంతవరకూ సత్యనారాయణే సర్వస్వం.

1970లో నేను శ్రీకాకుళంలో పోరాట ప్రాంతాలు సందర్శించినపుడు మొండెంకల్లు కూడ వెళ్ళాను. అప్పుడప్పుడే బలహీనపడిపోతున్న ఉద్యమానికి ప్రతిరూపమా అన్నట్లు సత్యనారాయణ పూరిగుడిసె కూలిపోవడానికి సిద్ధంగా ఉన్నది. ఈ పూరిగుడిసె ప్రక్కనే ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం. అక్కడ చిన్నా పెద్ద అనేకమందితో నేను సత్యనారాయణ గురించి ప్రస్తావించాను. సత్యం నివసించిన గుడిసెవైపు చూస్తూ కొందరు

కన్నీరుకారుస్తూ మరికొందరు అతనితో తమ సంబంధాలను, అనుబంధాలను నెమరువేసుకొని బాధపడుతూ, అతని నిరాడంబర జీవితాన్ని గురించి, గుణగణాలగురించి గొప్పగా చెప్పారు.

వేలమంది సాయుధ పోలీసులు, వందలమంది గూఢచారులు అజ్ఞాతవాసంలో ఉన్న సత్యంకొరకు అనుక్షణం వేయికళ్లతో వెతుకుతున్నారని తెలిసి కూడ, చుట్టూవున్నవారు తమమాట వింటారనే భయంలేకుండా ప్రతినాడు ఆ పంతులును ప్రశంసించడం నాకే ఆశ్చర్యం వేసింది. ఊరూరు తిరిగి అతను ఉపన్యాసాలిచ్చినా పోలీసులకు చిక్కకుండా అతన్ని కనుపాపలా కాపాడారు. సత్యనారాయణవంటి సహృదయుడు ఆయుధం పట్టవలసిన అగత్యం ఏర్పడగలదని మేముకలలోకూడ ఊహించలేదంటూ, సమాజంలో కుళ్లునంతటిని వేలెత్తిచూపాడు ఒకవృద్ధుడు. సత్యనారాయణ చుట్టూ ఆ కోవకు చెందినవారే అనేక మంది విద్యావంతులున్నారు. 1965 ప్రాంతంలోనే ప్రతిభావంతుడైన యువశాస్త్రవైద్యుడు చేగంటి భాస్కరరావు, (గుంటూరు) చౌదరి తేజేశ్వరరావు, పాణిగ్రాహి సుబ్బారావు, ఆదిభట్ల కైలాసం, పంచాది కృష్ణమూర్తి, మామిడి అప్పలసూరి, నాగభూషణం పట్నాయక్ ప్రభృతులు అనేకమంది అతనితో తరచు చర్చలు జరుపుతుండేవారనీ, పేదల పరిస్థితి చూచి ఎంతో ఆవేదన ఆందోళన చెందేవారనీ నాకు చాలామంది చెప్పారు. వీరంతా తర్వాత అగ్రగామి నక్సలైట్ నాయకులుగా మారారు.

1965-67 మధ్యకాలంలో జరిగిన సభలు, సమావేశాలు ఉద్యమాలవల్ల, కొన్నిసమస్యలు పరిష్కారమవడంతో వ్యవసాయ కూలీ సంఘాలు బలాన్ని పుంజుకున్నాయి.

తలకు పదిపైసలు చందా చెల్లించి, గ్రామాలలో పీడిత

ప్రజలంతా ఈ సంఘాల సభ్యత్వం పొందారు. తమను తిమింగళంలా మింగగల పేదల సంఘటిత శక్తిని విచ్ఛిన్నం చేయాలని భూస్వాములు షావుకార్లు పన్నాగం పన్నారు. లేకుంటే తమకు కొండప్రాంతాలలో నిలువ నీడ ఉండదని వాళ్ళు భయపడ్డారు.

అందువల్లనే 1967 అక్టోబర్ మాసంలో కొందరు గిరిజనులు మొండెంకల్లులో జరుగనున్న సభలో పాల్గొనేందుకు ఊరేగింపుగా వెళ్తుండగా, అద్దె గుండాలతో దారికాయించి, వారిపై అఘాయిత్యం చేయించారు. భూస్వాముల కిరాయి గుండాలు జరిపిన కాల్పులలో ఇద్దరు మనుషులు అక్కడికక్కడే చచ్చారు. అనేకమందికి గాయాలు తగిలి ఎటువారటు చెల్లాచెదురైనారు. ఈ భీతావహ పరిస్థితిని అవకాశంగా తీసుకొన్న గుండాలు ఎందరో గిరిజన యువతులను మానభంగం చేసి, చేతికి దొరికినవారినల్లా చావబాదివదిలారు.

ఈ హింసాకాండ గిరిజనయువతులపై జరిగిన అత్యాచారం గిరిజనుల సంఘటిత శక్తిని, ఆగ్రహాన్ని, పట్టుదలను పెంపొందించాయి. నేరస్తులు ఆ తర్వాత నిర్దోషులుగా పేర్కొనబడ్డారు. వారికి పోలీసులు భూస్వాములు బాహాటంగానే సహాయం చేశారు. మొండెంకల్లు కాల్పుల అనంతరం జరిగిన ఈ పరిణామం అప్పటివరకు పోలీసులపై, న్యాయవ్యవస్థలపై గిరిజనులకు ఉన్న విశ్వాసాన్ని పూర్తిగా వమ్ము చేసింది.

శ్రీకాకుళం జిల్లాలో ఒకవైపు భూస్వాములు, షావుకార్లు మరొకవైపు గిరిజన సంఘాలకు మధ్య సంఘర్షణ రోజురోజుకు తీవ్రరూపం ధరిస్తూంటే మరొక వైపున ప్రభుత్వం ఈ పరిస్థితికి

మూల కారణాలు తొలగించక "వేచి చూడాలి" అనే పద్ధతి నవలంభించింది.

ఘర్షణలు నానాటికి పెరిగాయి. భూస్వాముల దోపిడీలు త్రిప్పికొట్టకపోతే వారిపై ఎదురు దాడులు జరపకపోతే తమ మనుగడకు ప్రమాదం వాటిల్లగలదనీ, దోపిడీ విధానం శాశ్వతం కాగలదని గిరిజనులు భావించారు.

ఈ పరిస్థితి పరిణామం 1968లో తొలిపర్యాయం గిరిజనుల ఏదురు దాడికి దారితీసింది.

జనవరి మాసంలో ఒకనాటి పట్టపగలు శ్రీ వెంపటి సత్యనారాయణ నాయకత్వంలో శీతంపేట సంతపై జరిగిన ఈ దాడి వ్యాపారులను హడలకొట్టింది.

సుమారు ఇదే సమయాన బర్ద్వాన్‌లో మార్క్సిస్ట్ పార్టి ప్లైనమ్ జరిగింది. కొందరు తీవ్రవాదులు ఈసమావేశాలలోనే తమ పార్టీనాయకత్వంపై ఎదురు దాడి జరిపి, సాయుధ విప్లవమే శరణ్యమని వాదించారు. ఆయుధాలు పట్టాలని అన్నవారిని అప్పటికే నాయకత్వం కొందరిని పార్టి పరిధినుండి వైదొలగించగా అ తర వాత విప్లవకారులైన కొందరు ఈ సమావేశంలొ పాల్గొన్నారు.

తర్వాత శ్రీకాకుళం విప్లవకారుడైన చౌదరి తేజేశ్వరరావు, తరిమెల నాగిరెడ్డి, దేవులపల్లి వెంకటేశ్వరరావు వారి అనుయాయులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. సమావేశాలలో అనంతరం జరిగిన సిద్ధాంత పరిచర్యలలో కూడ శ్రీకాకుళం నాయకులు శ్రీ పంచాది కృష్ణమూర్తి ప్రభృతులు పాల్గొన్నారు. తమ ప్రత్యామ్నాయ నిర్మానాలు బర్ద్వాన్ సమావేశంలో వీగిపోగా, ఈనాయ

కులు పార్టి అధికార తీర్మానాలకు కట్టుబడి ఉండక, తమ విప్లవ సిద్ధాంతాలు ప్రచారం చేసుకున్నారు. నచ్చచెప్పి, ఈ తీవ్రవాదులను తమ పంథాకు అనుకూలంగా మార్చుకోవాలని సి. పి. యం. నాయకత్వం చేసిన ప్రయత్నాలు ఫలించలేదు.

స్నేహంగా ఉన్న కొన్ని విదేశ పార్టీల నాయకుల ద్వారా, దౌత్య ప్రతినిధుల ద్వారా కూడ సి. పి. యం నాయకత్వం తీవ్రవాదుల మనస్సు మార్పించేందుకు విఫలయత్నాలు చేసింది.

శీతంపేట సంతపై జరిగిన సాహసోపేతమైన దాడి అధికారులకు అందోళనను కలుగజేసింది. పరిస్థితులు రోజురోజుకు తీవ్రరూపం ధరిస్తున్నవని నాటి జిల్లా కలెక్టర్ బి. ఆర్. కె. శాస్త్రి ప్రభుత్వానికి సుదీర్ఘ లేఖ వ్రాశారు. ఈ లేఖపై అత్యున్నత స్థాయిలో విపులంగా చర్చలు జరిపిన ప్రభుత్వం ఆ దశలో కూడ మూలవ్యాధికి కారణాలు తొలగించక, అదనపు పోలీసు బలగాలను అక్కడికి తరలించి గిరిజనుల తిరుగుబాటు అణచివేయాలని నిర్ణయించింది.

అదనపు పోలీసు పటాలాలు వెళ్లిన అనంతరం గిరిజన గ్రామాలపై ఒకవైపు పోలీసు దాడులు, రెండవవైపు వడ్డి వ్యాపారుల ఆగడాలు అవిచ్ఛిన్నంగా కొనసాగితే. ఇంకొకవైపున గిరిజనుల ఎదురు దాడులు కూడ పెరిగిపోయాయి.

అక్రమంగా దాచిఉంచిన ఆహారధాన్యాలు బలప్రయోగంతో వెలికితీసి పంచడం, సాయుధ దాడులు జరిపి వడ్డి వ్యాపారుల నుండి ప్రామిసరీ నోట్లు ఇతర దస్తావేజులు లాక్కోవటం, గిరిజన సంఘాల దైనందిన కార్యక్రమంగా మారింది. ఈ సంఘటనలు మరికొన్ని పోలీసు దళాలను ఆ ప్రాంతానికి రావించగా, గిరిజన

సంఘాల బలమూ పెరుగుతూ పోయింది. ఉద్యమాన్ని అణచాలని తాఖీదులు అందిన అధికారులు ఉద్యమ నాయకుల ఏరివేత కార్యక్రమం మొదలుపెట్టి వేలమందిని నిర్బంధానికి. చిత్ర హింసలకు గురిచేశారు.

ఈ తొలిదశలోనే శ్రీకాకుళం పోరాటాన్ని గొప్ప విముక్తి పోరాటంగా అభివర్ణించిన పెకింగ్ రేడియో పత్రికలు విప్లవకారుల సాహస చర్యలు ఎంతో ప్రశంసించడం జరిగింది. "విముక్తి దళాలు" వందల చదురపు మైళ్ళ ప్రాంతాన్ని తమ హస్తగతం చేసుకొన్నవని చెబుతూ, తెలంగాణ సాయుధ పోరాటం (1948-51) ఆ తర్వాత జరిగిన పోరాటాలను ప్రస్తావిస్తూ కూడ పెకింగ్ రేడియో సమీక్షలు ప్రసారం చేసింది.

శీతాకాలం అంత దాడి తర్వాత రెండునెలలకు పెద్ద ఖరజ గ్రామ సమీపాన కొందరు విప్లవకారులు పోలీసులు ఒకరికొకరు ఎదురైనారు. ఈ సందర్భంలో జరిగిన కాల్పులలో ఇద్దరు గిరిజనులు అక్కడికక్కడ మృతి చెందారు.

విప్లవకారుల ఉనికి తెలియగానే పోలీసులు నిర్విణ్ణులై నిల్చొవడం చారివెంట ఉన్న జిల్లాపోలీస్ అధికారి స్వయంగా కాల్పులు జరపవలసి రావడం ఈ సంఘటన విశిష్టత.

పై ఉదంతం అనంతరం, వత్తిడి అధికం కావడంవల్ల కొంతకాలంపాటు విప్లవకారులు తమ ఉనికి తెలియకుండా గడిపారు..ఈ దశలోనే వారు తమ సంఘాన్ని సంపూర్ణంగా సమర్థవంతంగా పునర్వ్యవస్థీకరించారు.

తుపాకులు, రివాల్వర్ మొదలైన ఆయుధాలు విల్లంబులు మొదలైన నాటు ఆయుధాలు ఉపయోగించడంలోను బాంబులు

విసరడంలొను తమ సభ్యులకు శిక్షణనుయిచ్చి, దళాలను కూడ ఏర్పాటు చేశారు. పోలీసులకంటె పరిష్టమైనగూఢచారి సంస్థను ఏర్పాటు చేసుకొనేందుకు నమ్మకస్తులను ఎన్నికచేసి శిక్షణ ఇచ్చారు. ఆయుధాలు, ఆహార ధాన్యాలేకాక మందులు కూడ నిల్వ చేసుకొన్నారు. తపు గూఢచారులు అంచలవారీగ వెళ్ళి సమాచారం అందించడానికి వీలుగా శిఖరాలు ఏర్పరచుకున్నారు.

ప్రతినేరంపై క్షుణ్ణంగా విచారణ జరిపేందుకు ఓపిక, సహనం సత్‌శీల గుణాలు కల మెడికెలవంటి కార్యకర్తలతో ప్రజాస్వామ్యస్థానాలు నెలకొల్పుకున్నారు.

క్షుణ్ణంగా చర్చించి, భావి కార్యక్రమం రూపొందించేందుకు అక్టొబరుమాసంలొనే దుడేపాడులొ సమావేశమై 14 మంది సభ్యులతో సమన్వయ సంఘాన్ని రూపొందించుకున్నారు. సుమారు వంద దళాలు ఐదురోజులు సమావేశమై చర్చలు జరుగుతుంటే బెంగాల్ విప్లవనాయకులు ముగ్గురు ఆ చర్చలలొ పాల్గొంటున్న అన్నీ తెలిసి వారి దరిదాపులకు వెళ్లెందుకు కూడ పోలీసులు సాహసించలేకపోయారు. తుపాకిగొట్టం ద్వారా రాజకీయ అధికారాన్ని హస్తగతం చేసుకోవాలన్న నిర్ణయం ఈ సమావేశంలొ పునరుద్ఘాటించబడింది. నవంబర్ 24 న గరుడభద్ర గ్రామంలొ ఒక షావుకారు తల క్రూరంగా నరకడంతో విప్లవకారులు తమ "వర్గ శత్రు నిర్మూలన" కార్యక్రమం మొదలుపెట్టారు.

ఈ దారుణ సంఘటన అనంతరం 24 గంటలు తిరగక మునుపే ప్రభుత్వయంత్రాంగం షాక్ నుండి కోలుకొనకముందే సత్యనారాయణ నాయకత్వంలొ పార్వతీపురం ఏజన్సీలొ మరొక మూలన పెదతొత్తిలి గ్రామంలో ఇంకొక సంఘటన జరిగింది.

స్థానిక పోలీసు ఇంటిపై జరిగిన దాడిలో ధాన్యం అక్రమ నిల్వలు వెలికితీసి పంచిపెట్టి ప్రోనోట్లును దగ్ధంచేశారు.

భూములను పంచడం, ప్రోనోట్లు గుంజుకోవడం వంటి కార్యక్రమాలసే ఖమ్మం, వరంగల్, అనంతపూర్ జిల్లాలలోని కొన్ని ప్రాంతాలలో నాగిరెడ్డి వర్గం నిర్వహించింది.

1968 జూన్‌లో మార్క్సిస్ట్ పార్టినుండి వైదొలగిన అనంతరం శ్రీ నాగిరెడ్డి కన్వీనర్‌గా అయన సహచరులు ఆంధ్రప్రదేశ్ విప్లవ కమ్యూనిస్టుల సమన్వయ సంఘంగా ఏర్పడినా శ్రీకాకుళం తీవ్రవాదులు వానితో పొత్తు పెట్టుకొనక స్వతంత్రంగా వ్యవహరించారు.

1968 అక్టోబర్ మాసంలో అఖిల భారత విప్లవ కమ్యూనిస్టుల కేంద్ర సమన్వయ సంఘంతో నాగిరెడ్డివర్గం అనుబంధం పొందిన తర్వాత, శ్రీకాకుళం జిల్లా సంఘాన్ని తమలో భాగం చేసుకునేందుకు నాగిరెడ్డి వర్గం చేసిన ప్రయత్నాలు సఫలం కాలేదు.

శ్రీ నాగిరెడ్డికి, ఇతర తీవ్రవాదులకు కొన్ని సిద్ధాంత విభేదాలు వచ్చాయి. పార్లమెంటు పంథాను తిరస్కరించాలనీ అక్టోబర్ 1968 లోనే తీవ్రవాదులంతా నిర్ణయించినా శ్రీ నాగిరెడ్డి 1969 మార్చివరకు శాసన సభ్యుడుగా కొనసాగారు.

నవంబర్ మాసంలో గరుడభద్రలో జరిగిన హత్య అనంతరం, శ్రీకాకుళం జిల్లాలో చాలా తీవ్ర పరిస్థితి ఏర్పడినదని ప్రభుత్వం భావించినది. అయితే, ఆ తర్వాత కొద్దిరోజులకు ఆ ప్రాంతాల పర్యటించిన రాష్ట్ర రెవెన్యూ మంత్రుల ఐ. జి. రాజు అంచనాలు పరిస్థితి మామూలుగనే ఉన్నదనే అభిప్రాయం

కలుగజేశాయి.

గిరిజనుల సమస్యలు పరిష్కరించడానికి, రెవెన్యూ మంత్రిగా తను గైకొనగల చర్యలు త్వరితగతిని గైకొనక, అయన ఒక చిట్కా వైద్యం సూచించారు.

గిరిజనులకు ఉచితంగా భజనచక్కలు పంచిపెడితే, వారు పోరాటాలకు స్వస్తి చెప్పి భజన చేసుకుంటారని శ్రీ రాజు అన్నారు.

అమాయకులైన గిరిజనులు, వారి సమస్యలపట్ల ప్రభుత్వం 1968 ఆఖరున కూడ ఎంత అలసత్వం వహించినదో ఈ ఉదాహరణ తెలుపుతుంది. ఎక్కువ సంఖ్యలో హత్యలు చేయకున్నా 1968 సంవత్సరంలో తీవ్రవాదులు 38 మందిని గాయపరిచారు.

దోపిడీలు దాడులతో ఉద్యమాన్ని సజీవంగా ఉంచినా వర్గ శత్రువుల ఏరివేత కార్యక్రమాన్ని శీకాకుళం తీవ్రవాదులు అవలంభించింది. 1969 ఫిబ్రవరి ఆరవతేదీన అని చెప్పవచ్చును. ఆ రోజున మొండెంకల్ గ్రామంనుండి ప్రసాదరావు అనే వ్యక్తి మరొక గ్రామం వెళ్లుతుండగా దారికాచి పొట్టివాడ సమీపాన హత్య చేశారు. అంతకు ముందు, జనవరి 16న పోలీసులు దోమాడ గ్రామంలో తీవ్రవాదులపై కాల్పులు జరపగా ముగ్గురు తీవ్రవాదులు గాయపడ్డారు. వారిలో ఒకరిని పోలీసులు పట్టుకొన్నారు.

ఫిబ్రవరి 13వ తేదీన గంగన్నదొర వలస సమీపాన కుటం కొండపైన ఒక పోలీసు దళంపై సుమారు 300 మంది సాయుధ గిరిజనులు దాడిచేయగా జరిగిన కాల్పులలో అర్ధిక

రజ్జమగడనే తీవ్రవాది చనిపోయాడు.

ఈ రెండు సంఘటనలలో, పోలీసులకు వేగులవాడిగా పని చేసి, తమ ఉనికిని తెలియజేశాడని తీవ్రవాదులు ప్రసాద్‌ను చంపారు. శ్రీకాకుళంలో హత్యలు సాయుధ సంఘర్షణల కొనసాగిస్తూనే శ్రీకాకుళంలో తీవ్రవాదులు నాయకులు మార్చి మాసంలో గుంటూరు జిల్లా కొండలో సమావేశమైనారు. రాష్ట్రంలో వివిధ జిల్లాలకు చెందిన ప్రతినిధులు ఈ సమావేశానికి హాజరుకాగా, తమ వర్గశత్రు నిర్మూలన విప్లవాన్ని ఇతర జిల్లాలకు విస్తరింప నిర్ణయించారు.

1968 నవంబర్, డిసెంబర్ మాసాలలో పెక్కు సమావేశాలలో, నాగిరెడ్డి వర్గం చూపిన స్నేహ హస్తాన్ని తృణీకరించిన శ్రీకాకుళం జిల్లా నాయకులు రాష్ట్రంలో వివిధ ప్రాంతాలనుండి ఆ జిల్లాలో పోరాటానికి విప్లవకారులను భర్తిచేశారు.

సుమారు గుత్తికొండ సమావేశం సమయంలోనే, నాగిరెడ్డి వర్గానికి అఖిలభారత సమన్వయ సంఘం గుర్తింపు రద్దుచేసింది. చైనా పార్టిపై ఈ వర్గానికి విశ్వాసం, గౌరవం లేదనీ, శ్రీకాకుళం పోరాటంపట్ల వారు సవతితల్లి ప్రేమ చూపుతున్నారనీ, నాగిరెడ్డి శాసన సభ్యత్వానికి రాజీనామా ఇవ్వకపోవడం ద్వారా, ప్రజాస్వామ్య పంథాలో విశ్వాస రాహిత్యాన్ని ప్రకటించలేదని ఆరోపణలు జరిగాయి. అయినా విద్వేషం లేకుండా తాము నాగిరెడ్డి వర్గంతో సానుభూతితో వ్యవహరించగలమని కూడ అఖిలభారత కమిటీ పేర్కొన్నది.

అనుబంధం రద్దు అయిన అనంతరం నాగిరెడ్డివర్గం ఫిబ్రవరి మాసంలో విజయవాడలో సమావేశం జరిపి పరిస్థితి సమీ

క్షించింది.

కేంద్ర సంఘం ఆరోపణలు యదార్థంకాదని పేర్కొంటూ, వివిధ విప్లవ సంఘాల మధ్య చర్చలద్వారా స్నేహ, సమన్వయాలు ఏర్పడవలసి ఉన్నదని తీర్మానించారు.

ఆంధ్రప్రదేశ్ సమన్వయ కమిటీ కమ్యూనిస్టు విప్లవపార్టీగా ఏర్పడాలని నిర్ణయించి, భావి కార్యక్రమం రూపొందించేందుకు ఏప్రిల్ 10-12 తేదీలలో రాష్ట్రస్థాయి సదస్సు ఏర్పాటు చేశారు.

నుమారు వందమంది ప్రతినిధులు పాల్గొన్న ఈ సదస్సు తిరువూరు తాలూకా అట్లూప్రగడ గ్రామంవద్ద ఒక నిమ్మ తోటలో రహస్యంగా జరిగింది.

తక్షణ కార్యక్రమం గురించి ఈ సమావేశంలోనే తీర్మానించారు. ఈ సదస్సుకు పదిరోజుల ముందుగానే శ్రీ నాగిరెడ్డి తమ శాసన సభ సభ్యత్వానికి కూడా రాజీనామా చేశారు.

"తక్షణ కర్తవ్యం"పై నిర్ణయం చేసిన అట్లూప్రగడ సదస్సు సాయుధ పోరాటం, ముందు వెనుక గైకొనవలసిన చర్యల గురించి, పోరాటం జరపవలసిన ప్రాంతాల గురించి వివరంగా తీర్మానించింది.

సదస్సు కాగానే విజయవాడ చేరుకున్న నాగిరెడ్డి, చంద్ర పుల్లారెడ్డి, రామనర్సయ్య, చిత్తుల వెంకటేశ్వరరావు, దేవులపల్లి వెంకటేశ్వరరావు సదస్సు నిర్ణయాలు తక్షణం అమలుజరపాలని భావించారు.

ఈ నిర్ణయంమేరకు పాల్వంచ తాలూకా పైడేరు ప్రాంతంలో పోరాటం సాగించేందుకు శ్రీ పుల్లారెడ్డి, జిత్తుల వెంకటేశ్వరరావు వెళ్ళారు.

శ్రీ రామనరసయ్య వరంగల్ జిల్లా నర్సంపేట వెళ్ళారు.

శ్రీ నాగిరెడ్డి అనంతపూర్ వెళ్ళారు. కానీ అయన ఒకచోట కేంద్రీకరించక వివిధజిల్లాలలోపర్యటించి పోరాటానికికార్యకర్తలనుసమ్మోహరించారు. ఏప్రిల్ చివరివారంలోనే ఖమ్మం, వరంగల్ జిల్లాలలో తీవ్రవాదులు ఎన్నో దాడులు జరిపారు. భూస్వాముల నుండి ఆయుధాలు కూడ స్వాధీన పరుచుకున్నారు. దాడులు మాత్రమే కాక భూములు పంచే కార్యక్రమంపై కూడ వారు శ్రద్ధ చూపారు. పోరాటం ప్రారంభం కావడానికి ముందే వారు అనేక కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు.

ఉత్తరప్రత్యుత్తరాలకు పార్టి కార్యక్రమాల నిర్వహణకు నాయకులందరూ వేరుపేర్లతో చలామణీ అయ్యారు. ఉదాహరణకు తరిమెల నాగిరెడ్డి. చలం, దేవులపల్లి వెంకటేశ్వరరావు, కృష్ణ పి. రామనర్సయ్య పి. ఆర్; చంద్రహల్లారెడ్డి, కుమార్, పెద్దన్న; మాచాల నారాయణస్వామి సలీమ్ సోమయ్య; డి. కృష్ణమూర్తి డి. కె. శేఖర్ వజ్రవేలు చెట్టి చలపతి, నెక్కలపూడి రామారావు. రాజారావు; వసంతాల రామలింగాచారి, రంగారావు; కె.పి, శాంతి రాజ్ రంజన్; మొగిల సోమాచారి, జగ్గన్నదొర కొర్లిపర పాండు రంగారావు, సూరి, నారన్న, టి. బాస్కరరెడ్డి, వాసు శ్రీమతినిర్మల రాధక్క కొర్లిపర చూన్సి రామక్క, రామ, శీతక్క ఇలా అందరికీ మారుపేర్లు ఉండేవి. ఎవరైనా దేశం వదిలిపోతే చనిపోతే ఆ కొత్తగా చేరిన మరొకరికి పెడతారు. ఉత్తరాల రహస్య సంకేతాలు పోస్టుద్వారా పంపక ప్రత్యేక దూతలద్వారా నిర్ణీత సమయాలలో నిర్ణీత ప్రాంతాలకు నిర్ణీత వ్యక్తులకు అందించేట్టు పంపేవారు ఈ"కారియర్స్"కు చాలా డబ్బు ముట్టచెప్పేవారు.

శ్రీ తరిమెల నాగిరెడ్డి, చంద్రహల్లారెడ్డి, శ్రీ రామనర్సయ్య

శ్రీ దేవులపల్లి ప్రభృతుల ఆధిపత్యంలో ఉన్న విప్లవకారుల కమ్యూనిస్టు పార్టి మాత్రమేకాక, మార్క్సిస్టు లెనినిస్టు పార్టిలో చేరిన శ్రీకాకుళం తీవ్రవాదులు కూడ, ఇతర జిల్లాలలో పోరాటానికి ఆధిపత్యం వహించారు.

హైదరాబాద్, మెదక్ జిల్లాలలో విద్యార్థులు యువకులపై శ్రీ కొండపల్లి శీతారామయ్య ప్రభావం, ఖమ్మం, వరంగల్ విద్యార్థులు యువకులపై శ్రీ కె. జి. సత్యమూర్తి ప్రభావం ఎక్కువగా కనుపించడం గమనార్హం. సత్యమూర్తి రెండేళ్లక్రితమే ఖమ్మంలో ఒక సత్రం దగ్గర నిర్బంధింప బడగా. శ్రీ శీతారామయ్య ఈ మధ్య నాగపూర్‌లో అరెస్టయ్యారు. ఆయా ప్రాంతాలలో పర్యటించి పలువురితో చర్చించి 1970 తర్వాత విప్లవ కమ్యూనిస్టు పార్టి పోరాటానికి సంబంధించిన వివరాలను, ఆ సందర్భంలో పోలీసులు జరిపిన కిరాతక చర్యలను వివరంగా తెలుసుకొనే అవకాశంలేకపోయింది. కొద్ది రోజులలో ఈ పుస్తకాన్ని రూపొందించి ముద్రించడంవల్ల వ్యవధిలేక, వనరులులేక, అత్యవసర పరిస్థితిలో జరిగిన దారుణాలు యువకుల హత్యలను గురించి భోగట్టా సేకరించేందుకు ఎక్కువ సమయాన్ని శక్తిని వినియోగించారు.

జీవితాంతం తనరక్తంలో ప్రతిబిందువూ ప్రజాసేవకే వినియోగించిన విప్లవకారుడు శ్రీ నాగిరెడ్డి గతసంవత్సరమే పరియైన వైద్యసౌకర్యానికి కూడ నోచుకోని విషాద పరిస్థితిలో కన్ను మూశాడు. అయినా విప్లవకారుల కమ్యూనిస్టు పార్టి చావలేదు.

శ్రీకాకుళం త్రీవవాదుల గుంటూరు సమావేశం అనంతరం రెండు నెలలో మే 18 వ తేదీ వరకు సాయుధ సంఘర్షణలు

అని చెప్పబడిన ఉదంతాలలో నలుగురు విప్లవకారులు చని పోయరు. శ్రీ రెడ్డిఅప్పలస్వామి, చనిపోయిన సంఘటనలో ఆది భట్ల కైలాసం, డాక్టరు మల్లిఖార్జునుడు, సంగమేసు, మజ్జి అప్పల స్వామి పట్టుబడ్డారు మే 18న జరిగిన 'సంఘర్షణ'లో ముగ్గురు— మాయక పేరయ్య, మాయక గోడేరయ్య, మాయక చంద్రయ్య చనిపోయరు.

ఈసంఘటన మర్నాడే బోరువంక గ్రామంలో ఒక భూస్వామి ఇంటిపై దాడి జరిపిన తీవ్రవాదులు బల్లాడ వెంకటేశ్వర్లు, బల్లాడ కృష్ణమూర్తి అనువారిని క్రూరంగా హత్య చేశారు. వారి రక్తంతో గోడలపై నినాదాలు చేశారు. ఈ దారుణ హత్యలకు తీవ్రవాదులవెంట వందల మంది గిరిజనులు నినాదాలుచేస్తూ వూరేగింపుగా వెళ్ళారు.

ఆ మర్నాడు మే 20న జరిగిన పోలీసుకాల్పులలో బి. జగ్గయ్య అనే విప్లవకారుడు, 26 న పైలాభీముడు చనిపోయారు. తర్వాత రెండు రోజులలోనే అగ్రనాయకుడు పంచాది కృష్ణమూర్తితో సహా పదకొండు మంది విప్లవకారులు పోలీసు తుపాకీ గుండ్లకు బలి అయినారు.

"26 వ తేదీ రాత్రి సోంపేట సర్కిల్ ఇన్స్పెక్టర్ ఒకదాడి జరిపి తిరిగివస్తుంటె సక్సలైట్లు ఆ బృందంపై కాల్పులు జరి పారనీ, పోలీసులు తిరిగి కాల్పులు జరపగా కృష్ణమూర్తితో సహా ఏడుగురు చనిపోయారు" అని పోలీసుకథనం. పోలీసులు ఎవరికీ గాయాలు కూడ తగలకుండా తీవ్రవాదులు వారిపై కాల్పులు జరి పారు."నమ్మశక్యంకాని ఈ కట్టు కథను చాలమంది ఖండించారు. డబ్బుకొరకు కలకత్తావెళ్ళి తిరిగి వస్తుండగా మే 24 ఉదయమే

శ్రీకృష్ణమూర్తినిసోంపేట రైల్వేస్టేషన్‌లో నిర్బంధించారనీ, తర్వాత రెండు రోజులు హింసించి చంపారని చాలమంది 1970 లో నేను శ్రీకాకుళం వెళ్లినప్పుడే పేర్కొన్నారు.

ఆశ్చర్యకర విషయమేమిటంటే విప్లవకారులు ఘోరాతి ఘోరంగా గొంతులుకోసినా, హతులరక్తంతో గోడలపై నినాదాలు వ్రాసినా, సహజంగా ఇలాంటి సంఘటనలపై కలిగే అసహ్యం కానీ, అందుకు కారకులపై కనుపించే కోపంకానీ ఉద్యమప్రాంతాల ప్రజలలో కన్పించలేదు. ఘాతుకంగా జరిగిన హత్యలకు దేశంలో రాజకీయపార్టీలన్నీ గర్హించాయి. ప్రజలుకూడ ఈ హత్యలను అవి జరిగిన తీరును ఖండించారు. ప్రతిహత్య గిరిజనుల సాంఘిక, ఆర్థిక పరిస్థితిలో కొంత మార్పు తెచ్చింది. ఒక వడ్డి వ్యాపారిహత్య అక్కడ అరవైచదరపుమైళ్ళ విశాలప్రాంతంలో పేదలకు బాధలనుండి విముక్తిని కలిగించినదని ఒక ఐ.ఏ.యస్ మరోక ఐ. పి. యస్. అధికారి నాతో చెప్పారు.

ప్రతిహత్య దాడి, దోపిడీకిముందు "ప్రజాస్వామ్యా"లతో క్షుణ్ణంగా చర్చజరిపిన అనంతరమే తుదినిర్ణయం జరిగేదనీ, అమాయకులెవరూ శ్రీకాకుళంలో హత్యకాలేదనికూడ పై అధికారులు ఈ రచయిత ప్రైవేటు సంభాషణలో పేర్కొన్నారు. హత్య జరిగినా, దోపిడీజరిగినా, గిరిజనులు నినాదాలుచేస్తూ వందల సంఖ్యలో తమనాయకుల అడుగుజాడలలో వెళ్ళేవారని తెలిసింది.

నక్సల్‌బరీ ఉద్యమం మొదలైన ఏడాదికి కమ్యూనిస్టు విప్లవకారుల అఖిలభారత సేవాన్యాయసంఘం ఏర్పడగా, రెండేండ్లకు అంటే 1969 ఏప్రిల్ మాసంలో విప్లవకారులు మార్క్సిస్టు,

లెనినిస్టుపార్టీని ఏర్పరచుకున్నారు.

సి. పి. యం. యల్. అవతరించిన కొద్దివారాలకే. ఉధృత ప్రత్యేకరాష్ట్ర ఉద్యమం మధ్య బ్రహ్మానందరెడ్డి తనమంత్రివర్గాన్ని పునర్నిర్మించినప్పుడు శ్రీ జలగం వెంగళరావు హోం మంత్రి అయ్యారు. తర్వాత కొద్దిరోజులలోనే "తుపాకీరామన్న" అనే బిరుదుపొందిన శ్రీ వెంగళరావు గిరిజనుల పోరాటాన్ని కేవలం శాంతిభద్రతల సమస్యగా భావించారు.

ఈ పోరాటంలో గిరిజనుల భాగస్వామ్యం విషయంలో ఆయన దృక్పధం ఒకటి, అందరిదృక్పధం ఒకటిగా కన్పించింది. అంతేకాదు ఈ అంశంపై ముఖ్యమంత్రి ఇతరమంత్రుల ప్రకటనలకు వెంగళరావు ప్రకటనలకు మధ్య వ్యత్యాసాలు కొట్టవచ్చినట్టు కన్పించాయి. పైగా తీవ్రపరిస్థితిని అంగీకరించకుండా శ్రీకాకుళం పరిస్థితిగురించి అలసత్వ; అసత్యప్రకటనలు చేయడానికి, బుకాయింపులకు శ్రీ వెంగళరావు వెనకాడలేదు.

పరీక్షలలో ఫేలయి నిరాశచెందిన విద్యార్థులు పని పాట లేక నిస్పృహలో ఉన్నవారు సాయుధపోరాటంలో చేరారనీ, ఈ ఉద్యమానికి ధ్యేయం కారణంకాదనీ, అందువల్లనే చాలా మంది పశ్చాత్తాపపడి ఉద్యమంనుండి బయటపడ్డారని శ్రీ వెంగళరావు నవంబర్ 1969లో ప్రకటించారు.

పట్టుబడిన నాయకులు లొంగిపోయిన నాయకులతో సగం మంది తమ తప్పిదాలు అంగీకరించి కన్నీరుమున్నీరుగా ఏడ్చారనీ (పోలీసులు చిత్రహింసలు పెడితే నవ్వుతారా) శ్రీ వెంగళరావు పేర్కొన్నారు.

గిరిజన ప్రాంతాలలో అభివృద్ధి కార్యక్రమాలు చేపడితే

తప్ప ప్రయోజనంలేదనీ, ఆర్థికాభివృద్ధికి వేరేమార్గాలు ఉన్నవనే నమ్మకం కలుగజేస్తేతప్ప సాయుధపోరాటంలో పాల్గొన్న కొండ వారు వెనకడుగు వేయరని శ్రీ వెంగళరావు తర్వాత గ్రహించారు.

1969 నవంబర్‌లో వెంగళరావు వెలడించిన అభిప్రాయాలు మరికొన్ని:-

సాయుధ పోరాటాన్ని విచ్ఛిన్నం చేసేందుకు గిరిజనులు వేలసంఖ్యలో ముందుకు వస్తున్నారు. నక్సలైట్స్ నేరాలను ప్రజలు అసంభవంచేసారు. శ్రీ వెంగళరావు ఈ ప్రగల్భాలను శ్రీ బ్రహ్మానందరెడ్డి అధికారుల సమావేశం ఒక దానిలో చేసిన ప్రసంగాన్ని పోల్చిచుస్తే గిరిజనుల సమస్యల విషయం వారివైఖరిలో వ్యత్యాసాలు కన్పిస్తాయి.

బ్రహ్మానందరెడ్డి ప్రసంగంలో కొన్ని అంశాలు:—

"దేశానికి స్వాతంత్ర్యం లభించి పాతికెళ్లు గడచినా ఇంకా అనేక ప్రాంతాలలో అసంఖ్యాక ప్రజానీకం అభివృద్ధి కార్యకలాపాల పరిధిలోనికే రాకపోవడం నిజంగా చాలాక్షంతవ్యమైన సంగతి."

"ఉదాహరణకు గిరిజలను తీసుకొండి. దశాబ్దాల తరబడి వారిని పూర్తిగా నిర్లక్ష్యం చేయడంవల్ల 'ఎక్కడ వేసిన గొంగడి అక్కడే' అన్నట్టు ఉన్నది వారి పరిస్థితి."

"ఈ మధ్యననే గిరిజనులు మన దృష్టి ఆకర్షించు (సాయుధ పోరాటం ఆరంభమైన అనంతరం) అందుకే 1970-71సంవత్సరం గిరిజన ప్రాంతాల అభివృద్ధి బడ్జెట్ ఒకటికి పదిరెట్లు పెంచటం

జరిగింది."

"గిరిజనుల సాంఘిక ఆర్థిక అభివృద్ధిని నిర్లక్ష్యంచేస్తే ఏర్పడే విషపరిణామాలు దేశమంతటినీ పెనవేసుకొని సాంఘిక విప్లవానికి దారి తీయగలవనే గుణపాఠాన్ని మనం నేర్చుకోవడం అవసరం. వారి అభివృద్ధికి చేయవలసినది ఇంకా ఎంతో ఉన్నది."

శ్రీ బ్రహ్మానందరెడ్డి జూన్ ఆఖరున ఢిల్లీలో పత్రికలవారితో మాట్లాడుతూ విప్లవకారులు ముందుగా హెచ్చరికలుచేసే దారుణ హత్యలు చేస్తున్నారనీ, వారుభూస్వాములనే హతమారుస్తున్నారనీ పేర్కొన్నారు. సాయుధ పోరాటాన్ని అణిచివేసేందుకుతాము సైనిక పటాలాలను వినియోగించ దలుచుకోలేదని కూడ బ్రహ్మానందరెడ్డి పేర్కొనడం గమనార్హమైన విషయం.

శ్రీ వెంగళరావు హోమ్ మంత్రి పదవీ బాధ్యతలు స్వీకరించిన కొద్దిరోజులకే అప్పటివరకు రాష్ట్ర అవినీతి శాఖడైరెక్టర్‌గా పనిచేసిన శ్రీ యం. వి. నారాయణరావును గూఢచారి నేరవిభాగం డి.ఐ.జి.గా నియమించారు. ఆ పదవిలో ఉన్న శ్రీసి.బి. పాటిల్‌ను కారాగారాలశాఖకు పంపించారు.

శ్రీకాకుళం, ఖమ్మం, వరంగల్ జిల్లాలో ఏర్పాటైన పెక్కు పోలీసుల శిబిరాలు చిత్రహింస కూటాలుగా "కబేళా"లుగా మారాయి.

ప్రభుత్వం ఎత్తుగడలో వచ్చిన మార్పులవల్ల అనేక మంది విప్లవకారులేకాక వారి సానుభూతి పరులు, సానుభూతి పరులని పోలీసులు అనుమానించిన అనేక మంది అమాయక ప్రజలు పురుగులలా నల్చివేయబడ్డారు. పోలీసుల ఆధునిక తుపాకీ

గుంట్లు ఎందరో అమాయకుల గుండెలను చీల్చుకెళ్లాయి.

కల్లోలిత ప్రాంతాలని ప్రకటించిన తాలూకాలలోని గ్రామల ప్రజలను పోలీసులు దూదిపీకినట్లు బాదడం, వందల మంది గ్రామాలు వదలి ఇతరస్థలాలకు పొట్టచేతపట్టుకొని పారిపోవడం జరిగింది. విచక్షణా రహితంగా నిర్బంధానికి గురిఅయిన ఎందరో మహిళలు పోలీసుల పాశవిక ప్రవర్తన మానభంగాలకు కూడ గురి అయినారు.

పొరుగునవున్న మధ్యప్రదేశ్, ఒరిస్సారాష్ట్ర సాయుధ పోలీసులతో సమన్వయంతోను, సహాయంతోను స్థానిక సాయుధ పోలీసుల కేంద్ర రిజర్వు పోలీసులు నక్సలైట్స్ రహస్య కేంద్రా లని చెప్పబడే స్థలాలపై దాడులు జరుపగా, నిర్బంధానికి గురి యైనవారిని కాల్చిచంపి వారు ఘర్షణలో చనిపోయారని పోలీ సులు కట్టుకథలు అల్లుతున్నారన్న ఫిర్యాదులు ఆ రోజులలో ఎన్నో వినిపించాయి.

వెంగళరావు హోంమంత్రి పదవీబాధ్యతలు స్వీకరించిన అనంతరం- జూలై, ఆగస్టు రెండు నెలలలో 32 మంది విప్లవ కారులు పోలీసుల తుపాకీగుండ్లకు బలిఅయారు.

మరీ దారుణ విషయమేమిటంటే ఆగస్టు 3న జరిగినదని అభివర్ణించబడిన సాయుధ సంఘర్షణలో, ఒకేసారి పదిమంది చని పోగా. వారందరినీ సమాధి చేసి "గుర్తు తెలియని మనుషులు"గా పోలీసులు వారిని పేర్కొన్నారు. వారం తిరగక మునుపే ఆగస్టు 8న జరిగిన "సాయుధ సంఘర్షణ"లో చనిపోయిన అయిదుగురు వ్యక్తులను కూడ గుర్తు తెలియని మనుషులుగా ఖననం చేశారు. గుర్తు తెలిసిన శవాల విషయంలోనే వారి బంధుమిత్రులు అన్నీ

తెలిసి కూడా నోరు మెదపలేని స్థితిలో ఉంటే గుర్తు తెలియని శవాల కొరకు ఏడిచేవారెవరు. ఈదేశంలో సెప్టెంబర్, అక్టోబర్ మాసాలలో మరొక డజను మంది తీవ్రవాదులు చనిపోగా, నవంబర్, డిసెంబర్ మాసాలలో—ఏడాది చివర పెరిగే ట్రాఫిక్ కేసుల సంఖ్యవలనే తీవ్రవాదుల మృతుల సంఖ్య పెరిగింది.

నవంబర్ 22న డాక్టర్ చాగంటి భాస్కరరావు, తామాడ గణపతితోసహా నలుగురు చనిపోయారు. ఈ తేదీనుండి నెలతిరగకమునుపే మరొక 15 మంది పోలీసు తుపాకీగుండ్లకు గురి అయినారు.

అయితే పైవారినందరినీ "నిర్బంధించిన అనంతరం పోలీసులు కాల్చివేశారు. దీనికి ప్రతీకారం తీసుకోవాలి" అని వారి పార్టీ అధికారపత్రిక లిబరేషన్ జనవరి 1970 సంచికలో వ్రాసింది. తేజేశ్వరరావు అంతకుముందే నిర్బంధించబడగా, శ్రీ వెంపటి సత్యనారాయణ, ఆదిపట్ల కైలాసం, జూలై 1970లో పోలీసు తుపాకీగుండ్లకు నేలకొరిగారు. ఈసంఘటనతో పోరాటం తిరుగుబట్టింది. 1970 మార్చి, ఏప్రిల్ మాసాలలో సాయుధపోరాటం అణగిపోతున్నదా అనే అభిప్రాయం ఏర్పడే సమయానికి విప్లవకారుల కార్యక్రమాలు నాలుగు జిల్లాలకే విస్తరించాయి. అక్కడక్కడ చెదురుమదురు సంఘటనలు జరిగినా వీరి ఉనికి ఆ ప్రాంతాలలో ఉధృతంగా కనిపించలేదు. విప్లవకారులు తమ బలాన్ని కేంద్రీకృతం చేసిన ప్రాంతాలు— శ్రీకాకుళం జిల్లాలో-పాతపట్నం, సోమ్‌పేట. టెక్కలి, ఇచ్ఛాపురం, పాలకొండతాలూకాలు, పార్వతీపురం తాలూకాలో కొన్ని ప్రాంతాలు, ఖమ్మంజిల్లా, నూగూరు, భద్రాచలం. బూర్గంపాడు మిల్లందు తాలూకాలు,

ఖమ్మం తాలూకాలో కొన్నిప్రాంతాలు.

'వరంగల్ జిల్లా:- ములుగు, నర్సంపేట, మహబుబాబాద్ తాలూకాలు.

కరీంనగర్ జిల్లా:- మంథని తాలూకాలో కొన్నిప్రాంతాలు.

అప్పటికే ఈ ప్రాంతాలన్నింటినీ కల్లోలిత ప్రాంతాలుగా ప్రకటించి ప్రభుత్వం క్రూరంగా, పైశాచికంగా వ్యవహరించేందుకు పోలీసులకు సంపూర్ణస్వేచ్ఛ ఇచ్చింది.

కొనఊపిరితోఉన్న శ్రీకాకుళం ఉద్యమానికి ఆధిపత్యం వహించే వారిలో ఇద్దరు ప్రముఖ నాయకులు శ్రీ నాగభూషణం పట్నాయక్, శ్రీ మామిడి అప్పలసూరికూడ వెంపటి చనిపోయిన కొద్దిరోజులకే కలకత్తాలో నిర్బంధానికి గురిఅయారు.

ఈవిధంగా నాయకత్వంఅంతా తుడిచిపెట్టుకొనిపోవడంతో విప్లవకారులదళాలు చెల్లాచెదరై కక్షసాధింపు మొదలుపెట్టాయి పోలీసులకు గూఢచారులుగా పనిచేశారని అనుమానించినవారిని కూడా విప్లవకారులు చంపివేశారు.

నక్సలైట్ ఉద్యమం అణగిపోవడానికి కారణం రాష్ట్ర, కేంద్ర పోలీసుల ప్రయత్నమేనని చెప్పడానికి వీలులేదు. వివిధ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి, గిరిజనుల స్థానికసమస్యలను కొన్నింటిని సానుభూతితో ప్రభుత్వం అవగాహన చేసుకోవడం వల్ల. విచక్షణారహిత చిత్రహింసలవల్ల కొందరు గిరిజనులు తీవ్ర వాదుల ప్రభావంనుండి బయటపడ్డారు.

ఇదికాక, నక్సలైట్స్ చేసినకొన్ని పొరపాట్లుకూడా వారి

సత్వర సంహారానికి కారణమైనాయి.

మినహాయింపులేకుండా నక్సలైట్ నాయకులందరూ దిన చర్య వ్రాసి ఉంచుకున్నారు. అందులోనే తమ సహచరుల దిన చర్యగురించికూడ తమకు తెలిసిన విషయాలు వ్రాశారు. ఈ డైరీలు పోలీసులకు దొరికినప్పుడు దొరకనివారిజాడ తెలుసుకొనేం దుకు రాందళాల వివరాలు బలం తెలుసుకొనేందుకు ఉపయోగ పడ్డాయి.

అటు కనుసన్యాల్, చారుమజుందార్ మధ్యఅభిప్రాయభేదాలు ఇటు శ్రీ వెంపటిసత్యనారాయణ, తరిమెలనాగిరెడ్డిమధ్య సిద్ధాంత విభేదాలుకూడ నక్సలైట్ ఉద్యమవిచ్ఛిత్తికి దోహదం చేసిన కార ణాలుగా పేర్కొనవచ్చును.

సంవత్సరంపాటు 3500 మంది సాయుధ రిజర్వుపోలీసులు రెండుబటాలియన్స్ కేంద్ర రిజర్వుపోలీసులతో శ్రీకాకుళంజిల్లా లోని ఆరు తాలూకాలలో పార్వతీపురం, పాతపట్నం, పాలకొండ, సోంపేట, టెక్కలి, ఇచ్ఛాపురం విప్లవకారులు సమరం జరిపారు.

అధికార లెక్కలప్రకారం శ్రీకాకుళంజిల్లాలోనే 1969లో నక్సలైట్స్ పాతికమంది హత్యచేసి ఖంటాట్‌లు చేశారు. 1970లో శాసనసభలో ఒక ప్రశ్నకు సమాధానం చెబుతూ 79 మంది తీవ్రవాదులు 1969లో పోలీసుకాల్పులకు గురియై చనిపోయారని చెప్పిననాటి హోంమంత్రి శ్రీ వెంగళరావు 1975లో ముఖ్య మంత్రిగా మరొకరిప్రశ్నకు జవాబుచెబుతూ 70 మంది చనిపో యారని అన్నారు. మొత్తం 151 కేసులలో పేర్కొన్న 1393మంది నిందితులలో 1264 మందిని నిర్బంధించడం జరిగినదని 1975లో అసెంబ్లీలో చెప్పారు. శ్రీ వెంగళరావు చనిపోయినవారిలో 2ని

మంది గురుకూడ తెలియలేదట.

1969 నవంబర్ మాసాంతానికే పోలీసులలో జరిగినట్టు చెప్పబడే "సంఘర్షణ"లలో నాయకులతోసహా మొత్తం 67 మంది చనిపోయారనీ, ఇద్దరు పోలీసులుకూడా వధించబడినారనీ ఢిల్లీ అంగ్లపత్రిక ఒకటి డిసెంబర్ మాసంలో ప్రకటించింది. 1969 మార్చి 1975 మధ్యకాలంలో 2320 మందిని నేరస్తులుగా పేర్కొంటూ 293 కేసులు నమోదుచేసినట్టు 1976 ఆగస్టు మాసంలో శాసనమండలి సభ్యుడు శ్రీ పాలడుగు వెంకట్రావుకు యిచ్చిన సమాధానంలో చెప్పారు శ్రీ వెంగళరావు.

1969 మొదటినుండి 1974 ఆఖరివరకు రాష్ట్రం మొత్తం మీద 110 మంది తీవ్రవాదులను పోలీసులు కాల్చిచంపారని 1975 జనవరి 25న శాసనసభలో శ్రీ యస్. పాపిరెడ్డికి చెప్పిన ముఖ్యమంత్రి, 1975 మార్చివరకు 157 మంది చనిపోయారని శాసనమండలిలో శ్రీ పాలడుగు వెంకట్రావుకు చెప్పారు.

అంటే 1975 జనవరి 25 మార్చి మధ్యకాలం రెండునెలల్లోనే 47 మంది తీవ్రవాదులు పోలీసులతో జరిగిన "ఘర్షణ"లలో చనిపోయారన్నమాట.

జూన్ 1975 నుండి అత్యవసర పరిస్థితి కాలంలో—తర్వాత నాలుగు నెలలు జులై వరకు పోలీసులలో జరిగిన 37 సాయుధ సంఘర్షణలలో 40 మంది తీవ్రవాదులు చనిపోయారని పోలీసు ఉన్నతాధికారి ఒకరు ఈ విలేకరికి చెప్పారు.

అంటే ప్రభుత్వం లెక్కల ప్రకారమే 1969—1977(జులై) మధ్యకాలంలో మొత్తం 197 మంది తీవ్రవాదులు పోలీసు ఘర్షణ

లలో చనిపోయారు.

1969–75 మధ్య కాలంలో తీవ్రవాదులు 120 మందిని చంపివేశారని ముఖ్యమంత్రి శాసనసభలో తెలుపగా, 1975–77 మధ్యకాలంలో 26 మందిని చంపారని పోలీసు అధికారులు ఈ రచయితకు చెప్పారు. అంటే తీవ్రవాదుల చేతులలో చచ్చినవారి సంఖ్య మొత్తం 146 అన్నమాట.

ఇదికాక–బెంగాల్ ఆంధ్ర నాయకులు మొత్తం 147 మందిని నిందితులుగా పేర్కొంటూ జనవరి 1970లో ప్రభుత్వం ఒకకుట్ర (పార్వతీపురం కుట్ర) కేసు నమోదుచేసింది.

ఈకేసు విచారణ 1974లో మొదలై 1976 ఆగస్టులో తీర్పు వచ్చింది. చనిపోయిన వారు పోగా నిర్బంధానికి గురి అయిన వారంతా తీర్పు వచ్చేవరకు జైళ్లలోనే. నలుగురు మహిళలు, ఒక డాక్టర్, ఒక మాజీ పార్లమెంటు సభ్యునితో సహా మొత్తం 75 మందికి ఈకుట్ర కేసులో జీవిత ఖైదు పడింది. నాగభూషణం పట్నాయక్‌కు మరణ శిక్ష పడింది.

నాగిరెడ్డితో సహా 68 మంది విప్లవకమ్యూనిస్టులపై నమోదు చేసిన కుట్రకేసు కాక ప్రభుత్వం మరొక నాలుగు కుట్రకేసులను కూడ పెట్టింది. ఈకుట్ర కేసులన్నింటికీ విడివిడిగా ప్రత్యేక న్యాయస్థానాలు ప్రత్యేక విచారణ.

చిత్రమేమిటంటేవివిధ నేరాలు ఆరోపించి ఒక కేసు పెట్టి ఆకేసులో తీర్పు వచ్చిన అనంతరం, వేరువేరు నేరాలపై మళ్లీ విడివిడిగా అదే వ్యక్తులను నేరస్తులుగా పేర్కొంటూ కేసులు

నమోదు చేసిన సంఘటనలు ఉన్నాయి.

దరిమిలా తమ కనుసన్నులలో ఉండే న్యాయవాదులకు ఇతరికి ప్రభుత్వం భృతి కల్పిస్తున్నది.

కుట్ర కేసులలో చెప్పుకోదగింది మరొకటి జననాట్య మండలి వారిపై పెట్టిన శ్రీకాకుళం కుట్రకేసు.

ఈ కేసులో 14 సంవత్సరాల బాలికతో సహా సాంస్కృతిక ప్రదర్శనలు యిచ్చే కళాకారులే కార్యక్రమం ఏర్పాటు చేసిన వారేకాక, స్టేజీకట్టిన వారు, లైటు వెలిగించిన వారు కూడ నిందితులుగా పేర్కొనబడి నిర్బంధంలో ఉన్నారు.

కుట్రకేసులలో ఉన్న నిందితులలో అధిక సంఖ్యాకులు యువకులు విద్యావంతులు వివిధ రంగాలలో తమతమ వృత్తులు నిర్వహించుకొని హాయిగా గౌరవంగా బ్రతక గలిగినవారే అవడం మరొక విశేషం. ఏదో రాజకీయ సిద్ధాంతాన్ని పెనవేసుకొని సమాజానికి సహాయపడాలని వారంతా రాజకీయాలలోకి దిగి బురదలో ఇరుక్కొన్నారు.

విప్లవకారులలో విభేదాలు రెచ్చకొట్టెందుకు, వారిపై ప్రజలకు హేయభావం కల్గించేందుకు పోలీసులు విప్లవకారుల పేరుతో వారిలో ఉన్న వర్గాల పేరుతో కొన్ని కరపత్రాలు వేయించి విప్లవకారుల సానుభూతి పరులను కొనుగోలు చేసి, ఈ కరపత్రాలను పంపకం చేయించారు.

ఈ కరపత్రాలు, కమ్యూనిస్టు సాహిత్యాన్ని విప్లవ పోరాటాలను బాగా అర్థంచేసుకొని, సిద్ధాంత విబేదాల గురించి, వ్యక్తుల స్వభావాల గురించిబాగా తెలిసిఉన్న ప్రవీణులలో వ్రాయించారు.

అందువల్ల కొన్ని నేరాలు కూడ విప్లవకారుల నెత్తిన రుద్దెందుకు పోలీసులు చేయించి ఉండ కూడదని ఏమిటి అని ప్రశ్నించే వారు ఉన్నారు.

ప్రభుత్వం యిచ్చిన లెక్కల ప్రకారమే 1971లో నలుగురు 1972లో నలుగురు, 1973లో ముగ్గురు తీవ్రవాదులు మాత్రమే చనిపొగా1974లో ఒక్కరుకూడ చనిపొయిన సంఘటన లేకపొగా, అత్యవసర పరిస్థితి కాలంలో తీవ్రవాదులు పెద్ద సంఖ్యలో ఘర్షణలలో చనిపొయారంటే సహజంగానే అందరికీ ఆశ్చర్యం కలుగుతుంది.

వెంగళరావు లెక్కల ప్రకారం 1974 సంవత్సరాంతానికి 110 మంది, 1975 మార్చి వరకు 157 మంది చనిపోయారు.

జూన్ 25, 1975, జులై 1977 మధ్య కాలంలో 40 మంది చనిపోయారనేది ఆయన లెక్క. అంటే మొత్తం 197. కాబట్టి ఆయన లెక్కప్రకారమే జనవరి 1975-జులై 77 మధ్య కాలంలో 87 మంది చనిపోయారన్నమాట. అత్యవసర పరిస్థితి కాలంలొనే 77 మంది చనిపొయారని తార్కుండే కమిటీకి తెలిసింది.

అత్యవసర పరిస్థితి గాడాంధకాఠం ప్రభుత్వపార్టీ రాజకీయ ప్రత్యర్థులు పెక్కుమందిని క్రూరంగా హింసించి ఘోరంగాకాల్చి చంపిన ఘనత ఆంధ్రప్రదేశ్ పోలీసులకు ఉన్నదని సర్వోదయ నాయకుడు, ప్రజాస్వామ్య పౌరహక్కుల సంఘ అధినేత శ్రీ జయ ప్రకాశ్‌నారాయణకు ఎన్నో ఫిర్యాదులు అందాయి.

తాము చంపిన ప్రతివారినీ పోలీసులు తీవ్రవాదులుగా చిత్రించి వారు పోలీసులతో జరిగిన సాయుధఘర్షణలో చనిపో

యూరని కట్టుకథలు స్మష్టించారనికూడ ఈఫిర్యాదు చేసినవారు ఆరోపించారు. చనిపోయినవారిలో కొందరు తీవ్రవాదులు ఉన్నప్పటికీ పెక్కుమంది విద్యార్థులు యువకులుకూడ ఉన్నారు.

ఈ ఆరోపణలపై హృదయం ద్రవించి ఎంతో మనస్థాపం చెందిన సర్వోదయనాయకుడు శ్రీ జయప్రకాశ్‌నారాయణ్ నిజానిజాలు విచారించేందుకు కొందరు పౌరహక్కులసంఘ సభ్యులతో ఒక కమిటీని గత ఏప్రిల్ మాసంలో నియమించారు.

బొంబాయి హైకోర్టు మాజీన్యాయమూర్తి సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ ప్రెసిడెంటు శ్రీ వి. యం. తార్కుండేసు అధ్యక్షులుగాను, ప్రముఖ న్యాయవాదులు శ్రీ యం. వి. రామమూర్తి, శ్రీ కె. జి. కన్నాభిరాన్, శ్రీ నబీ కృష్ణచౌదరి, శ్రీ అరుణ్ షవురీ. శ్రీ కె. ప్రతాపరెడ్డి, ప్రముఖపాత్రికేయుడు హిందుస్థాన్ టైమ్స్ మాజీ సంపాదకులు శ్రీ బి. జి. వర్గిస్, ప్రఖ్యాత రచయిత శ్రీ కాళోజీ నారాయణరావు హైదరాబాదు ఎడ్మినిస్ట్రేట్ స్టాఫ్ కళాశాల ఉపన్యాసకులు డాక్టర్ బల్వంతరెడ్డి ఈ కమిటీలో సభ్యులు.

ఈ కమిటీ తనకు అందిన సమాచారమంతటినీ సమగ్రంగా పరిశీలించి. తమలో కొందరిని రాష్ట్రంలో వివిధ ప్రాంతాలకు పంపించి, వారు సంఘర్షణ జరిపినట్లు చెప్పేస్థలాలకు వాస్తవంగా "హత్యలు" జరిగాయని పేర్కొనబడిన ప్రదేశాలను సందర్శించిన అనంతరం పలువురి సాక్ష్యాలు సేకరించే చర్యగైకొన్నది.

కొంతపని పూర్తి అయినతర్వాత మే నెలలో ఢిల్లీలో ఒక పత్రికాగోష్ఠి ఏర్పాటుచేసి పదిహత్యలకు సంబంధించిన బోగట్టాను తొలి మధ్యంతర నివేదికలో వెల్లడిచేశారు. అత్యవసర పరిస్థితి

కాలంలో ఆంధ్రప్రదేశ్‌లో మొత్తం 77మందిని చంపినట్లు తమకు సమాచారం అందినదని తార్కుండే తెలియజేశారు.

తొమ్మిది మంది మృతికి సంబంధించిన వివరాలు జూన్ మాసంలో తమ రెండవ మధ్యాంతరనివేదికలో వెల్లడిచేసి మొత్తం 19 మంది పౌరులను నిర్బంధించిన అనంతరం పోలీసులు కాల్చి చంపినట్లు తమ కమిటీకి సాక్ష్యాలుదొరికాయని పౌరహక్కుల సంఘం వెల్లడిచేసింది.

ద్వితీయనివేదికను కమిటీసభ్యుడు శ్రీ బి. జి. వర్గిస్ విడుదల చేశారు.

తమవద్దఉన్న సమాచారాన్ని, సాక్ష్యుల వాజ్మూలాలను తార్కుండేకమిటీ ప్రధానమంత్రికీ, కేంద్ర దేశీయాంగమంత్రికి అప్పగించింది.

మే 16న తుదినివేదికను విడుదలచేస్తూ తార్కుండేకమిటీ వెల్లడించిన వివరాలు క్లుప్తంగా ఇవి:-

"సాయుధ సంఘర్షణలు"గా అభివర్ణించిన, పదిమందిమృతికి కారణమైన మూడు సంఘటనల గురించి కమిటీ సాక్ష్యాన్ని సేకరించినది. వాటిలో రెండు సంఘర్షణలు అసలు జరగనే జరగ లేదని కమిటీకి నమ్మకం కలిగింది. మూడవసంఘర్షణకూడ నిజం కాదని చెప్పేందుకుకూడ చాలా ఆధారాలు కన్పిస్తున్నాయి.

ప్రతి సందర్భంలోను తమకు చేజిక్కిన వ్యక్తులను పోలీసులు ఎంత క్రూరంగా హింసించినదీ సాక్షులు వివరించారు. ఈ హింసాకాండలోని ఉద్దేశ్యం పోలీసులు ఇరికించిన కేసులలో

తాము నిజంగానే దోషులని వారిని అంగీకరింప చేయటానికేనని అర్థ మవుతుంది.

1973 క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ సెక్షన్.174లో నిర్దేసించిన ప్రకారం మృతదేహాలపై అధికారులు విచారణ ఏఒక్క సందర్భం లోను జరిపించలేదు.

ఈ హత్యలు జరిగిన పద్ధతి మాకు అవగతం అయినట్లు వివరిస్తున్నాము. సిగ్బంధించిన వారిని హింసించి చంపడంలో పాత్ర వున్నట్లు చెప్పబడే అధికారుల జాబితాను విడిగా కేంద్ర దేశీయాంగ శాఖ మంత్రికి అప్పగిస్తున్నాము. వివిధ సాక్షులనుండి మేము సేకరించిన సాక్షాల పత్రాలను కూడ దేశీయాంగ శాఖ మంత్రికి అప్పచెపుతున్నాము.

ఆంధ్రప్రదేశ్‌లో "సాయుధ సంఘర్షణ"లని పేర్కొనబడిన వాటిలో పౌరులు చనిపోయిన ఉదంతా లన్నింటిపైనా విచారణ జరిపేందుకు న్యాయ విచారణ సంఘాన్ని నియమించాలని కూడ కోరుతున్నాము. ఈ సంఘటనలు న్యాయవిచారణకు తగినవనీ, అత్యవసర ప్రజాప్రాముఖ్యత కలవనీ చెప్పడంలో ఏసందేహమూ లేదు.

మేము ఇంతవరకు సేకరించిన సాక్షం, ఇకముందు సేకరించనున్న సాక్షం మా మటుకు మేము విచారణ సంఘం ఏర్పాటు కాగానే ఆ సంఘానికి అప్పచెప్పడానికి సిద్ధంగా ఉన్నాము.

రెండు - మేము పేర్కొన్న పోలీసు అధికారులను విచారణ అయేవరకు తాత్కాలికంగా ఉద్యోగం నుండి తొలగించినట్లయితే

వారు సాక్ష్యాన్ని వమ్ము చేసే అవకాశం ఉండదు.

మూడు — విచారణ అనంతరం సంఘర్షణలు జరగడం అబద్ధమనీ, ఇవి కేవలం పచ్చి హత్యలని తేలితే మాత్రం అందుకు సంబంధించిన అధికారులందరినీ హత్యా నేరంపై విచారించి శిక్షించగలరని విశ్వసిస్తున్నాము.

నాలుగు—హత్యలు రుజువైతే మంత్రిత్వ స్థాయి బాధ్యత, మంత్రుల సమిష్టి బాధ్యత సూత్రాలను దృష్టిలో ఉంచుకొని అసలు ఖూనీ కోరులు తప్ప కోకుండా చూడగలరనీ, ఎవరో కొందరు జూనియర్ పోలీసు అధికారులను మాత్రమే దండించి సంతృప్తి పడరనీ విశ్వసిస్తున్నాము. ఒక్కసారికాదు పెక్కుసార్లు తను నక్సలైట్స్‌ను తుడిచి పారవేసినట్లు ముఖ్యమంత్రి శ్రీ వెంగళ రావు చేసిన ప్రకటనలు గుర్తుంచుకోవాలి.

అయిదు—పోలీసులు వారిపై అఘాయిత్యం చేయకుండా సాక్షులకు రక్షణ కల్పించాలి. రక్షణ కొరకు మేము చేసిన విజ్ఞప్తిని పురస్కరించుకొని కొందరు సాక్షులు హైదరాబాదులో కస్తూరీబాగాంధి సేవాసంఘ ఆశ్రమానికి మారుతున్నారు. అక్కడ వారు ఓంప్రకాశ్‌గుప్త (సర్వోదయ నాయకుడు) కనుసన్నలలో ఉంటారు. వారు పోలీసుల నుండి సురక్షితంగా ఉండేట్టుచూడాలి.

విచారణ జరిపించడానికి మేము సేకరించిన సాక్ష్యం తగినంత ఉన్నదనే భావిస్తున్నాము.

ఒకవేళ కేంద్ర ప్రభుత్వం తక్షణం న్యాయవిచారణకు చర్యలు గైకొనకపోతే మేము మా విచారణను కొనసాగిస్తు మేము సేకరించిన వివరాలు ఎప్పటికప్పుడు పత్రికలకు విడుదల

చేస్తాము.

ఎట్లాగయిన మా దృష్టికి వచ్చిన 77 హత్యా సంఘటనలపై మేము విచారణ కొనసాగిస్తాము. న్యాయవిచారణ జరిగితే సాక్ష్యం అంతటినీ అం ద చేస్తాము, లేకుంటే మేము వెల్లడిచేస్తూ పుంటాము.

ఈ హత్యల గురించి తెలిసిన వారు ఆ సమాచారమంతా భయాన్ని వదిలి, ముందుకు వచ్చి మాకు తెలుపవలసినదిగా ఆంధ్రప్రదేశ్ ప్రజలకు కూడ మేము విజ్ఞప్తి చేస్తున్నాము.

ఈ పని వారు బహిరంగంగా చేస్తేనే వారికి క్షేమకరమని కూడ మేము విజ్ఞప్తి చేస్తున్నాము.

ప్రతి సందర్భంలో ఒక సాక్షి తనకు తెలిసిన సమాచారంపై సాక్ష్యం ఇస్తే అతనికి తగిన రక్షణ కల్పించ వలసినదిగా మేము కేంద్రప్రభుత్వానికి విజ్ఞప్తి చేయగలము.

సంఘర్షణల పేరుతో జరిగిన హత్యలు

అత్యవసర పరిస్థితి ప్రకటించిన అనంతరమే మెదక్ జిల్లా గిరాయిపల్లి అడవులలో తొలి "సాయుధ సంఘర్షణ" జరిగినట్లు అభివర్ణించారు.

ఈ సంఘటనలో వరంగల్ రీజినల్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థి జనార్దనరావు, మురళీమోహన్‌రెడ్డి, సుధాకర్, ఆనంద రావు అనే నలుగురు చనిపోయారు. మాకు దొరికిన సాక్ష్యం ప్రకారం వెల్లడైన వివరాలు ఇవి:—

సిద్దిపేట తాలూకా సిరిసింగండ్ల గ్రామంలో జూన్ 22 రాత్రి

దొంతుల అంతయ్య అనే మనిషిని ఎవరో హత్య చేశారు. ఇది నక్సలైట్స్ పనే కావచ్చు ననేది పోలీసుల అనుమానం. మర్నాడే ఆ గ్రామ ప్రజలు వందమందిని పోలీసులు నిర్బంధంలోకి తీసుకొనివారిలో కొందరిని స్థానిక పోలీస్ స్టేషన్ లాకప్‌లో పెట్టి మరి కొందరిని గిరాయిపల్లి అడవులలో వున్న అటవీశాఖ అథితి గృహానికి తరలించారు. వారందరినీ దండించి ప్రశ్నించడం మొదలు పెట్టారు.

జనార్దన్‌రావు ములుగు పోలీసు స్టేషన్‌లో జూలై 16న కొందరికి కన్పించాడు. మిగతా ముగ్గురినీ—మురళీమోహన్‌రెడ్డి, సుధాకర్, ఆనందరావులను జూలై20న పోలీసులు ములుగు పోలీస్ స్టేషన్ లాకప్‌కు తోలించారు. వారందరినీ హింసించారు. ప్రతి ఉదయం వారిని గిరిపెల్లి డాక్ బంగళాకు తీసుకవెళ్లి రోజంతా నానా హింసలకు గురిచేసి, వారే నిందితులని గుర్తించవలసినదిగా సిరిసిరిగండ్ల గ్రామస్తులను హింసించి, ప్రతి సాయంత్రం ఈ నలుగురినీ ములుగు స్టేషన్ లాకప్‌కు తీసుకవెళ్లి నిర్బంధించాడు.

చిత్రహింసకు తట్టుకొనలేక, గ్రామస్తులపై చిత్రహింస ఆగిపోగలవన్న ఉద్దేశ్యంతో, తామే నేరం చేశామని ఈ నలుగురు అంగీకరించినట్లు కన్పిస్తున్నది.

నాలుగు రోజుల క్రూర హింసల అనంతరం జూలై 24 రాత్రి సుమారు 8 గంటలకు 'లాకప్' గదిలో లైట్లు ఆరాయి. నలుగురినీ ట్రక్కులో క్రుక్కి గిరాటుపల్లి అడవికి తరలించారు.

నలుగురునీ తలా ఒక చెట్టు దగ్గర నిల్చోబెట్టి గొంతు దగ్గర నుండి పాదాల వరకు తాళ్లు చుట్టి కట్టేశారు.

వాళ్లని కాల్చి చంపమంటే ఒక రిజర్వ్‌పోలీసు సబ్‌ఇన్స్

పెక్టర్ నిరాకరించాడు. ఆజ్ఞలు ధిక్కరించి అవిధేయత చూపినందుకు అతనిపై యస్. పి. గారికి ఆగ్రహం వచ్చి చీవాట్లు పెట్టారు.

తర్వాత కాల్చి చంపినప్పుడు వారు నలుగురూ నినాదాలు చేస్తు ప్రాణాలు విడిచారని సాక్షులు చెప్పారు.

ఈ నలుగురు సంగారెడ్డి అడిషనల్ సెషన్స్ కోర్టు ముందున్న మరొక కేసులో (ఎస్. సి. 3/1977) కూడ ముద్దాయిలుగా పేర్కొనబడ్డారు. 1975 ఆగస్టు 22న దాఖలు చేసిన ఒక రిమాండ్ రిపోర్టులో ఈ నలుగురు పారిపోయారని ప్రాసిక్యూషన్ వారు పేర్కొన్నారు.

ఈ హత్యలు పోలీసులు తమకై తాము జరిపినవి కావు అనే అభిప్రాయం మేము ఇప్పటి వరకు సేకరించిన సాక్ష్యం వివరాలు కలుగ జేస్తున్నాయి.

పౌరులు తమ చేతులలో చిక్కినప్పుడు పోలీసులు వారిపై అపసవ్యంగా ప్రవర్తించడం, కొన్ని సందర్భాలలో వారిని చిత్ర హింసలకు గురిచేయడం అర్థంచేసుకోవచ్చు. కాని మనుషుల చంపి వేయడం అంటే, రాష్ట్రంలో అత్యున్నత స్థాయి నుండి ఆదేశాలు మద్దతు ఉంటే తప్ప జరిగేపని కాదు. అందుకు పోలీసులు సాహసించరు.

పౌరుల హత్యలు న్యాయవిచారణ జరపడానికి అర్హమైనవని చెప్పడానికి మా దగ్గర ఉన్న సాక్ష్యం సరిపోగలదని ఇంతకు ముందే మేము చెప్పాము. ఇప్పుడు సేకరించిన సాక్ష్యం ఈ మా వాదనకు మరింత బలాన్ని ఇస్తున్నది.

హత్యలు జరగడం యదార్థమేనని విచారణలో తెలిస్తే బాధ్య

లైన వారి నీహత్యా నేరాలపై విచారించి శిక్షించాలనీ, మంత్రిత్వ స్థాయి బాధ్యత, మంత్రివర్గ సమిష్టి బాధ్యత సూత్రాలను కూడ విస్మరించటానికి వీలు లేదని ఇంతకు ముందు మేము వెలిబుచ్చిన అభిప్రాయాన్ని పునరుద్ఘాటిస్తున్నాము. రెండవ నివేదికలో తొమ్మిది హత్యల వివరాలు:-

1975 మే 21వ తేదీన గుంటూరు జిల్లా చెరుకుపల్లి పోలీస్ స్టేషన్‌పై దాడి జరిగింది. గుంటూరు జిల్లాలో జరిగిన తొమ్మిది హత్యలు ఈ సంఘటనకు ప్రతీకార చర్య అనిపిస్తున్నది. చెరుకు పల్లి దాడి అనంతరం చుట్టు ప్రక్క హరిజన గ్రామాలన్నింటిలో పోలీసులు భీతావహ పరిస్థితులు కల్పించారు. హరిజనులను చావ చితక బాది వారిని పశువుల మందల వలె తరిమికొట్టారు, వారి ఇళ్లు ధ్వంసం చేశారు. ధాన్యం, అపరాలను చెల్లా చెదరు చేశారు. అంతటితో ఆగక పంటలను నాశనం చేశారు. ఈభయానక పరిస్థితులలో హరిజనులు గ్రామాలు వదలి పెట్టి పోయేందుకు, నేరం చేసినట్లు వారితో ఒప్పించేందుకు పోలీసులు చాలా క్రూరంగా వ్యవహరించారని కూడ సాక్ష్యులు చెప్పారు.

లాగూక్రిందిభాగం తాడుతో గట్టిగాకట్టి లోపల తొండలను, ఊసరవెల్లులను వదిలితే ఎటుపోయేందుకు దారి కనుపించక క్రిందకు మీదికి పరుగెత్తి అవి వాళ్ళ కాళ్ళకండలు పీకిపెట్టి నపుడు లాగులు రక్తసిక్తమయ్యేవనికూడ సాక్ష్యులు తెలిపారు.

వెల్లికిలా పడుకోబెట్టి మోకాలివెనుక మడతక్రింద పైన వాసాలలాంటివిపెట్టి ఎముకలునలిగేపరకు పోలీసులు వాటిపై ఎక్కి త్రొక్కేవారనీ, బోర్లాపడుకోబెట్టి మోకాలివెనకమడతపై కట్టె

పెట్టి కాలు విరగతీసే వారనికూడ సాక్షులు తెలియజేశారు

పోలీసులు వారిని చుట్టుముట్టి నిలుచుని తలాఒకతన్నుతన్నడం, అందరూ వారిపై ఉమ్మివేసి అవమానపరచడంకూడ జరిగినట్టు సాక్ష్యాలు దొరికాయి.

చిలకలగుట్ట అడవి సంఘటన

ఈ సంఘటనలో శ్రీ పి. రామనర్సయ్య, జానిరెడ్డి అని పిలువబడే జానకిరామయ్య, నారాయణ, శ్రీహరి అనే నలుగురిని పోలీసులు కాల్చి చంపారని ఆరోపణ.

అజ్ఞాతవాసంలోవున్న రామనర్సయ్య కొంతకాలంగా హైదరాబాదులో తలదాచుకుంటున్నట్టు కనుపిస్తున్నది. 1976 జూలైలో ఆయన పాతమలక్‌పేటలో ఒక పోర్షన్ (16-9-402) అద్దెకు తీసుకున్నారు. ఆయింట్లో ఆయన అక్టోబర్ 30 వరకు కన్పించారు.

ఎలాగో రామనర్సయ్య జాడతెలుసుకున్న పోలీసులు ఇంటిని చుట్టుముట్టి అక్టోబర్ 31న రామనర్సయ్యను మరి ముగ్గురినీ నిర్బంధించారట.

వారందరినీ ఒకవ్యాన్‌లో వరంగల్ జిల్లా పాకాలవద్ద చిలకలగుట్ట అడవులకు తీసుకవెళ్ళినట్టు తెలిసింది. లోపలవున్న వారు కనుపించకుండా వ్యాన్‌ను టార్పాలిన్‌తో కప్పివేశారు.

అయినప్పటికీ రామనర్సయ్య మరిముగ్గురు లోపలనుండి అరవటం జరిగింది. ఈ అరుపులు అశోక్‌నగర్ గ్రామస్తులు విన్నారు. తమపేరు ఫలానా అనీ తమను చంపేందుకు తీసుక

వెళ్లుతున్నారనికూడ వారు పెద్దగా కేకలువేశారు.

చితికి కట్టెలు ప్రోగుచేయటానికి పోలీసులు కొత్తగూడెం గ్రామస్తుల సహాయం పొందారు. తగినరక్షణ కల్పిస్తే గ్రామాల వారుసాక్ష్యం ఇవ్వగలరని మార్క్సిస్ట్ శాసనసభ్యుడు శ్రీ ఓంకార్ కమిటీముందు ధృవపరిచారు.

జానిరెడ్డి తల్లి ఆరురోజుల అనంతరం తనకొడుకు మరణ వార్తవిని ఖర్మచేస్తుండగా, సూర్యాపేట పోలీసులు ఇస్తులాపురం వెళ్ళి తనకుమారుని మరణవార్త ఎలా తెలిసినదని అడిగారని ఇస్తులాపురం గ్రామానికిచెందిన జానిరెడ్డితల్లి కమిటీముంను వివరించింది.

నీలం రామచంద్రయ్య, జంపాల చంద్రశేఖర్ మృతి

1976 నవంబర్‌లో గుర్తుతెలియని ఇద్దరువ్యక్తులు ఇల్లందు అడవులలో పోలీసులతో జరిగిన సాయుధ సంఘర్షణలో మృతి చెందారని ఒకవార్త వెలువడింది.

తర్వాత జరిగిన ప్రకటనలలో ఈ ఇద్దరువ్యక్తులూ రామచంద్రయ్య, ప్రసాద్ కావచ్చుననే అర్థం స్ఫురించింది. ఈ సంఘటనపై కమిటీ సాక్ష్యాలు సేకరించింది.

నవంబర్ 3న గుంటూరులో ఈ ఇద్దరినీ కొందరు వ్యక్తులు చూచారు. విజయవాడ వెళ్లుతున్నామని అక్కడ అయిదవతేదీన కలవగలమనీ తమకు కలిసిననునిషితో వారు చెప్పారు. నవంబర్ 4 సాయంత్రం 6-30 గంటలకు వీరు విజయవాడలో ఒకమనిషికి చెప్పారు. గుంటూరులో, విజయవాడలో కలిసిన మనుషులకు

వారివద్ద ఆయుధాలు ఏమీ కనుపించలేదు.

తర్వాత ఫిబ్రవరి, మార్చి మాసాలలో శాసనమండలి సమావేశాలు జరుగుతున్న సమయంలో మాజీసభ్యుడైన రామచంద్రయ్య మృతికి సంతాపం తెలిపే తీర్మానం ఆమోదం పొందింది. సభలో కాంగ్రెస్‌పక్ష నాయకుడు ఈ తీర్మానం ప్రతిపాదించారు. కానీ రామచంద్రయ్య ఏ పరిస్థితిలో చనిపోయారో ఆయన తీర్మానంలో కానీ విడిగాకానీ తెలియజేయలేదు.

నాలుగవతేదీ సాయంత్రం విజయవాడలో కనుపించిన మనుషులు 4/5 తేదీ రాత్రి, విజయవాడకు 80 మైళ్ళ దూరాన ఇల్లందు సమీపఅడవులలో "సాయుధసంఘర్షణ"లో చనిపోయారని చెప్పబడటం, విజయవాడ-ఇల్లందుమధ్య కనీసం సరాసరి బస్ సౌకర్యాలుకూడ లేకపోవడం గమనార్హమైన విషయం.

రెండవ నివేదిక

జూన్ 12వ తేదీన తార్కుండేకమిటీ ద్వితీయ మధ్యాంతర నివేదికను బి. జి. వర్గిస్ పత్రికలకు విడుదల చేశారు. ఈ నివేదికలో తొమ్మిదిమంది మృతిచెందిన సంఘటనలపై విచారణ ఉన్నది.

నిర్బంధించినవారిని కాల్చిచంపించడమే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ అధికారవిధానమని ఇంతకుముందు ఏర్పడిన అభిప్రాయం, కొత్తగాదొరికిన సాక్ష్యాధారాలు ధృవపరుస్తున్నాయని ద్వితీయనివేదిక పేర్కొన్నది. ఇంకా ఇలాఉంది:-

దాడిచేసిన నిందితులు అని పోలీసులు తయారుచేసిన జాబితాలో దిగువ అయిదుగురుకూడ ఉన్నారు. వారంతా "సాయుధ

సంఘర్షణ"లో చనిపోయారు. వారు:- అట్లూరి మల్లిఖార్జునరావు, బి. జయరావు, రేగులగడ్డ సత్యానందం, రత్నం సూర్యవర్మ;

వీరిలో మొట్టమొదట అరెస్టయినవ్యక్తి మల్లిఖార్జునరావు అనుపిస్తున్నది.

1975 జూన్ మూడవతేదీ అనంతపూర్‌లో ఒక గదిలో మల్లిఖార్జునరావు మరొక యిద్దరుఉండగా చుట్టుముట్టిన పోలీసులు చేతులుఎత్తి బయటకు రావలసినదిగా వారిని ఆదేశించారు. ఆదేశాన్ని వారు సిరసావహించారు.

మల్లిఖార్జునరావును విడిగా వేరేవాహనంలో పంపించి, మిగతా ఇద్దరినీ అనంతపూర్ పోలీస్‌స్టేషన్‌కు పట్టుకెళ్లారు. మూడురోజులతర్వాత పోలీసులు ఈ ఇద్దరికీ ఒక పత్రికావార్త చూపించారు. 5' 7" ఎత్తుగల స్పోటకంమచ్చలుఉన్న ఒకమనిషి పోలీసులతో ఘర్షణలో చనిపోయాడనేది ఈవార్త. వినండి, మీకూ ఇదేగతి పడుతుంది అనికూడ పోలీసులు వారిని హెచ్చరించారు. మల్లిఖార్జునరావును చంపివేశారని మిగతాఇద్దరు అర్థం చేసుకున్నారు.

బి. జయరావు :- సెప్టెంబర్‌మాసంలో ఒకరోజు మధ్యాహ్నం దాచేపల్లి పోలీస్‌స్టేషన్‌కు చెందిన ఇద్దరు కానిస్టేబిల్స్— ఆదం, ప్రసాద్ గుంటూరు-మాచర్లబస్‌లో దాచేపల్లి స్టేజీలో దిగారు. వారికషడీలో బనియన్, అండర్‌వియర్‌తోఉన్న ఒక మనిషి కన్పించాడు. అతనిచేతులు వెనుకకువిరిచికట్టిసిఉన్నాయి. చెరుకుపల్లి పోలీస్‌స్టేషన్‌పై దాడికేసులో తనను తుమ్మలచెరువు వద్ద నిర్బంధించారనీ, తనపేరు జయరావ్‌అనీ అతను కేకలు

వేశాడు. అతను తన ఆధిపత్యం కొనసాగిస్తుండగనే పోలీసులు జయరావ్‌ను పోలీస్ స్టేషన్‌వైపు తన్నుకుంటూ తీసుకవెళ్లారు.

స్థానిక పౌరహక్కులసంఘం ఈ విషయం జిల్లాకలెక్టర్‌కు, పోలీసు రెవెన్యూ అధికారులకు టెలిగ్రామ్స్‌ద్వారా తెలియజేసింది. గుంటూరు తహసీల్దార్ అప్పుడు దాచేపల్లి ట్రావెలర్స్ బంగళాలో మకాంచేసిఉండగా అతనికి టెలిగ్రామ్‌ను పౌరహక్కుల సంఘ సభ్యులు స్వయంగా అందచేశాడు.

తర్వాత మూడురోజులకు జయరావ్, మరొకవ్యక్తి గుంటూరుకు ముప్పైమైళ్ళదూరాన కోటప్పకొండదగ్గర జరిగిన ఘర్షణలో చనిపోయినట్టు వార్త వచ్చింది.

కోటయ్య :- 1975 సెప్టెంబర్ ఆరవతేదీన మాచర్ల పార్క్ సెంటర్ సమీపాన ఒక పాన్‌షాప్‌దగ్గర కోటయ్య అరెస్టయాడు. శ్రీశైలంనుండి అంతకుముందు ఇద్దరు కానిస్టేబుల్స్ కిళ్ళీకొట్టు దగ్గరకు వచ్చారు. తర్వాత కొంతసేపటికి వచ్చిన కోటయ్య సిగరెట్ కొనుక్కొంటుండగా, ముందు వచ్చివెళ్ళిన వారిలో ఒక కానిస్టేబుల్- సుబ్రహ్మణ్యం తిరిగివచ్చి కోటయ్యను పట్టుకొన్నాడు. ఇద్దరికీ జరిగిన ఘర్షణలో కోటయ్య సుబ్రహ్మణ్యంను చాకుతో పొడిచాడు. గుంపులుగాకూడిన జనానికి ఇతడు రౌడీ అని పోలీసులు చెప్పడంతో జనంలోనుండి ఒక మనిషి కోటయ్యను పట్టుకొన్నాడు. తను రౌడీకాదనీ, తను ఒక కమ్యూనిస్టుఅనీ తనపేరు కోటయ్యఅని అతడు ఎంత అరిచినా ఎవరూ వినిపించుకోలేదు. అతనిచేతులు టవల్‌తోకట్టి ఇద్దరు పోలీసులు అతన్ని స్టేషన్‌కు తీసుకవెళ్లారు. సుబ్రహ్మణ్యంను గుంటూరు ఆస్పత్రికి చికిత్సకు పంపించారు. మూడురోజులతర్వాత కోటయ్య

"సాయుధ సంఘర్షణ"లో చనిపోయాడని పత్రికలుప్రకటించాయి. ఇతను బి జయరావ్‌తోపాటు చనిపోయిన "మరొకమనిషి" కోటయ్యయేనని మాకు దొరికిన సాక్షాలవల్ల తెలుస్తున్నది.

రేగులగడ్డ సత్యానందం (50), ఆయన భార్యను పోలీసులు 1976 జూన్ 13న కోపర్తిలో నిర్బంధించి తిమ్మాపురం వరకు నడిపించితీసుకవెళ్లారు. ఏణ్ణార్ధంపాప చంకనఉన్న శ్రీమతిసత్యానందు విలపిస్తూ నడిచింది. తిమ్మాపురం నుండి వ్యాన్‌లో బాపట్లకు తరలించి నపుడు దాంట్లో ఆమె సోదరుడు, అత్త కూడా ఉన్నారు. భార్యభర్తలు ఇద్దరినీ బాపట్ల పోలీసు స్టేషన్‌లో రెండు రోజులు చితక కొట్టారు. ఒక పోలీసు అధికారి ఆమె చంకలో పాపను లాగి కిందికి గిరాటు వేసి త్రొక్కడం జరిగింది.

సత్యానందాన్ని ఇంకాకొట్టే వీలులేకుండా కాళ్లు విపరీతంగా వాచిపోవడంతో నీళ్లు కాగ బెట్టి కాపేందుకు భార్యను పురమాయించారు. రక్తసిక్తమైన అతని బట్టలు మార్పు చేయాల్సి ఉన్నదనీ అందువల్ల వేరే జత బట్టలు తేసుకరమ్మని ఆదేసించి శ్రీమతి సత్యానందాన్ని పోలీసులు 15 సాయంత్రం ఇంటికి పంపించారు.

అతని బట్టలు తీసుకొని ఆమె 17వ తేదీ సాయంత్రం తిరిగి రాగా సత్యానందం కన్పించలేదు. అతనే వచ్చి బట్టలు తీసుకుంటాడులే నీవు వెళ్లి పొమ్మని పోలీసులు ఆమెను ఆదేశించారు.

15వ తేది రాత్రే సత్యానందంను తీసుకవెళ్లి పోలీసులు చంపివేశారనీ, ఈ విషయం ఎవరికైనా చెబితే అదే గతి పట్టగలదని ఆయనతో బాటు లాకప్‌లో ఉన్నవారినీ పోలీసులు హెచ్చరించారని సాక్షులు పేర్కొన్నారు.

19వ తేదీన మళ్ళీ సత్యానందం భార్యను నిర్బంధించిన

పోలీసులు 40 రోజుల పాటు నానా హింసలకు గురి చేశాను. ఆమె దాదాపు పిచ్చిదైపోగా పొన్నూరు పోలీసు స్టేషన్‌కు తరలించి ఐదునెలలు అక్కడ ఉంచారు.

షేక్ సుభాని:- వ్రతంగి పనివాడైన షేక్‌సుభాని వయస్సు 20. చిలకలూరిపేట. 1976 జనవరి 9 ఉదయం పోలీసులు అతని ఇంటికి వెళ్లి పోలీసు స్టేషన్‌కు రమ్మని పిలువడం చుట్టుపక్కల వారు చూచారు. సుభానీతో పాటు అతని సోదరుడు మరొక బంధువు ఇంటి ప్రక్కవారు కూడ స్టేషన్‌కు వెళ్లారు. అయితే చాలాసేపటివరకు అతనిని వదలక పోవడంతో వారంతా స్టేషన్ నుండి ఇంటికి వెళ్లారు.

మర్నాడు ఉదయం ఒక బంధువు భోజనం పట్టుకవెళ్లి స్టేషన్‌లో సుభానీకు యిచ్చాడు.

ఆ రోజు ఉదయం పది గంటలకు ఇద్దరు జవాన్స్ అతనిని బస్ స్టాండుకు తీసుకవెళ్లుతుండగా ఎవరో కనిపిస్తే, తనను గుంటూరు తీసుకవెళ్లు తున్నారనీ విడిపించే ప్రయత్నం చేయమని తన సోదరునికి చెప్పవలసినదిగా సుభాని కోరారు. అతని సోదరుడు స్థానిక కాంగ్రెస్ నాయకులను వెంట పెట్టుకొని మర్నాడు గుంటూరు వెళ్లగా ఎస్.పి. గారి దర్శనం కాలేదు. నిరాశతో వారు తిరిగి గ్రామం చేరుకున్నారు. అయిదు రోజుల తర్వాత సర్కిల్ ఇనస్పెక్టర్ గ్రామానికి వచ్చినప్పుడు సుభాని సోదరుడు మళ్ళీ స్థానిక కాంగ్రెస్ నాయకులను వెంటపెట్టుకొని ఆయన దర్శనానికి డాక్ బంగ్లాకు వెళ్లాడు.

ఇనస్పెక్టర్ సుభాని సోదరుడిని బయట ఉండమని మిగతా వారిని లోపలకుపిలిచి సుభానీని ఎప్పుడోకాల్చివేయడంజరిగిందని

.వెల్లడించాడు.

సుభాని తల్లి ఆరోగ్యం బాగా లేక పోవడం, సోదరుడు ఈ వార్తవింటే గుండెపగిలి చచ్చిపోగలడన్న అనుమానం రావటంతో స్థానికనాయకులు ఇనస్పెక్టర్ చెప్పిన సంగతి వారికి తెలుపలేదు.

సుభానీ ఎటో పోయాడనీ, అతను దొరికితే పోలీసులే ఇంటికి తెచ్చి అప్పచెప్పగలరని మాత్రం స్థానిక నాయకులు సుభానీ సోదరునికి, బంధువులకు చెప్పారు.

అత్యవసర పరిస్థితిలో అలుముకొన్న భయంతో సుభానీ బంధువులు అతనిని వెతికేందుకు విస్తృత ప్రయత్నమేమి చేయ లేదు. అయితే అత్యవసర పరిస్థితి తొలిగిన అనంతరం సుభానీ అదృశ్యం గురించి ముఖ్యమంత్రికి విజ్ఞాపన పత్రం సమర్పించు కున్నారు. పాపం సుభానీని పోలీసులు ఎప్పుడో హత్యచేశారనీ, అతనింక తిరిగిరాడని వాళ్లకేం తెలుసు.

రత్నం సూర్యవర్మ మరి ముగ్గురి హత్య:- 1976 ఏప్రిల్ 21న తెల్లారేసరికి ఆరుగురు పోలీసులు ఒక జీపులో ప్రకాశంజిల్లా గుడిపాడుచేరుకున్నారు. ఊళ్ళోపని చూచుకొని వాళ్లు తిరిగి వెళ్లే టప్పుడు నలుగురు మనుషులు గ్రామం వైపు నడుస్తుండడం కని పెట్టి జీపు ఆపి పోలీసులు వారి వెంట పడ్డారు. వారిలో ఇద్దరు గ్రామం వైపు పరుగెత్తగా మరి ఇద్దరు వెనుకకు తిరిగి రోడ్డు వైపు పరుగెత్తారు ఊరి వైపు పరుగెత్తిన వారిలో ఒకరిని పోలీసులు పట్టుకోగలిగారు. అతని పేరు రామారావు.

ఇంకొక వ్యక్తి దక్షిణ ప్రాంతం నుండి గ్రామంలో ప్రవే సించగా పోలీసులు అతనిని వెంటాడి అతనుకాలుజారి క్రింద

పడితే పట్టుకో గలిగారు వారిద్దరిని గ్రామం మధ్యలోపెట్టిన జీపు దగ్గరకు తీసుకవెళ్ళే సరికి అక్కడికి ఒక వాన్ వచ్చి ఆగింది. ఇద్దరినీ అందులో పడవేసి మిగతా వారి కొరకు పోలీసులు ట్రంకు రోడు వైపు వెళ్ళారు. జీపులో వెంటాడగా అయిదు కిలో మీటర్ల దూరాన ముగ్గురు మనుషులను పట్టుకోగలిగారు.

వారి పేరు రత్నంసూర్యవర్మ, రామకృష్ణ, బెంజామిన్ వారందరినీ ఆ రోజు అద్దంకి పోలీస్ స్టెషన్‌లో ఉంచి మర్నాడు ఒంగోలు యస్. పి. కార్యాలయానికి తరలించి అక్కడ ఉంచారు.

ఏప్రిల్ 24వ తేది ఉదయం కందుకూరు తాలుకా చేవూరు గ్రామం సమీపాన రైలు లైను ప్రక్కన ఉన్న అడవి చుట్టూ పోలీసుల సంచలనం కనిపించింది. దాదాపు వందమంది పోలీసులు తమ వాహనాలను లెవెల్ క్రాసింగ్‌దగ్గర ఆపుచేసి దిగారు జనమెవరినీ అటు వెళ్లనీయలేదు, కార్యక్రమం పూర్తి చేశారు.

ఉదయం పది గంటలకు కందుకూరు తహసీల్దార్ పంచ నామాకు వెళ్లగా అతని వెంటఉన్న చేవూరు మునసబును మాత్రం పోలీసులు లోపలికి వెళ్లనీయలేదు. అయితే, అడవిలో జరిగిన కాల్పులలో చనిపోయిన మృతదేహాలు సమాధిచేసేందుకు వెట్టి వారు కావాలని మాత్రం మున్సబుకు పోలీసులు తాఖీదు ఇచ్చారు.

మోతాదుల సహాయంతో మునుసబు అట్టి వారిని పిలిపించ గా వారు సాయంత్రం వరకు అక్కడ నిరీక్షించిన తర్వాత అడ విలో నుంచి వచ్చిన వాహనంలో దీగిన పోలీసులు ఏడుగురు వెట్టి వారిని వెంట తీసుక వెళ్లారు.

గజంగజం దూరంలో ఒకదాని వెంట ఒకటి పడుకోబెట్టిన

నాలుగు శవాలు వెట్టి వారికి కనుపించాయి. శవాలను పూడ్చి పెట్టినందుకు వెట్టివారికి తలా అరురూపాయలు కూలి చెల్లించారు.

ఏప్రిల్ 26న రావూరు కరణాన్ని, చేవూరు మునుసబును సింగరాయకొండ పిలిపించిన పోలీసులు, మృతుల ఫోటోలను, పోస్టుమార్టం రిపోర్టును చూపించి కాయితాలపై వారి సంతకాలు తీసుకున్నారు. తాము భయపడి సంతకాలు చేసినట్టు వారు కమిటీకి సాక్షం యిచ్చారు.

కొన్నాళ్ల అనంతరం ఒంగోలు ఆర్. డి. ఓ. ఈ కాల్పుల సంఘటన రహశ్య విచారణ జరిపినప్పుడు కూడ పోలీసులు పిలిపించి చెప్పమన్నట్లు ఈ మున్సబు, కరణం సాక్షం చెప్పారు. వాళ్లు చెప్పమని కోరినట్టె చెప్పాలని తహసీల్దారు కూడ గ్రామాధికారులను ఆదేసించారు.

ఈ శవాలకాళ్లు విరిగిఉన్నాయనీ అయితే అవి తుపాకి గుండుతగిలి విరిగినట్టు కన్పించలేదనీ, ప్రతిశవానికి ఒకటిరెండు తూటాగాయాలు ఉన్నాయని పోస్టుమార్టం రిపోర్టు పేర్కొన్నది.

దారుణంగా ఈ హత్యలు జరిగిన అనంతరం మార్కాపూర్ డిప్యూటీ పోలీస్ సూపరింటెండెంట్ నీరసించి ఆందోళనతో కన్పించడం స్థానిక ప్రజలు గమనించారు; పోస్టుమార్టం, మెడికల్ ఆఫీసర్‌ను అడవిపొదలలోకి పిలిపించి జడిపించారనికూడ సాక్షులు వివరించారు.

గుడిపాడులో అరెస్టుచేసిన అయిదుగురిలో నలుగురు ఈ అడవిపొదలలో కాల్చివేయబడినారనీ, మృతులలో రత్నం,

సూర్యవర్మకూడ ఉన్నారని విశ్వసనీయ సమాచారం కమిటీకి దొరికింది.

ఏప్రిల్ 24న పోలీసులతో జరిగిన సాయుధ సంఘర్షణలో నలుగురు నక్సలైట్స్ చనిపోయినట్లు, మామూలు ప్రకారం ఆ తర్వాత పత్రికలు ప్రకటించాయి.

చిత్రహింసలుచేసి కాళ్లు, ఎముకలు విరగగొట్టిన పోలీసులు ఈ నలుగురినీ వదిలినా వాళ్లు నడవగలిగేవారు కాదు—

-: o :-

ఆ 222

నక్సలైట్ల పేరుతో నిర్బంధించిన పౌరులను
పోలీసులు కిరాతకంగా హింసించి కాల్చి
చంపిన సంఘటనల వివరాలు, తీవ్రవాదుల
పోరాటం పూర్వాపరాల సమగ్ర సమీక్ష
కూ ప్రచురణ

HANTAKULEVARU
(WHO ARE THE MURDERERS)

BY

ADIRAJU VENKATESWERA RAO

PUBLISHED BY

M. SESHAGIRI RAO

FOR VELUGU PUBLICATIONS

VUNDRAJAVARAM, WEST GODAVARI DT..

Check List

Book Number	NPR076BCA433	Date	14/04/23
Front Cover	Yes	Back Cover	Yes
Blank Pages	2, 191		
Missing Pages	NIL		
Prepared By	Heena	Cutting By	Heena
Scanned By	Swathi	Pages	127
Quality Checking	Ramya		